తిరుమల తిరుపతి దేవస్థానములు

సప్తగిరి

సచిత్రమాసపత్రిక

అక్టోబరు 2017
వెల రూ.5/-



తిరుమల
శ్రీవారిఆలయంలో
దీపావళి ఆస్థానం
(19-10-2017)



తిరుచానూరు
శ్రీ పద్మావతీఅమ్మవారి బ్రహ్మోత్సవాలు - 2017
నవంబరు 15 నుండి 23 వరకు

15-11-2017
బుధవారం
పగలు: ధ్వజారోహణం
రాత్రి: చిన్నశేషవాహనం

16-11-2017
గురువారం
పగలు: పెద్దశేషవాహనం
రాత్రి: హంసవాహనం

17-11-2017
శుక్రవారం
పగలు: ముత్యపుపందిరివాహనం
రాత్రి: సింహవాహనం

18-11-2017
శనివారం
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: హనుమద్వాహనం

19-11-2017
ఆదివారం
పగలు: పల్లకీ ఉత్సవం
రాత్రి: గజవాహనం

20-11-2017
సోమవారం
పగలు: సర్వభూపాలవాహనం
రాత్రి: గరుడవాహనం

21-11-2017
మంగళవారం
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం

22-11-2017
బుధవారం
పగలు: రథోత్సవం
రాత్రి: అశ్వవాహనం

23-11-2017
గురువారం
పగలు: చక్రస్నానం
రాత్రి: ధ్వజావరోహణం

గీతాశ్లోకార్థసారం

శ్లో : అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥ (భగవద్గీత-9-22)



ప్రతిపదార్థం : అనన్యాః= నన్నే ఆశ్రయించిన; యే జనాః= ఏ జనులు; చిన్తయన్తః= ధ్యానిస్తూ; మాం పర్యుపాసతే= నన్ను సేవిస్తున్నారో; నిత్యాభియుక్తానామ్= సతత యోగయుక్తులైన; తేషాం= వారి; యోగక్షేమమ్= పొందని వాటిని పొందడం, పొందినదాన్ని రక్షించడం అనే విషయాలను; అహం= నేను; వహామి= మోయుచున్నాను.

భావం : నన్ను ఎవరు ఆత్మభావంతో కోరికలేవీ లేక శ్రద్ధగా పూజింతురో మరియూ నిత్యమూ నన్నే చేరుకోవాలని తపించే వారి యోగక్షేమాలను నేనే భరిస్తాను.

ఊరకే దొరకునా ఉన్నతోన్నత సుఖము?

ఊరకే దొరకునా ఉన్నతోన్నత సుఖము
సారంబు దెలిసికా జయము చేకొనుట

తలఁపు లోపలిచింత దాఁటినప్పుడు గదా!
అలరి దైవంబు ప్రత్యక్షమౌట,
కలుషంపు దుర్మదము గడచినప్పుడు గదా!
తలకొన్న మోక్షంబు తనకుఁ జేపడుట

కర్మంబు కసటువోఁ గడగినప్పుడు గదా!
నిర్మలజ్ఞానంబు నెరవేరుట,
మర్మంబు శ్రీహరి నీ మఱఁగు చొచ్చినఁ గదా!
కూర్మిఁ దన జన్మ మెక్కుడు కెక్కుడౌట

తనశాంత మాత్మలోఁ దగిలినప్పుడు గదా!
పనిగొన్న తన చదువు ఫలియించుట
ఎనలేని శ్రీవేంకటేశ్వరుని దాస్యంబు
తనకు నచ్చినఁ గదా దరిచేరి మనుట

(సంపుటం-02, సంకీర్తనం-104)



ప్రయత్నించకపోతే లోకములో ఏదీ లభించదు. ఎంత గొప్ప లాభాన్ని కోరుకుంటామో, అంతగొప్ప ప్రయత్నాన్ని చేయాలి మనము. కానీ, ప్రతి జీవి 'సుఖమునే' కోరుచున్నది. సుఖము - నిత్యము, అనిత్యమని రెండురకాలు. ప్రాపంచిక సుఖాలన్నీ అనిత్యాలే. మోక్ష సుఖమొక్కటే నిత్యము. అందుకే అది 'ఉన్నతోన్నత సుఖము'గా అన్నమయ్య కీర్తిస్తున్నాడు.



మీ మాట

నిత్యసేవలు

జూలై, 2017 వెలువడిన 'సప్తగిరి'లో "నిత్యకల్యాణస్వామికి ప్రతినిత్యమూ సేవలే!" గురించి శ్రీమతి వి.అరుణ చక్కగా వివరించారు. మా కుటుంబసభ్యులు చూసి, చదివి దివ్యానుభూతికి లోనయ్యాము. చాలాకాలం నుండి నిత్యసేవలు గురించి మీకు వ్రాసి తెలుసుకుందామన్న కోరిక తీరింది. స్వామియే పరోక్షంగా ప్రచురణ ద్వారా మా కోరిక తీర్చారు.

ఇంకా, జూలైనెల పత్రికలో మంగళగౌరీవ్రతం, ప్రహ్లాదుడు, సుదర్శనమహిమ, గరుడస్వామి వ్యాసాలు చాలా బాగున్నాయి. చాతుర్మాసాలు గురించి రచయిత బాగా వివరించారు. వేంకటేశ్వరలీలలు చదివి తన్మయత్వం చెందాము.

- శ్రీధర్, శ్రీవిశాలాక్షి కుటుంబసభ్యులు, నెల్లూరు.

-ఎం.వేంకటమహాలక్ష్మి, కృష్ణాజిల్లా.

అభినందనలు

2017, జూలై 'సప్తగిరి' సంచిక రంగురంగుల చిత్రాలతో కదురమ్యంగా ఉంది. సప్తగిరి మాసపత్రికను స్వల్పధరలకు అందించడం ముదావహం. సప్తగిరిలో వచ్చే కథలు, వ్యాసాలు, పద్యాలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి.

- బాలబాంధవ గంగరాజు మోహనరావు, ఆవడి, చెన్నై.

మనోరంజకం

ఆగష్టు నెల 'సప్తగిరి' మాసపత్రికలో "గోవుమా లక్ష్మికి కోటిదండాలు" అనే వ్యాసం చాలా బాగున్నది. మధ్యపేజీల్లో శ్రీవారి చిత్రాలు ఆధ్యాత్మిక మనోరంజకంగా ఉన్నాయి. రంగుల్లో వెలువడుతున్న సప్తగిరి సామాన్య భక్తునికి చేరువలో అతి తక్కువ ధరకు లభించడం తెలుగు వారికి గర్వకారణం. నెలనెలా సప్తగిరిని అందంగా తీర్చి దిద్దుతున్న సంపాదకవర్గానికి నా అభినందనలు. విజయవాడ శ్రీవారి వైభవోత్సవాల గురించిన చిత్రాలు బాగున్నాయి.

- ఎల్.ప్రఫుల్లచంద్ర, ధర్మవరం.

ఆధ్యాత్మిక విశేషాలు

నెలనెలా సకాలంలో అందుచున్న 'సప్తగిరి' మాస పత్రిక గొప్ప ఆధ్యాత్మిక అనుభూతిని కల్గిస్తున్నది. తిరుపతి తిరుమలలో ఉన్నట్లుగా ఆనందపరవశం గావిస్తున్నది. కొండలో కొలువైన కోటి జ్ఞానకాంతుల స్వామి, పళని దండా యుధ సుబ్రహ్మణ్యస్వామివారి, అమృతమూర్తి మహిమాన్విత విశేషాలు చదివి మాకు తెలియని ఆధ్యాత్మిక విశేషాలు తెలుసుకున్నాము. ఋషిపంచమినాడు సప్తఋషులగూర్చి తెలుసుకోవడం, వామన అవతార ఘట్టం పారాయణ చేయడం మంచిదని తెలుసుకున్నాం.

- జె.సుధాకర్ పట్నాయక్, కాకినాడ.

బాగుంది

'సప్తగిరి' రంగురంగులతో ఆకర్షణీయంగా ఉంది. విషయాలన్నీ కూడా బాగా ఉన్నాయి. చదివేందుకు చాలా ఇష్టపడుచున్నాం.

- మాకం వేంకటసుబ్బయ్య, ప్రొద్దుటూరు.

ఆశ్చర్యంగా ఉంది!!

ఆగష్టునెలలో 'శ్రీవేంకటేశ్వరలీలలు' ఆశ్చర్యంగా ఉంది. స్నేహం గురించి కథానిక బాగుంది. 'గోవుమా లక్ష్మికి కోటిదండాలు' రచయితగారు బాగా వివరించారు. ప్రతినెల వచ్చే వైకుంఠపాళి చాలా బాగుంది.

- సి.హెచ్.శేషగిరి, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా.







పాఠకులకు, రచయిత(త్రు)లకు, ఏజెంట్లకు అందరికీ....

దీపావళి శుభాకాంక్షలు

దేవదేవుడైన వేంకటేశుని
కరుణాకటాక్షవీక్షణాలు
అందరిపై అనవరతం
ప్రసరించాలనీ మరియు
ఆయురారోగ్య ఐశ్వర్యాలు
ప్రసాదించాలనీ
స్వామిని ప్రార్థిస్తూ.....

మీ
సప్తగిరి







తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

సప్తగిరి

సంపుటి : 48 అక్టోబరు, 2017 సంచిక : 05

ఈ నెలలో....

ముఖచిత్రం : శ్రీవారిఆలయంలో దీపావళి ఆస్థానం
వెనుక చిత్రం : శ్రీవారిఆలయంలో పుష్పయాగ మహోత్సవం

వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥

గౌరవ సంపాదకుడు
శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి,
తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకుడు
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

సంపాదకుడు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకురాలు
డా॥ అల్లాడి సంధ్య,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

ముద్రాపకుడు
డా॥ టి. రవి, ఎం.ఏ., పిహెచ్.డి.,
పౌరసంబంధాధికారి, తి.తి.దే., తిరుపతి &
ఉపకార్యనిర్వహణాధికారి
(ప్రచురణలు & ముద్రణాలయం) ఎఫ్.ఏ.సి., తి.తి.దే., తిరుపతి

చిత్రకారుడు
శ్రీ పి.శివప్రసాద్, తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక
ఇతర వివరాలకు
0877-2264543

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333

వెబ్‌సైట్- www.tirumala.org, www.tirupati.org; ఆన్‌లైన్ సేవలు/వసతిసౌకర్యం కొరకు- www.ttdsevaonline.com

సంపాదకీయం

ఆనందనిలయుని సేవలో 'ఆళ్వారులు'

'భక్తికంటెను వేరైన పథములందు,
పడయ దుర్లభుడగును నా స్వామియెపుడు'

– అనే సూక్తికి దృష్టాంతమై వర్ధిల్లినవారు పన్నెండుమంది ఆళ్వారులు. **'ఆళ్వారు'** అంటే భక్తిలో మునిగినవాడు అని అర్థం.

ఆళ్వారులలో అగ్రవర్ణము మొదలు అట్టడుగు జాతిలో అవతరించిన వారూ ఉన్నారు. అయోనిజులూ ఉన్నారు. ఇక వీళ్లంతా ఒకే కులానికి చెందకపోయినా, ఒకే వర్ణంవారు కాకపోయినా, పెద్దగా చదువుకోకపోయినా వీరికి గోత్ర ప్రవరలు లేవు. ఉన్నా వాటిని గుర్తించరు. జాతిలోని హెచ్చుతగ్గులు ఎంత మాత్రం లేవు. స్త్రీపురుషభేదం అసలే లేదు. భగవంతుని ముందు అందరూ సమానమే. 'శరణాగతి', 'ప్రపత్తులే' వీరి భక్తికి ఆయువుపట్టు. అందువల్ల వీరంతా చూపిన భక్తిమార్గమే శ్రీవైష్ణవమతంగా శిరోధార్యమై వేయివిధాలుగా వ్యాపించింది.

ఆళ్వారులు పురుషోత్తముడైన భగవంతుని ఎంతటి ప్రేమతో భక్తితో కీర్తించారో, ఆ పరంధాముడు అంతకంటే ఎక్కువగానే వీరియందు వాత్సల్యాన్ని చూపుతూ, వారి సాంగత్యం కోసం అర్రులు చాచాడు. తద్వార తనకంటే తన భక్తులే గొప్ప అని నిరూపించాడు శ్రీనివాసుడు.

తిరుమంగై ఆళ్వారు దొంగతనాలతో దోపిడిలతో, చేసిన భాగవత కైంకర్యానికి, అతని భాగవత భక్తికి పరవశించి అతనికి కూడా దర్శనమిచ్చినవాడు వైకుంఠనాథుడే!

ఇక ఆళ్వారులలో మొట్టమొదటి ముగ్గురు **పొయ్‌గై, భూత, పేయాళ్వారులు** యాదృచ్ఛికంగా ఒక రాత్రి కటికచీకట్లో ఒక ఇరుకైన స్థలంలో చేరి భగవంతుని గురించి ముచ్చటించుట చూసి, భక్త ప్రియుడైన శ్రీనివాసుడు వారి సంస్పర్శను, సత్సంగాన్ని కోరి కోరి వారి మధ్యలో చేరాడు. తమకు తెలియకుండా మధ్యలో కలిగిన ఒత్తిడిని కలిగించిన కొత్తవ్యక్తి ఎవరా? అని ఆ చీకట్లో ఆత్రుతపడగా, వారికి జ్ఞానచక్షువులను ప్రసాదించి తన దివ్యరూపాన్ని దర్శింపచేసి తరింపజేశాడు. వారు ముగ్గురు ఆ శ్రియఃపతి రూపాన్ని గొంతెత్తి కీర్తించారు. ఇలా ఆయా సందర్భాలలో అందరూ శ్రీమన్నారాయణుని సౌందర్యాన్ని, గుణగణాల్ని, మహిమల్ని గురించి పరవశిస్తూ నోరారా పాడిన పరమగానాలే **'దివ్య పాశురాలు'**గా, **'ప్రబంధాలు'**గా ప్రసిద్ధి చెందాయి. ఈ ప్రబంధాలు వేదతుల్యములై పవిత్రద్రావిడ వేదములుగా భక్తలోకంలో సంభావింపబడుతున్నాయి.

అంతేకాదు, నేటికీ కూడా ప్రతి విష్ణ్వాలయంలో ఆ భగవంతుని సరసన పరమభాగవతోత్తములైన ఈ ఆళ్వారులు కూడా దర్శనమిస్తారు. పూజలూ అందుకొంటారు. తద్వారా భక్తివల్ల ఎంతటి ఉన్నత స్థానాన్నైనా పొందవచ్చుననే పరమసత్యాన్ని ఉపదేశిస్తున్న ఈ వైష్ణవులను స్మరిస్తూ, వారు చూపిన భక్తి మార్గంలో మనం అందరం పయనించుదాం. అదే అందరికీ శ్రీరామరక్ష.

'ఆళ్వార్ తిరువడిగలే శరణం'

అక్టోబరు 19, దీపావళి సందర్భంగా....



దివ్యపురాణగాథావళి

'దీపావళి'

– శ్రీ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు

'దీపావళి' అంటే దీపముల వరుస అని అర్థం. దీపమాలికలతో లక్ష్మీదేవికి నీరాజనం ఇచ్చే పర్వదినం కనుక 'దీపావళి' అనే పేరు ఏర్పడిందనేది కూడా ప్రసిద్ధమే! ఆసేతు హిమాచలమూ ఆనందంతో ఉత్సాహంగా జరుపుకునే దీపావళిని చాంద్రమానం ప్రకారం నాలుగవదైన శరదృతువులో, ఏడవదైన ఆశ్వయుజమాసంలో చివరిదైన అమావాస్యరోజు జరుపుకోవడం సంప్రదాయం. అన్ని దుర్గుణాలకు, దారిద్ర్యానికి ప్రతీక అయిన చీకటి నుంచి వెలుగులోనికి ప్రయాణించడమే 'దీపావళి' అంతరార్థం! దీపలక్ష్మి శతసహస్రకిరణ ఖడ్గాలతో అమావాస్య కారుచీకట్లతో యుద్ధం చేసి ఈ జగత్తునంతటినీ వెలుగులతో నింపుతుంది ఈ దీపావళినాడు!

దీపావళికి సంబంధించిన ప్రస్తావన వివిధ పురాణాలతో పాటు అనేక చారిత్రక గ్రంథాలలో కనిపిస్తుంది. 'దీపదాన మహోత్సవం'గా వామనపురాణంలోనూ, 'దీపావళి'గా భవిష్య–నారదపురాణాలలోనూ దీపావళి ప్రస్తావన ఉంది. వీటితో పాటు పద్మ, స్కాంద, కాళికా, విష్ణుపురాణాలలో దీపావళి విశేషాలు ఉన్నాయి. కేవలం పురాణాలలోనే కాకుండా చరిత్రలో కూడా దీపావళి ప్రస్తావన ఉంది. శారదా ఉత్సవంగా విశాఖదత్తుడి 'ముద్రారాక్షసం'లోనూ, పాళీభాషలోని 'గృహ్యాసూత్రాల'లోనూ, 'దీపప్రధానోత్సవం'గా హర్షవర్ధనుడు రచించిన 'నాగానంద' నాటకంలోనూ దీపావళి కనిపిస్తుంది.


దీపావళి జరుపుకొనడం వెనుక అనేక పురాణగాథలు ప్రచారంలో ఉన్నాయి.

నరకాసురుడి గాథ

దీపావళికి సంబంధించిన పౌరాణిక గాథలలో ప్రధానమైంది నరకాసురుడి గాథ.

నరకాసురుడు వరాహస్వామి, భూదేవీల కుమారుడు. దేవతల కుమారుడే అయిన జన్మించిన వేళావిశేషంవల్ల రాక్షసత్వం నరకాసురుడిలో చోటు చేసుకుంది. నరకాసురుడు కామరూప రాజ్యానికి అధిపతి. ప్రాగ్జ్యోతిష్యపురం కామరూప రాజ్య రాజధాని. సుప్రతీకము అనే ఏనుగును వాహనంగా కలిగిన నరకుడు దేవిని గురించి ఉపాసించి తపస్సు చేసి అనేకవరాలను పొందాడు. వరగర్వంతో సకలలోక వాసులను హింసించడంతోపాటు పదహారు వేలమంది స్త్రీలను చెరపట్టాడు.

అంతటితో ఆగకుండా దేవతలపై యుద్ధాన్ని మొదలు పెట్టాడు. స్వర్గలోకంపై దండెత్తి ఇంద్రుడిని ఓడించి స్వర్గాన్ని స్వాధీనం చేసుకున్నాడు. పారిపోయిన ఇంద్రుడు శ్రీకృష్ణుడి వద్దకు చేరి మొరపెట్టుకున్నాడు.



దీంతో శ్రీకృష్ణుడు సత్యభామాసమేతుడై యుద్ధానికి వెళ్ళి నరకాసురుడిని సంహరించాడు. దీంతో తమ కష్టాలు తొలగిపోయాయనీ, తమను అలుముకున్న చీకట్లు అంతరించాయనే ఆనందంతో ప్రజలు దీపాలు వెలిగించి ఆనందంగా పండుగ జరుపుకున్నారు. అప్పటినుంచి దీపావళిని జరుపుకొనడం ఆచారమైనట్లు కథనం.

బలిచక్రవర్తి గాథ

వామన పురాణంలో దీపావళి వెనుక బలిచక్రవర్తికి సంబంధించిన గాథ ఉంది. బలిచక్రవర్తి ప్రహ్లాదుడి మనమడు. ఎంత ధర్మవర్తనుడైనా బలిచక్రవర్తి జాతి లక్షణంవల్ల దేవతలపై విరోధంతో వారిపై దండెత్తి స్వర్గాన్ని ఆక్రమించుకున్నాడు. ముల్లోకాలను స్వాధీనం చేసుకుని అందరినీ కష్టాలపాలు చేయసాగాడు. అటువంటి బలిచక్రవర్తి ఒకసారి యజ్ఞం చేస్తూ ఉండగా.... విష్ణువు వామన రూపాన్ని ధరించి, అక్కడకు వచ్చి మూడు అడుగుల స్థలాన్ని యాచించాడు. రాక్షసుల గురువైన శుక్రాచార్యుడు వద్దని వారిస్తూ ఉన్నా వినకుండా బలిచక్రవర్తి దానం ఇచ్చాడు. త్రివిక్రముడైన వామనుడు ఒక్క పాదంతో భూమిని, మరొక పాదంతో నింగిని ఆక్రమించి మూడోపాదానికి స్థలం చూపించమన్నాడు. అందుకు బలి తన తలను చూపించాడు. ఈ స్థితిని వామనుడు బలిచక్రవర్తి దానగుణాన్ని మెచ్చుకుని ఏదైనా వరం కోరుకోమన్నాడు. అందుకు–"ఆశ్వయుజ కృష్ణత్రయోదశి, చతుర్దశి, అమావాస్య రోజులలో దీపాలను వెలిగించేవారి ఇంట లక్ష్మీదేవి శాశ్వతంగా ఉండేటట్లు, చతుర్దశి అమావాస్యలలో దీపాలు వెలిగించినవారి పితృదేవతలకు నరక విముక్తి ప్రసాదించండి" అని బలిచక్రవర్తి వరం కోరాడు. విష్ణువు వరాన్ని ప్రసాదించాడు. అనంతరం బలిచక్రవర్తిని పాతాళలోకానికి పంపాడు. అప్పటి నుంచి దీపావళి అమల్లోకి వచ్చినట్లు పురాణకథనం. దాదాపు ఇదే గాథ 'వ్రతచూడామణి'లో కూడా వివరింపబడింది.

శ్రీరామచంద్రమూర్తి విజయచిహ్నం...!

'దీపావళి' వెనుక శ్రీరాముడి గాథ కూడా ఉండడం రామాయణంపట్ల మనకున్న అనుబంధానికి నిదర్శనం. శ్రీరామచంద్రమూర్తి తన తండ్రి ఆజ్ఞమేరకు అరణ్యవాసానికి వెళ్ళాడు. అరణ్యవాస సమయంలో సీతాదేవిని రావణాసురుడు అపహరించాడు. హనుమంతుడి ద్వారా లంకారాజ్యంలోని సీతాదేవి జాడ తెలుసుకున్న శ్రీరాముడు లంకారాజ్యంపై దండెత్తి రావణాసురుణ్ణి అంతమొందించాడు. అనంతరం సీతాదేవితో కలిసి అయోధ్యకు చేరాడు. శ్రీరామచంద్రమూర్తి రాకను తెలుసుకుని ప్రజలందరూ సంతోషంతో ఆయనకు స్వాగతం చెప్పేందుకు దీపాలు వెలిగించారనీ, అప్పటినుంచి ప్రజలు దీపావళి జరుపుకుంటున్నారని కథనం. ఈ గాథ ఉత్తర భారతావనిలో బహుళ ప్రచారంలో ఉంది.

పాండవుల విజయచిహ్నం

కురుక్షేత్రయుద్ధంలో కౌరవులను ఓడించి పాండవులు విజయం సాధించారు. అనంతరం ధర్మవర్తనుడు అయిన ధర్మరాజు కురురాజ్యానికి చక్రవర్తి కావడంతో సంతోషించిన ప్రజలు ఆనందంతో దీపాలను వెలిగించారనీ, అప్పటి నుంచి దీపావళిని జరుపుకొనడం ఆచారమైందనీ కథనం!

దుర్వాసమహాముని శాపం

'దీపావళి' గాథల్లో దుర్వాసమహాముని, ఇంద్రుడికి చెందిన ఒక గాథ కూడా ప్రచారంలో ఉంది. పూర్వం ఒకసారి దుర్వాసమహర్షి స్వర్గలోకానికి వెళ్లాడు. ఇంద్రుడిని దర్శించి బహుమతిగా ఒక హారాన్ని ఇంద్రుడికి ఇచ్చాడు. దానిని స్వీకరించిన ఇంద్రుడు నిర్లక్ష్యంతో దానిని ఐరావతం మెడలో వేశాడు. ఐరావతం దానిని క్రిందపడవేసి కాళ్ళతో తొక్కింది. దీనిని చూసి దుర్వాసుడు కోపోద్రిక్తుడై శపించాడు. శాపంవల్ల దేవేంద్రుడు పదవీభ్రష్టుడై శ్రీమహావిష్ణువు దగ్గరకు వెళ్లి శరణుకోరాడు. అందుకు– "లక్ష్మీదేవి దగ్గరఉన్నంతవరకు కష్టాలు దరిచేరవు" అని అభయమిచ్చాడు. తర్వాత దేవతలు, రాక్షసులు కలిసి క్షీరసాగరాన్ని మథించారు. ఈ సమయంలో లక్ష్మీదేవి ఉద్భవించింది. ఆమెను అందరూ పూజించారు. ఫలితంగా ఇంద్రుడితోపాటు సకలలోకవాసుల కష్టాలన్నీ తొలగిపోయాయి. దీనితో సంతోషించిన ప్రజలు దీపాలను వెలిగించి ఆనందంతో దీపావళి పండుగను జరుపుకున్నట్లు కథనం!

నచికేతుడి గాథ

కఠోపనిషత్‌లో మరొకగాథ ఉంది. నచికేతుని తండ్రి తపోరాజు. ఆ రాజు బ్రాహ్మణులకు పనికిరాని భూములను, నిరుపయోగమైన వస్తువులను దానం చేస్తూ ఉండేవాడు. యుక్త వయస్కుడైన నచికేతుడు తన తండ్రి చేసే పని ధర్మవిరుద్ధమని గ్రహించి వ్యతిరేకించాడు. దీంతో తండ్రి, కొడుకుల మధ్య వాదోపవాదాలు పెరిగి, చివరకు నచికేతుడు తండ్రి చేతిలో మృతి చెందాడు. మృతి చెందిన నచికేతుడు నరకలోకం చేరగా, యమధర్మరాజు, నచికేతుడి ధర్మవర్తనను మెచ్చుకుని ఆయుష్షును,

శత్రువు ఎంత అల్పుడైనప్పటికి ఎంతో బాధాకరుడుగా పరిణమిస్తాడు

స్వేచ్ఛను ప్రసాదించి తిరిగి భూలోకానికి పంపాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ప్రజలు ధర్మమే విజయం సాధించిందనే సంతోషంతో దీపాలను వెలిగించి పండుగను జరుపుకున్నట్లు.... అప్పటినుంచి దీపావళిని జరుపుకొనడం ప్రారంభించినట్లు ఉపనిషత్ కథనం.

దీపావళి ఆచరణ

ఈవిధంగా అనేక పురాణగాథలలో ముడిపడి ఉన్న దీపావళినాడు కేవలం కొత్త బట్టలు ధరించడం, మతాబులను కాల్చడం మాత్రమే కాదు. అనేక సంప్రదాయాలు, విధులు ఉన్నాయి. వాటిని ఆచరించినప్పుడే దీపావళి ఫలితం లభిస్తుంది.

ఆశ్వయుజమాసం కృష్ణపక్ష త్రయోదశి రోజు రాత్రి అపమృత్యునివారణార్థం నూనెతో దీపాన్ని వెలిగించి, దానిని పూజించి, ఇంటి ఎదుట, వెలుపల ఉంచవలెను. దీనికే 'యమదీపం' అని పేరు. ఈ విధంగా యమదీపం వెలిగించడం వల్ల అపమృత్యుభయం తొలగిపోయి ఆయురారోగ్యాలు వృద్ధి చెందుతాయి.

ఆశ్వయుజ కృష్ణ చతుర్దశి– 'నరకచతుర్దశి'. యముడికి ప్రియమైన ఈ దినం తెల్లవారు ఝామునే నువ్వులనూనెతో తలంటుకుని –

శీతలోష్ణ సమాయుక్త సకంటక దళాన్విత
హరపాప మపామార్గ, భ్రామ్యమాణః పునః పునః

అనే శ్లోకాన్ని పఠిస్తూ స్నానమాచరించవలెను. అనంతరం –

యమాయ ధర్మరాజాయ మృత్యువే చాంతకాయ చ
వైవస్వతాయ కాలాయ సర్వభూత క్షయాయ చ
ఔదుంబరాయ దధ్నాయ నీలాయ పరమేష్ఠినే
వృకోదరాయ చిత్రాయ చిత్రగుప్తాయ వై నమః॥

– అనే శ్లోకాన్ని పఠించి 'యమాయ తర్పయామి తర్పయామి తర్పయామి' అని అంటూ నువ్వులు, నీటితో యమధర్మరాజుకు తర్పణం వదలవలెను. సాయంత్రం దీపాలను వెలిగించవలెను. ఈ విధంగా ఎవరైతే చేస్తారో వారి పితృదేవతలు నరక బాధల నుంచి విముక్తి చెంది స్వర్గలోకానికి చేరుతారని శాస్త్రవచనం.

దీపావళినాడు తెల్లవారుఝామునే నిద్రలేచి స్నానమాచరించవలెను. మర్రి, మామిడి, అత్తి, జువ్వి, నేరేడు చెట్ల పట్టలను నీటిలోవేసి ఆ నీటిలో స్నానమాచరించవలెను. తర్వాత ఇష్టదేవతలతోపాటు లక్ష్మీదేవిని పూజించవలెను. పగలంతా ఉపవాసం ఉండవలెను.

ఇక, సాయంత్రం నువ్వులనూనెతో దీపాలను వెలిగించవలెను. ప్రధానంగా ఇంటి ద్వారం, ధాన్యపుకొట్టు, బావి, రావి చెట్టు, వంట ఇల్లు– ఈ ఐదు ప్రదేశాలలో దీపాలను వెలిగించాక, మగపిల్లలు దివిటీలు వెలిగించి దక్షిణ దిక్కుగా నిలబడి చూపవలెను. ఈ రోజు యముడు దక్షిణదిక్కుగా ఉంటాడు. కనుక దీపాలు చూపించడం అంటే నరకలోకంలోని పితృదేవతలకు దారి చూపించడం అన్నమాట. అనంతరం కాళ్లు కడుక్కుని ఇంటిలోనికి వెళ్ళి తీపి పదార్థాలను భుజించవలెను. తర్వాతనే బాణాసంచ కాల్చవలెను. పగలంతా ఉపవాసం ఉన్నవారు షోడశోపచారాలు, అష్టోత్తరాలతో లక్ష్మీదేవిని పూజించి శక్తిమేరకు నైవేద్యం సమర్పించవలెను. తర్వాత ఉపవాసం విరమించి భోజనం చేయవలెను.

దీపావళి మరునాడు అంటే కార్తిక శుక్లపాడ్యమి నాడు బలిచక్రవర్తిని పూజించవలెను. బియ్యపు పిండి లేదా పసుపుతో బలిచక్రవర్తి ప్రతిమను చేసుకుని పూజామందిరంలో ఉంచి పూజించడంతోపాటు గోవును పూజించవలెను.

ఈవిధంగా మన శాస్త్ర గ్రంథాలలో చెప్పబడినట్లుగా దీపావళిని జరుపుకొనడంవల్ల అపమృత్యు భయం తొలగిపోయి ఆయుష్షు వృద్ధి చెందుతుంది. మరణానంతరం నరకలోక బాధలూ తొలగిపోతాయి.

అంతేకాకుండా సంపదల తల్లి అయిన శ్రీమహాలక్ష్మీదేవి కృప కలిగి సకలసంపదలూ, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయి.

ప్రతిగుండె సంబరంలో– ఆనందోత్సాహాలతో జరుపుకునే దివ్యపురాణ గాథల దీపావళి అందరి జీవితాల్లోనూ అజ్ఞానాంధకారం, దారిద్ర్యం అనే చీకట్లను పారద్రోలి – జ్ఞానం, సంపదలనే వెలుగులను ప్రసాదిస్తుందని ఆశిస్తూ– ఆహ్వానిద్దాం.

పచ్చతోరణం

తిరుమలేశుని కైంకర్యంలో... ముదలాళ్వార్లు

'మధురభక్తి' అనే అమృతంలో మునిగి తేలినవారే "ఆళ్వార్లు".
వీరిలో చాలామంది ఆనందనిలయుని అనుగ్రహాన్ని ఆస్వాదించి ఆనందించి తరించినవారే!!

- డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు

శ్రీవేంకటేశవైభవప్రచారకులు - శ్రీసరోయోగి

"కలౌ వేంకటనాయకః" అని, "కలియుగ ప్రత్యక్ష దైవ"మని ఈ యుగంలో భక్తుల పాలిటి కల్పవృక్షంగా వెలిగే శ్రీవేంకటేశ్వరుని, ఆ స్వామి వేంచేసి ఉండే తిరుమలను కీర్తించి, ప్రచారం చేసినవారు వేదపురుషునినుండి ఈనాటి కాలం వరకు ఎందరో ఉన్నారు. భగవద్భక్త శిఖామణులుగా పేరు పొందిన ఆళ్వారులు, తమ మధుర దివ్యప్రబంధాలలో రెండు వందలకు మించిన పాశురాలలో వేంకటాచలాన్ని, శ్రీవేంకటేశుని కీర్తించారు. స్వామి మహిమలకు ప్రచారకులయ్యారు.



ఆళ్వార్లలో **సరోయోగి** అనబడే **పొయ్‌గై ఆళ్వార్లు** మొదటివారు. వీరు, కంచికి సమీపంలో వెలసిన యథోక్తకారి స్వామి కోవెల సమీపంలో ఒక సరస్సులో పూచిన తామర పూవులో అయోనిజులై, తులామాసం శ్రవణనక్షత్రంలో జన్మించారు. తాము దర్శించి, ఆనందించిన శ్రీమన్నారాయణుని దివ్యమంగళ రూపాన్ని, గుణాలను, లీలలను నూరు పాశురాలలో వ్యక్తం చేశారు. ఈ ప్రబంధానికి **"ముదల్ తిరువన్దాది"** అని పేరు. ఈ ప్రబంధంలో పొయ్‌గై ఆళ్వార్లు పది పాశురాలలో వేంకటాచలాన్ని, అక్కడ వెలసి ఉండే వేంకటేశ్వరుని కీర్తించారు. **"ఓడిత్తిరియుమ్ యోగికళ్"** (సదా పరిభ్రమిస్తూ సంచరించే యోగులు) అని పిలువబడే ముదల్ ఆళ్వార్ల ముగ్గురిలో ఒకరైన ఈ సరోయోగి తిరుమలను, వేంకటేశ్వరుని సాక్షాత్తుగా దర్శించి, తమ అనుభవాన్ని మధురమైన పాశురాలలో వ్యక్తం చేశారు. ఈ పాశురాలలోని భావాలన్నీ వైదిక, పౌరాణిక సూక్తులలోని అర్థాన్ని పోలి ఉండడం ఆశ్చర్యం కల్గించే విషయం.

ఋగ్వేదంలోని ఒక ఋక్కులో వేంకటాచల ప్రస్తావన కన్పిస్తున్నదని బ్రహ్మపురాణాంతర్గతమైన *"అరాయి కాణే వికటే గిరిం గచ్ఛేతి తం విదుః, ఏవం వేదమయః సాక్షా ద్గిరీంద్రః పన్నగాచలః"* అనే శ్లోకం తెల్పుతున్నది. *"అరాయి కాణే వికటే గిరిం గచ్ఛ సదాన్వే, శిరింబిఠస్య సత్త్వభిః తేభిష్ట్వా చాతయా మసి"* (7-153-8) అనే ఋక్కు- ధనవిహీనుడై, జ్ఞానహీనుడై, తాపత్రయాతురుడైనవాడు సత్త్వగుణాన్ని కల భగవద్భక్తులతో కలసి వేంకటాచలానికి వెళ్లి, అక్కడ ఉండే శ్రీనివాసుని వేడితే, అతని బాధలు తీరుతాయని తెల్పుతున్నది. ఈ అర్థాన్నే వరాహ పురాణాంతర్గత వేంకటాచల మాహాత్మ్యం లోని-*"సర్వపాపాని వేం ప్రాహుః"* (పాపాలన్నీ 'వేం' అనే అక్షరంతో తెలుపబడతాయి, వానిని పోగొట్టడం 'కట' శబ్దం ద్వారా తెలుపబడుతున్నది. భక్తుల పాపాలన్నీ పోగొట్టే కొండ కనుక వేంకట మనబడుతున్నది) అనే శ్లోకం పై వేద సూక్తిని అనుసరిస్తున్నది.

భక్తుల పాపాలను అన్నిటిని వేంకటాద్రి హరిస్తుంది - అనే ఈ అర్థాన్ని సరోయోగి తమ ప్రబంధంలోని *'ఏళువార్ విడై కొళ్వార్ ఈన్‌తుళాయానై వళువావకై నినైన్దు వైకల్ తొళువార్ వినైచ్చుడరై నన్దువిక్కుమ్ వేజ్గడమ్'* (26) అనే పాశురంలో అనుసంధించారు. ఈ పాశురభావమేమంటే - భగవదనుగ్రహం వల్ల ఇహలోకైశ్వర్యాన్ని పొంది, తావన్మాత్రంతో తృప్తి పడి, ఆ స్వామిని వదలి వెళ్ళే ఆర్తులు, అర్థార్థులు; కైవల్యాన్ని పొంది, భగవంతుని వద్ద శాశ్వతంగా అనుమతిని పొంది వెళ్ళిపోయే కేవలురు; తులసీధారి అయిన స్వామిని సదా వెన్నంటి ఉండి, ధ్యానిస్తూ, కైంకర్యం చేయగోరే ముముక్షువులు- (ఐశ్వర్యార్థి, కేవలుడు, ముముక్షువు) అనే ఈ ముగ్గురి పాపాలను వేంకటాచలం హరిస్తుంది అని భావం. పూర్వం ప్రస్తావించిన వేంకట శబ్దానికి గల వైదిక, పౌరాణిక నిర్వచనాలలోని భావాన్ని ఈ సరోయోగి పాశురం అందంగా అనువదించిందనే విషయం సుస్పష్టం. ఈ వేంకటశబ్ద వ్యుత్పత్తి అనిష్ట నివృత్తిని - అంటే - పాపాలను హరిస్తుంది- అనే అర్థాన్ని తెలుపుతున్నది.

ఈ నెలలో జరిగే ముదలాళ్వారుల వర్ష తిరునక్షత్రాల (అక్టోబరు- 28, 29, 30లలో) సందర్భంగా...

వేంకటశబ్దానికి ఇహలోకైశ్వర్యాన్ని, పారమార్థిక ప్రయోజనమైన మోక్షాన్ని ఇచ్చేదనే వేరొక, ఇష్టప్రాప్తిని తెలిపే వ్యుత్పత్తి కూడా వరాహ పురాణంలో కన్పిస్తున్నది. *'వేంకారోమృత బీజం తు కటమైశ్వర్యముచ్యతే, అమృతైశ్వర్యసంఘత్వాత్*

ఎవడూ ఎవనికి స్వతహాగా మిత్రుడూ కాడు, శత్రువూ గాడు

'వేంకటాద్రిరితిస్మృతః' అనేదే ఆ వ్యుత్పత్తి. తాంత్రికమైన ఈ రెండవ వ్యుత్పత్తిలోని భావాన్ని సరోయోగి తమ ప్రబంధం లోని 76వ పాశురంలో - *'పళుదొన్డుమ్ వారాద వణ్ణమే విణ్ కొడుక్కుమ్.... తిరువేంగడమ్'* (ఏలోటు లేని రీతిలో భక్తులకు పరమపదాన్ని వేంకటాద్రి కల్గిస్తుంది) అని తెలిపారు. ఈ సూక్తిలోని 'విణ్' అనే పదానికి పరమపదమనే అర్థమేకాక, స్వర్గమనే అర్థాన్ని కూడా గ్రహించే వీలున్నందున, ఈ పదం ద్వారా మోక్షప్రాప్తి, ఇహలోకైశ్వర్యప్రాప్తి- రెండు తెలియజేయ బడుతున్నవని భావించవచ్చు.

ఈ విధంగా వేంకటనామవైభవాన్ని కీర్తించేటప్పుడు పొయ్గై ఆళ్వార్లు వైదిక ప్రక్రియను అనుసరించడం కూడా గమనార్హం. వేదం *'అంతర్బహిశ్చ తత్ సర్వం వ్యాప్య నారా యణః స్థితః'* అని నారాయణ నామాన్ని అనుసంధానం చేయ డానికి ముందు ఆ నామార్థాన్ని తెలిపి, తర్వాత ఆ నామాన్ని పల్కింది. ఈ క్రమాన్నే అనుసరిస్తూ పొయ్గై ఆళ్వార్లు (పూర్వం తెల్పిన సూక్తులలో) ముందు వేంకటశబ్దార్థాన్ని, ఆ తర్వాత వేంకటశబ్దాన్ని పల్కిన వైనం కూడా సుస్పష్టం. ఆళ్వార్ల ప్రబంధా లను ద్రావిడ వేదాలుగా పరిగణింపబడడానికి గల కారణాలలో ఈ విధమైన సామ్యం కూడా ఒకటి.

తిరుమల కొండపై నెలకొని ఉండే వేంకటేశ్వరుని విగ్రహసన్నివేశం గీతాచార్యుని రూపాన్ని తలపిస్తుంది. *'మత్వాదౌ శరణం వ్రజ'* అని అంటూ ఒక చేతిలో తన శ్రీచరణాలను చూపిస్తూ, ఇంకొక చేతిలో మోకాలి భాగాన్ని స్పృశించడం, తనను శరణు పొందినవారికి సంసార సముద్రం మోకాలి లోతును కల్గినదై, దాటడానికి సుకరమవుతుందని సూచిస్తున్నది. గీతాచార్యుడు కూడా భగవద్గీత 18 అధ్యాయంలో చివర *"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ, అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః"* అనే శ్లోకంలో ఈ అర్థాన్నే ఉపదేశించాడు కదా! ఈ విధంగా శ్రీవేంకటేశ్వర స్వామికి, గీతాచార్యునకు మధ్య కల ఆకార, ఉపదేశాలలోని సామ్యాన్ని పొయ్గై ఆళ్వార్లు 37వ పాశురంలోని *"వేఙ్గడమే వెణ్ శఙ్గమ్ ఊదియ వాయ్ మాల్ ఉకన్ద ఊర్"* (తెల్లని పాంచజన్య శంఖాన్ని ఊదిన నోటిని కలవాడు, ఆశ్రితుల పట్ల ప్రేమను కలవాడైన స్వామి అభిమానించిన ఊరు- వేంకటాద్రి) అనే ప్రయోగం ద్వారా మనోహరంగా వ్యక్తీకరించారు.

భూతయోగిమాన్ సూక్తి మధురిమ

ముదలాళ్వార్లలో **పూదత్తాళ్వార్లు** అనే **భూతయోగి** రెండవవారు. వీరు 'తిరుక్కడల్‌మల్లై' (మహాబలిపురం)లో వికసించిన నల్లకలువనుండి అయోనిజులై, శ్రీమన్నారాయణుని పంచాయుధాలలో ఒకటైన, దయకు మారు పేరైన, 'కౌమోదకి' అనే గదయొక్క అంశతో తులామాసం ధనిష్ఠానక్షత్రంలో జన్మించారు. తమ భగవదనుభవాన్ని *"ఇరణ్డామ్ తిరువన్దాది"* అనే, నూరు పాశురాలను ప్రబంధం ద్వారా వ్యక్తీకరించారు. *"ఎళిల్ ఞాన చ్చుడర్ విళక్కై ఏట్రినాన్"* (ప్రకాశించే జ్ఞానదీపాన్ని వెలిగించినవారు) అని కీర్తింపబడే ఈ ఆళ్వార్ల ప్రబంధంలోని పాశురాలన్నీ తత్త్వార్థాలను మధురంగా అందించే రసగుళికలు. వాటిలో ఒక పాశురంలోని విశేషాలు సంగ్రహంగా ప్రస్తావింప బడుతున్నాయి.

కఠవల్లిలో, ముండకోపనిషత్తులో *"నాయమాత్మా ప్రవచ నేన లభ్యో న మేధయా న బహునా శ్రుతేన, యమేవైష వృణుతే తేన లభ్యః, తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వామ్"* అనే ఒకమంత్రం ఉన్నది. పరమాత్మ, భక్తిలేని కేవల శ్రవణంతో గాని, మననంతోకాని, ధ్యానంతోకాని పొందడానికి సాధ్యమైన వాడుకాడు. ఎవనిని ఈ పరమాత్మ వరిస్తున్నాడో, అతనికి తన దివ్యమంగళరూపాన్ని దర్శింపజేస్తాడు- అని దీని అర్థం. మనం ఆచరించే శ్రవణ మననాదులు, ఆనుకూల్యభావం, ప్రపత్తి- ఇవేమీ సాక్షాత్‌మోక్షోపాయాలు కావు. పరమాత్మకుగల సహజ మైన (నిర్హేతుకమైన) కృప మాత్రమే సాక్షాత్ ఉపాయం. నిర్హేతుక కృపతోనే అతడు తన భక్తుని అనుగ్రహించి, తన దర్శనాన్ని అనుగ్రహిస్తాడనేది ఈ మంత్రంలోని తాత్పర్యం. *"న చాహం పురుషకారేణ న చాప్యన్యేన హేతునా, కేవలం స్వేచ్ఛయైవాహం ప్రేక్షే కంచిత్ కదాచన"* (పురుషాకారంవల్ల కాని, వేఱొక హేతువువల్లకాని నేను పొందడానికి సాధ్యమయేవాడను కాను. కేవలం నా ఇచ్ఛతోనే ఎపుడో ఒకప్పుడు ఎవనినో ఒకరిని కటాక్షిస్తాను) ఇత్యాదిసూక్తులు ఈఅర్థాన్నే వివరిస్తున్నాయి.

ఈ విధంగా భగవానుని స్వీకారమే (కృపయే) మోక్ష హేతువు-అని నమ్మడానికి పరగతస్వీకారమని పేరు. అంటే- స్వీకారమనేది, పరగతమై-భగవంతునకు చెందినదై ఉండడం. దీనికి శాస్త్రంలో మార్జాలకిశోరన్యాయాన్ని ఉదాహరణగా

పరమాత్ముని సందర్శనం....

ఈ ఆళ్వార్లకు సంబంధించి విచిత్రమైన వృత్తాంతం ఉంది. అదేమనగా - ఈ ముగ్గురు ఆళ్వారులు అయోనిజులు. భగవంతుని కటాక్షం వల్ల శుద్ధసత్త్వగుణ పరిపూర్ణులువీరు. పరమపురుషుని దాస్యైక రసికులైన వీరు భగవద్గుణముచే నిరాహారులు. కలి ప్రభావంనుండి జనులను కాపాడుటకై జన్మించిన ఈ ముగ్గురును నేడున్న గ్రామంలో రేపు ఉండకుండ ఊరు ఊరు సంచరిస్తూ లోకమున జ్ఞానదీపము వెలిగించుటకు ప్రయత్నించుచుండేవారు. అప్పడు సత్యసంకల్పుడైన పరమాత్మ శ్రీమన్నారాయణుడు వీరి ముగ్గురిని ఒక రాత్రి తిరుక్కోవ లూరు అనే ఊరిలో ఒక చోటకు చేర్చారు. వీరి ఈ కలయిక విచిత్రంగా జరిగింది.

శ్రీమన్నారాయణుడు ఆ రోజు రాత్రి అకస్మాత్తుగా వర్షాన్ని కురిపించాడు. ముందుగా ఒక ఇంటి నడవలో పొయ్గై ఆళ్వారు పడు కున్నారు. ఆ స్థలము అంతవరకు మాత్రమే పరిమితమై ఉంది. కొంత సేపటికి పూదత్తాళ్వారు కూడా అక్కడకు వచ్చి కొంతచోటిమ్మని పొయ్గై ఆళ్వారును అడిగారు. ఒక మనిషి పడుకోవడానికి పరిమితమైన ఈ ప్రదేశం ఇద్దరు కూర్చోటానికి కూడా సరిపోతుంది, కాబట్టి దయచేయండి అని వారికి కూడా చోటిచ్చారు. ఇద్దరూ కూర్చున్నారు. మరికొంతసేపటికి పేయాళ్వారు కూడా అక్కడికి వేంచేశాడు. వారికి కూడా స్థలం ఇవ్వటం వలన ఆ స్థలం కూర్చొనుటకు సరిపోక పోవడంతో ముగ్గురు నిల్చున్నారు. అది చీకటి రాత్రి. ఏమి కనిపించడం లేదు. ముగ్గురు నిలబడి భగవంతుడి లీలలను చెప్పకొన్నారు, వీరి మాటలు వినాలని శంఖచక్రగదాధరుడైన శ్రీమహావిష్ణువు వారి మధ్యలోకి వేం చేశారు. చోటు చాలక నెట్టుకొనుచు నిలుచుండడం చేత ఆళ్వార్లు తమ మధ్యలో నాల్గవ వ్యక్తి వచ్చాడని గ్రహించారు. ఆ వ్యక్తి ఎవరో తెలుసుకోవాలని అనుకున్నారు. జ్ఞానచక్షువులు కలిగిన ఆ ముగ్గురికి పరమాత్మ తన దివ్యమంగళ విగ్రహాన్ని దర్శింపచేశారు. కోటి సూర్య ప్రభాసమానమైన పరమాత్ముని సందర్శనంతో ఆశ్చర్యాన్ని పొంది ముగ్గురు ఆళ్వారులు భగవంతుని మహిమలను స్వామి తత్త్వమును నోరారా కీర్తించారు. ఆ రాత్రివారి స్తోత్రములను ఆల కించి సంతోషించిన స్వామి తెల్లవారుతుండగా అదృశ్యమైపోయారు. ఆ తర్వాత ఆళ్వారులు కూడా వారిదారిన వారు వెళ్ళిపోయారు.

తెల్పుతారు. పిల్లి, తన పిల్లను తన నోటితో కరచిపట్టుకొని, వేరొకచోటుకు తీసికొని పోవడంవంటిది, ఇది నిరపాయ మైనది. దీనికంటే వేరయినది మర్కటకిశోరన్యాయం. అది ఏమిటంటే – వానరం తన పిల్లను స్వయంగా తీసికొని పోదు. పిల్లవానరం తల్లిని గట్టిగా పట్టుకొంటే, ఆ తల్లి తన పిల్లను వేరొకచోటుకు చేరుస్తుంది. ఇందులో అపాయంజరిగే అవకాశం ఉంది. తల్లి తన పిల్ల వానరంను పట్టుకోవడానికి, పిల్లి తనతల్లిని పట్టు కోవడానికి మధ్య తేడా చాలా ఉన్నది కదా. పర మాత్మ తన నిర్హేతుక కృపతో భక్తుని స్వీకరించడం 'పరగతస్వీకారమ'ని, భక్తుడు కర్మయోగాది స్వప్రయత్నంతో పరమాత్మను పొందడానికి యత్నిం చడం 'స్వగత స్వీకారమ'ని, ఈ రెండింటిలో పరగత స్వీకారమే వేదపురుషుని హృదయమని పూర్వం ప్రస్తావించిన కఠవల్లీ మంత్రంలోని తాత్పర్యం.



ఈ అర్థాన్నే పూదత్తాళ్వార్లు తమ ప్రబంధంలోని 16వ పాశురంలో ఒక చక్కని లౌకికోదాహరణంతో ప్రస్తావించారు. "తనక్కడిమై పట్టదు తానఱియానేలుమ్, మనత్తడైయ వైప్పదామ్ మాలై, వనత్తిడరై ఏరియామ్ వణ్ణమ్ ఇయత్తుం ఇదు వల్లాల్ మారి యార్ పెయ్కిఱ్పార్ మత్తు" అనేది ఆ పాశురం. దీని భావమే మంటే – జీవుడు, "తాను భగవంతునకు చెందిన సొత్తు–భగవంతునకు శేషమై ఉన్నాను." అనే వాస్తవాన్ని గుర్తించలేకపోయినా, ఆ భగవానుడే దయతో తన మనస్సులోకి వచ్చిచేరితే, అవకాశం ఇచ్చి నిలుపు కోవడం యుక్తం. అరణ్యంగా మారిన మిట్ట ప్రదేశాన్ని తవ్వి పల్లంగా చెఱువు చేయవచ్చు, అంతే తప్ప, మఱి, వర్షాన్ని కురిపించగలవారు, భగవంతుడు తప్ప ఇంకొకరు ఎవరున్నారు? అని ఈ పాశురభావం. ఇక్కడ ఒక సందేహం కలుగవచ్చు. అన్నీ భగవద ధీనాలే అయితే, జీవుడు చైతన్యాన్ని కలవాడైనందున, ఆ చైతన్యానికి తగినట్లుగా భగవంతునిపట్ల అప్రతిషేధాన్ని– అంటే–ద్వేషభావం లేకుండా ఉండే స్థితిని పొందాలి. అయితే, ఇది భగవత్కరుణ పొందడానికి సహాయపడు తుందే తప్ప సాక్షాత్తు మోక్షోపాయం కాదు, కాలేదు. జీవుడు అనుష్ఠించే ఉపాయాలన్నీ అటువంటివే. అద్వేషభావాన్ని కల్గి ఉండే ఈ

స్వార్జిత ధనంతో జీవనయాత్ర గడుపుట ఉత్తమం



ఆనాడు ముగ్గురాళ్వారులు బ్రహ్మానందసాగర నిమగ్నులై గానం చేసిన స్వామి మహిమలు మూడు ప్రబంధాలుగా శ్రీవైష్ణవ సంప్రదాయంలో ప్రఖ్యాతి గాంచినవి. పొయ్‌గై ఆళ్వారు 'వైయంతగళి' అని ప్రారంభించి వందపాశురాలను పాడారు. దీనికి 'మొదట తిరు వందాది' అని పేరు. పూదత్తాళ్వారు 'అన్బే తగళి' అని ప్రారంభించి వంద పాశురాలను పాడారు. దీనికి 'రెండవ తిరువందాది' అని పేరు. పేయాళ్వారు 'తిరుక్కండెన్' అని ప్రారంభించి వందపాశురాలను పాడారు. దీనికి 'మూడవ తిరువందాది' అని పేరు. శ్రీమన్నారాయణుని దర్శించిన ఈ ముగ్గురు ఆళ్వారుల పాశురాలు ఆచంద్ర తారార్కముగా నిలిచి ఉంటాయి.

శ్రీమహావిష్ణువు యొక్క నూట ఎనిమిది దివ్యతిరుపతులలో పొయ్‌గై ఆళ్వారుచే శ్రీరంగ, తిరుమల, కంచి, తిరుక్కోవలూరు స్తుతింపబడినవి. పూదత్తళ్వారుచే శ్రీరంగం, వెంకటాద్రి, దేహళీ పురమను తిరువల్లికేని స్తుతింపబడినవి.

ఈ ముగ్గురు ఆళ్వారుల ప్రబంధములు పఠించిన వారు విష్ణుభక్తులై విష్ణుపదమునొందగలరు.

స్థితికూడా తనకు భగవంతుని వల్లనే కల్గిందని భావించడమే సముచితం. అనాది కాలంగా తాను పడిన పాట్లను చూస్తే ఈ అద్వేషం కూడా తనకు తానే కలిగే అవకాశమే లేదనేది స్పష్టంకదా! ఈ అర్థంలోనే పాశురంలోని **"మనత్తడైయ వైప్పదామ్ మాలై?"** (భగవంతుడు మనస్సులోకి చేరితే, జీవుడు ఆ స్వామిని నిలుపు కొంటున్నాడా?) అనే ప్రయోగాన్ని కాకుస్వరంతో కూడినదిగా గ్రహించి, కూరేశులు అనే ఆచార్యులు "భగవానుడు తన మనస్సులోకి వచ్చినా, అతనిని నిలుపుకోగల్గడమనేది ఆ భగవానుని కృపవల్లనే జరుగుతుంది. అల్పశక్తి అయిన జీవునకు ఆ మాత్రం శక్తి అయినా ఉండే అవకాశం ఉన్నదా? లేదు కదా" అనే విలక్షణమైన అర్థాన్ని తెలిపారట. ఈ విధంగా పూదత్తాళ్వార్ల సూక్తులన్నీ వేదాంతార్థ ప్రకాశకాలు.


పేయాళ్వార్లు - తిరుమలలో గజాలు

ముదలాళ్వార్లుగా వ్యవహరింపబడే పొయ్‌గై ఆళ్వార్లు, పూదత్తాళ్వార్లు, పేయాళ్వార్లు-ముగ్గురు తమ ప్రబంధాలలో వేంకటాచలాన్ని కీర్తించినట్లుగా ఇక ఏ దివ్యక్షేత్రాన్ని వర్ణించలేదు. తిరుమలగిరుల శోభను, అక్కడ సంచరించే పశు పక్ష్యాదుల సంచారవిశేషాలను తమ సహజవర్ణనతో మనకంటి ముందు సాక్షాత్కరింపచేశారు. వీరి పాశురాలను గమనిస్తే ఆనాడు తిరుమలలో గోచరించిన హృద్యమైన దృశ్యాలు మన మనసును ఆకట్టుకుంటాయి.

తిరుమల దట్టమైన అరణ్యాలకు, గజసంచారాలకు ప్రసిద్ధి. ముదళాళ్వార్లు ముగ్గురు తిరుమలలోని ఏనుగుల సంచారాలను దర్శించి తమ పాశురాలలో ప్రస్తావించారు. మొదటి ఆళ్వార్లు పొయ్‌గై ఆళ్వార్లు తమ ప్రబంధంలోని 38వ పాశురంలో **"ఊరుమ్ వరియరవమ్ ఒణ్ కుఱవర్ మాల్ యానై పేర వెఱిన్దపెరుమణియై"** ఇత్యాదిగా గజవృత్తాంతాన్ని తెలిపారు. తిరుమలలో నిత్యవాసం చేసే కోయలు ఏనాడూ ఆ తిరుమలను విడిచి బయటకు వెళ్ళరు. అక్కడే సస్యాన్ని పండించుకొని తమ జీవనయాత్రను సాగిస్తారు. వారు సాగు చేసే పైరును తినడం కోసం సమీపంలో తిరిగే ఏనుగులు పొలాలలోకి వచ్చినప్పుడు, మంచెలపై ఉండి పైరును కాపు కాచేవారు. తిరుమలలో విరివిగా లభించే పెద్ద పెద్ద రత్నాలను ఆ ఏనుగులను భయ పెట్టడం కోసం వాటిపై విసురుతారు. అప్పుడు ఆ సమీపంలోనే సంచరించే సర్పాలు నల్లగా, పెద్దగా ఉండే ఏనుగులను చూసి మేఘమని, వాటిపై కోయలు విసరిన వెలిగే మణులను చూసి

మెఱపులని భ్రమించి, మెఱపు తరువాత పిడుగు పడుతుందనే భయంతో వేగంగా పుట్టలలోకి దూరిపోతున్నాయి. ఇది పొయ్‌గై ఆళ్వారుల పాశురం మనకు అందించే అద్భుతదృశ్యం.

రెండవ ఆళ్వార్లు పూదత్తాళ్వార్లు వేరొక అద్భుతదృశ్యాన్ని, తమ ప్రబంధంలోని 75వ పాశురంలో **"పెరుకు మదవేళమ్ మాప్పి డిక్కు మున్నిన్ఱు"** ఇత్యాదిగా పల్కుతూ వర్ణించారు. తిరుమలలో మగ, ఆడ ఏనుగులు జంటలుగా సంచరిస్తాయి. ఆ విధంగా సంచరించే జంటలలో ఒకజంటలోని మగఏనుగు ఆడ ఏనుగు ముందు ప్రేమతో నిలచి రెండు కణపులను కలిగిన లేత, వెదురు కొమ్మను తొండంతో విరిచింది. దానిని దగ్గర్లో ఉండే తేనె పట్టులోని తియ్యని తేనెలో ముంచి ఆడ ఏనుగుకు అందించగా,ఆడఏనుగు ఆనందంగా స్వీకరించింది. ఇక్కడ ఆళ్వార్లు ఈ అందమైన దృశ్యాన్ని ప్రస్తావించడం ద్వారా, కొండపై వేంచేసి ఉండే వేంకటేశ్వరుడు తనను ఆశ్రయించినవారిని రక్షించి ఆనందింపచేసినట్లే అక్కడ ఉండే తిర్యక్కులు (ఏనుగులు మొదలైన జంతువులు) కూడా అటువంటి స్వభావాన్నే కలిగియున్నాయని సూచించారు. **"యథా రాజా తథా ప్రజాః"** అని కదా సామెత.



ఈ ఇద్దరు ఆళ్వార్లను అనుసరిస్తూ పేయాళ్వార్లు **'మూన్ఱామ్ తిరువన్దాది'** అనే తమ ప్రబంధంలో మూడు పాశురాలలో వేంకటాద్రిపై గోచరించే గజసంచారాలను రమ్యంగా కళ్ళకు కట్టేటట్లు వర్ణించారు. **"పురిన్ద మదవేళమ్ మాప్పిడి యోడు ఊడి"** అనే 45వ పాశురంలో తనపెంటి ఏనుగుతో కొంతకాలం కలసి సంచరించిన ఒక మగ ఏనుగు, దానితో కలహించి, దూరంగా పోయి ఎక్కడెక్కడో తిరిగింది. కోపాన్ని పట్టలేక దగ్గర్లో ఉండే మణిశిలపై తొండంతో గట్టిగా మోదింది. అప్పుడు ఆ ఏనుగు తెల్లనిదంతం విరిగిపోగా, దాని నుండి తెల్లని ముత్యాలు జారి బయటకు చిందాయి. ఆళ్వార్ల ఈ వర్ణనను మనస్సులో భావించినప్పుడు ఈ దృశ్యం ఎంత మనోహరమైనదో అర్థమవుతుంది.

"పుకుమదత్తాల్ వాయ్ పూశి" అనే 70వ పాశురంలోని సూక్తిలో ఆళ్వార్లు దర్శింపచేసిన దృశ్యం అపురూపమైనది. తిరుమలలో సంచరించే మదపుటేనుగు స్వామిని సేవించే రీతి, ఒక వైదికోత్తముడు భగవదారాధనను చేసే రీతిని తలపిస్తున్నది అని అంటున్నారు, ఆళ్వార్లు. ఏ విధంగా? అంటే, ఆ ఏనుగు తన గండస్థలాలనుండి నోటి వరకు కారే మద జలంతోనే పుక్కిలించి నోటిని శుభ్రం చేసుకొన్నది. విరివిగా కారే మద జలం ఇంకా కిందకు కాళ్ళవరకు ప్రవిస్తున్నందున, ఆ జలంతో పాదాలను కడుగుకొన్నది.

ఈ విధంగా వైదిక ప్రక్రియలో పాదప్రక్షాళనను, ఆచమనాన్ని చేసిన ఆ గజం దగ్గరలో చక్కగా వికసించిన పూలను కోసి తెచ్చి స్వామి పాదాలలో అర్పిస్తున్నది- అని ఆళ్వార్లు ఈ పాశురంలో పల్కుతున్నారు. అయితే ఈ గజవృత్తాంతాన్ని ప్రస్తావించడం ద్వారా ఆళ్వార్లు ఇక్కడ చెప్పదలచినదేమి? అని అంటే, ఎంతో శ్రమించి పొందిన తత్త్వజ్ఞానంతో పొందదగిన ఆశ్రయాన్ని వేంకటేశుడు గజాలవంటి తిర్యగ్జంతువులను కూడా అనుగ్రహిస్తూ, తన సౌలభ్యగుణపరాకాష్ఠను చాటుతున్నాడని ఇక్కడ ఆళ్వార్ల వివక్షితార్థం.

ఇటువంటి ఆళ్వార్ల సూక్తులు తిరుమల వైభవానికి, వేంకటేశుని మహిమకు సర్వతోముఖప్రచారాన్ని కల్గించాయనడం వాస్తవం. వీరిలో **పొయ్‌గై ఆళ్వారు** శ్రీమహావిష్ణువు ధరించు **పాంచజన్యమను శంఖము** యొక్క అంశము. **పూదత్తాళ్వారు కౌమోదకి** అనే **గదాంశమును, పేయాళ్వారు నందక ఖడ్గాంశమున** అవతరించారు.

'ఆళ్వార్ తిరువడిగలే శరణమ్'

(గతసంచిక తరువాయిభాగం...)

తదనంతరం 'గోదా'దేవి చెలికత్తెలు పెళ్ళికూతురిని అలంకరించడం మొద లెట్టారు. చెలికత్తెలు సంతోషంతో గోదా దేవికి కుంకుమతో నలుగుపెట్టారు. బంగారుచెంబులతో అపుడే సిద్ధంచేసిన గొజ్జంగినీటిని నింపి మంగళస్నానం చేయించారు. జిగేలుమనే వస్త్రాలతో తడి ఒత్తారు. బంగారు చెరగుల పట్టు చీరను కుచ్చెలుగా కట్టి సరిచేశారు. గంధం పూశారు. కురులు సరిచేసి విరిదండలతో 'క్రొమ్ముడి' చిత్రంగా చుట్టారు. నెమలి పురివిప్పినట్టుగా మొగిలిరేకులు కూర్చారు, నెలవంకలాగా ముత్యాల పాపిట తీర్చి దిద్దారు. చంద్రబింబాల్ని మింగేసేవిధంగా కనిపించే కేశసంపద అనే రాహువుకు అడ్డకట్ట వేసినవిధంగా 'తాటంకాలు' తొడి గారు. సన్నకాటుక పెట్టారు. కరిరాజవర దుని ఘనకీర్తిలాగ 'ముంగర' అలంకరిం చారు. నడకల గతులలో రాయంచలను గెలిచి చేజిక్కించుకొన్న గండపెండేరాలో అనేటట్లు మణులతోడి నూపురాలు సవ రించారు. రత్నకంకణాలు తొడిగారు. కస్తూరి నామం తీర్చి కల్వలతికలాగా కని పించే గోదమ్మను పెళ్ళిపీటకు చెలికత్తెలు తోడ్కొని వచ్చారు. వివాహ సంబరాలు మొదలయ్యాయి.

సూర్యచంద్రులు తెరపట్టారు. విష్ణు చిత్తుడు పెళ్ళిపీట దగ్గరికివచ్చి రంగ విభులకు 'మధుపర్క' గౌరవం చేశారు. బృహస్పతి 'సుముహూర్త' మని హెచ్చరి స్తుంటే వధూవరులిద్దరు పరస్పరం సంద ర్శించుకొనేవేళ గోదాదేవి ముందుగా 'గుడ జీరకాలను' శ్రీరంగనాథుని శిరసుపై పెట్టింది.

మేఘాలపై వెన్నెలలు ప్రసరించినట్లు పరస్పరం ఒకరి మీద ఒకరు తలంబ్రాలు పోసుకొన్నారు. ముత్యాలసేసలు ముద్దుగా వేసుకొన్నారు. ఆగమోక్తంగా 'కంకణధారణ' పూర్తయింది. ఇరువురి పైవస్త్రాలకు చివర ముడులు వేశారు. తదనంతరం పీటలపై కూర్చోబెట్టి 'లాజహోమాలు' చేయించారు. ఆపై హోమాగ్నిచుట్టూ ప్రదక్షిణాలు చేశారు. బృహస్పతి 'సప్తపది' కార్యక్రమం సన్నాహాలు చేస్తుంటే పరమశివుడు, దేవేంద్రుడు పెళ్ళి మాటమీదున్న రంగనాథుని చూచి 'ఏమయ్యా! సిగ్గుపడుతున్నావెందుకు? అమ్మాయి పాదాలను నాలుగుచేతులతో గట్టిగా పట్టి మెట్టించు', అని పరిహాసం చేశారు. సప్తపదుల కార్యక్రమం పూర్తి అయింది.

పెళ్ళిపీటలమీద ఇద్దరు కూర్చొనివుంటే సోబాన పాడారు చెలికత్తెలు. బ్రహ్మ రంగనాథులకు బాసికం కట్టాడు. సరస్వతి, శచీదేవి బంగారు పళ్ళాలతో 'నీరాజనం' పట్టారు. దివ్యమునులు, దేవతలు ప్రముఖులు 'ఆశీస్సులు' పలికారు. ఆదిదంపతులు 'అక్షతలు' పెట్టారు. ఆ సమయంలో 'నవ నిధులు' ఊడిగాలు చేయడంకోసం వచ్చాయి. రంగనాథుడు ప్రముఖులను సంభావించాడు.

వల్లభదేవుడు వివాహానికి వచ్చిన భూవల్లభులకు తగిన సత్కారాలు చేశాడు. రంగనాథుడు మునిత్రయానికి, గోదాదేవి చెలికత్తెలకు, కురుకాధిపతికి వారు కోరినవరాలు ప్రసాదించాడు.

శ్రీవిల్లిపుత్తూరులోనే మూడురాత్రులు గడిచాయి. నాల్గవరోజు శ్రీరంగనాథుడు గోదాదేవిని శేషశయనంలో తనదిగా చేసుకొని యోగనిద్రపోయాడు.

. . . .



హైమసరోజాంగ! అలమేలు మంగ!
జీమూత సంకాశ! శ్రీ వేంకటేశ!
వనమాలి! అవధారు! వరదానశీలి!

అదే కావేరీనది ప్రవహించే చోళమండలం. ఆ మండలం తూర్పుసముద్రానికి పడమటి దిక్కున ఒక పట్టణ ముంది. ఆ పట్టణం చేరువ ఒక బిల్వవనం. ఆ బిల్వవనంలో మహాలక్ష్మి హరిని మనసులో నిలుపుకొని తపం చేసింది. ఆ తపస్సుకు శౌరి అనుగ్రహించాడు. ప్రేమతో దగ్గరికి చేరదీసి కావలించు కొన్నాడు. ఆ కారణంవల్ల ఆ పురానికి 'పరిరంభ పురమనే' ప్రసిద్ధమయింది.

ఆ పట్టణంలో మహావిష్ణువు 'శార్ఙ్గం' అనే ధనుస్సు అంశతో కార్తికమాసం కృత్తికానక్షత్రంలో 'కాలుడ'నే వాడు అవ తరించాడు. కాలుడు సామాన్యుడు కాదు. అనుపమయోగ విద్యాసక్తుడు. జన్మించే వేళనే స్వామి అనుగ్రహానికి నోచుకొన్న వాడు. కామినీమణులకు మన్మథుడుగా, అర్థకాములకు కల్పతరువుగా, విరోధులకు కాలుడుగా, పరమయోగులకు పర తత్త్వంగా, అఖిలరాజన్యులకు మహారాజుగా, ఆశు, మధుర, చిత్ర, విస్తర కవితలు అల్లగలవారికి వందనీయులుగా, మురవైరి పొగడబడేటట్లుగా ఇతరుల ప్రశంసలందు కొంటున్నవాడు. కరవాలం కారణంగా, గంటం చేబట్టిన కారణంగా ప్రసిద్ధు డయ్యాడు. ఆ పరకాలుడే చోళరాజేంద్రుని రాజ్యభారమంతా తన భుజబలంతో మోస్తూ ప్రజలందరు పొగడుతుంటే చోళ రాజుకు 'మంత్రిగా' ఉండేవాడు. ఆ పరిరంభపురం సమీపంలోనే 'నాగపురి'. ఆ పట్టణంలో పదకొండు విష్ణ్వాలయాలున్నాయి. అక్కడే ఒక పుష్కరిణి. ఆ పుష్కరిణి పేరు 'ధవళపుష్కరిణి'. ఆ పుష్కరిణిలో తెల్లకలువలలో సుమబాణంలాగా ఒక అప్సరస ఆవిర్భవించింది. సరోవరమే తన వాసంగా గడపసాగింది. ఆ కొలనికి దరిదాపుకు ఒకసారి 'ధన్వంతరికి' సరిపోలినవాడు 'అమృతహస్తి' అనేవాడు వచ్చాడు. అతని వేషం చిత్రాతిచిత్రం. చంకలో మందుల సంచి. చెవుల్లో దూది. చేతివేళల్లో ఉంగ రాలు. నొసట ఊర్ధ్వపుండ్రం. వలచేతిలో కరక్కాయ. పచ్చడంతో కుట్టిన పుస్తకం. అతడేమో దారిలో మూలికలను వెదక్కొంటూ అటు ఇటూ చూస్తూ వస్తున్నాడు. ఆ కొలని దగ్గర ఆగాడు.

ఆ కొలనిలో స్నానం చేయడానికి సిద్ధమై కొలనులో దిగాడు. ఆ కొలనిలోనే ఒక తెల్ల కలువపైని 'అప్సరస'ను చూచాడు. ఆమె వెన్నెలసోగలాగ మన్మథుని మంత్రాధిదేవత లాగా ఉంది. అమృతహస్తుడు తనకు సంతానం లేకపోవడంతో ఆమెను చూచి ముగ్ధుడయ్యాడు. అక్కున చేర్చుకొన్నాడు. తన స్వగృహానికి వచ్చి తన ఇల్లాలికి అందించాడు. తనకు ఆ బిడ్డ ఎలా దొరికిందో సవిస్తరంగా చెప్పాడు కూడా. అల్లిలో (పద్మం) దొరికింది కనుక ఆ బిడ్డకు 'కుముదవల్లి' అని నామకరణం చేశారు. ఆ బిడ్డను తల్లిదండ్రులు అల్లారు ముద్దుగా పెంచారు. ఆ బిడ్డ బాలికగా ఆపై యువతిగా పెరిగింది. అమృతహస్తుడు ఈ అందాల రాణికి అనుగుణుడయిన వాడెవడో అని ఆలోచిం చాడు. ఒకవేళ అలాంటివాడు తారసిల్లినా కులగోత్రాదులు తెలియ కుండా 'కన్యను ఇవ్వడం సబబా' అని దిగాలు పడుతున్నాడు.

మన్మథవనంలో వల్లిలాగ కనిపించే కైరవవల్లి పర కాలుని రూపగుణశీలాదులు విన్నది. రుక్మిణి శ్రీకృష్ణుని మనసా వరించినట్లుగా వరించింది.

పరకాలునికి అమృతహస్తుని వృత్తాంతమంతా తెలుసు. 'అయినా, ఆ వైద్యునికి బిడ్డలు లేరని విన్నాను కదా! అతనికి లోకోత్తర కన్యారత్నం పుట్టడం ఎప్పుడు?' అని తర్కించుకొని ఆమెను చూడాలని తన పీమలో పర్యటించే నెపంతో నాగ పట్టణానికి వచ్చాడు. తానే పండితుని ఇంటికి వెళ్ళాడు. అక్కడ తచ్చాడే కుముదవల్లిని రెప్ప వాల్చకుండా చూచి పరాంతనుడు వైద్యునితో 'అపరధన్వంత్రి! ఈ చంద్రవదన నీకెలా దొరికింది? నాకేమో ఆమె మీద మనసుపడ్డది. ఆమెను నా కివ్వు' అన్నాడు. 'అంతేకాదు మాటలెందుకు? నిలువెత్తు ధనమయినా ఇవ్వడానికి సిద్ధమే' అన్నాడు.

'మహారాజా! ఈ నగరం చివర ఒక సరస్సులో ఒక తెల్లకలువలో ఈ బిడ్డ పుట్టింది. ఆ బిడ్డను నేను చూచాను. తానమాడడానికి వెళ్ళిన నాకు చాల ఆశ్చర్యం వేసింది. అంచేత ఇంటికి తెచ్చుకొన్నాను. కన్నబిడ్డ లాగా చూసుకుంటున్నాము. నీలాంటి వరుడు తారసిల్లితే అంతకంటె భాగ్యమా? తప్పక వివాహానికి అంగీకరిస్తున్నా! అయితే ఒక షరతు. ఈ షరతు మేము నిర్ణయించింది కాదు. నా పాప కుముదవల్లి తనకు తానే మాతో చెప్పిన షరతు.

(ఇంకా ఉంది)

అధర్మం వంశనాశనానికి, ధర్మం వంశవృద్ధికీ కారణం అవుతుంది

బ్యాక్ సవారీ ఉత్సవం

- శ్రీమతి అరుంధతి

ఇది వేయి సంవత్సరాలకిందటి కథ. రామానుజాచార్యుల కాలం నాటిది. ఆయనే అనుకొంటారు తిరుమల కొండమీద నిత్యం శ్రీవారికి పుష్పకైంకర్యం చేసేవారెవ్వరా అని. ఈ ప్రశ్న తన శిష్యులముందు ప్రస్తావించారు ఆ భగవద్రామానుజులు. తిరుమల ఇప్పటివలె కాదు, సంవత్సరంలో అధిక కాలం కండలుపిండే చలి. అందరూ భయపడ్డారు. ఎవరూ ముందుకురాలేదు. ఒక్క అనంతాచార్యులనే శిష్యుడు 'గురుదేవా! నేను' అన్నాడు. 'అనంతా! నీవు మగధీరుడవు' అంటూ రామానుజులు ఆశీర్వదించారు. ఈ పుష్పకైంకర్యం అంత సులువైంది కాదని రామానుజులవారికి తెలుసు. అందుకే 'మగధీరా'– అంటూ ధైర్యాన్ని పెంచారు గురుదేవులు. ఇది శ్రీరంగంలో జరిగిన సన్నివేశం.

అనంతాచార్యులు తన ఇల్లాలిని వెంటబెట్టుకొని తిరుమలకు బయలుదేరారు. ప్రతిదినం పుష్పకైంకర్యం చేయాలంటే పూలతోట కావాలి. తోటకు నీళ్లుండాలి. నీళ్లకోసం కోనేరు తవ్వుకోవాలి. పనివాళ్లను పెట్టుకోవాలంటే డబ్బు కావాలి. తన దగ్గర డబ్బు లేదు. తాను తన భార్య కలిసి కోనేరు తవ్వుకోవాలనుకొన్నారు. గునపం, తట్ట సంపాదించాడు. ఆమె వట్టిమనిషి కాదు. నిండు చూలాలు. ఇద్దరూ కోనేరుపని మొదలుపెట్టారు. అనంతుడు గునపంతో నేలతవ్వి మట్టి తట్ట కెత్తుతాడు. ఆమె ఆ తట్టను మోసుకొంటూ దూరంగా వేసి రావాలి. ఇలా జరుగుతూ ఉంది. తిరుమల దైవం శ్రీనివాసునికి జాలి కలిగింది. తనకోసం శ్రమిస్తున్న దంపతులకు సాయం చేద్దా మనుకొన్నాడు. శ్రీనివాసుడు బాలకుని రూపంలో వచ్చి సాయం చేయబోయాడు. 'మేము స్వామికి కైంకర్యం చేస్తున్నాము. మాకు మరొకరి సాయం వద్దు. దూరంగా వెళ్లిపో' అన్నారు అనంతాచార్యులు. అయినా ఆ బాలుడు తట్టమోయబోయాడు. మా పనిలోకి వచ్చావో ఈ గునపంతో ఒక్కటిస్తాను అన్నాడు. దిగిన వెంటనే గునపం పట్టుకొని బాలుణ్ణి తరుముతూ గునపం విసిరాడు. సరిగ్గా అదే సమయంలో బాలుడు వెనుదిరిగి చూశాడు. గునపం బాలుని గడ్డం తగిలింది. గాయం అయింది. నెత్తురు చిమ్ముతూ ఉంది. బాలుడు పరుగెత్తి దేవాలయంలో దూరి తలుపులు వేసుకొన్నాడు.

సాయంకాలం పూజకు అర్చకులు, పరిచారకులు ఆలయానికి వచ్చారు. దారి వెంట నెత్తుటి చారలు. లోపల స్వామి గడ్డానికి నెత్తుటి గాయం. ఈ వార్త పొక్కింది. ఇది అనంతాళ్వారు చేసిన తప్పిదమని తేలింది. స్వామిని మన్నించమని వేడుకొన్నాడు అనంతాచార్యులు. స్వామి కరుణించాడు. పట్టుపీతాంబరం, కుండలాలు, ఉంగరం ప్రసాదించాడు. ఆలయంలో ఇప్పటికీ శ్రీనివాసునిపై విసరిన గునపం చూడవచ్చు.

"స్వామీ! మీకు పుష్పకైంకర్యం చేయవలసిందిగా మా గురుదేవులు రామానుజులవారి ఆజ్ఞ. వారి ఆజ్ఞమీద మీకు సేవ చేస్తున్నాను. మా గురువుగారి ఆజ్ఞకు విఘ్నం కలిగించ కూడదు. వైకుంఠం నుంచి తామిక్కడికి వచ్చారు. మీ వెనుక నేనూ ఇక్కడికి వచ్చాను. ఎక్కడ నుంచో ఇరువురం ఇక్కడికి వచ్చిన వాళ్లమే. ఇక్కడున్న మీకు మాలాకైంకర్యం కోసం నా గురుదేవులు నన్ను నియోగించారు. నాకు నా గురువే పర దైవతం. ఆయన్ని, కాదని మీమాట వినమంటారా"– అన్నారు.

శ్రీనివాసునికి కరుణ కలిగింది. అనంతాచార్యుల్ని, స్వామి అక్కున చేర్చుకొన్నాడు. అంతటితో భక్తునిమీద పరీక్షలు ఆగలేదు. ఒకరోజు స్వామివారు రాజు, రాణి వేషంలో రాత్రిపూట ఆ ఉద్యానవనంలోకి ప్రవేశించి మంచి మంచి పూలుకోసి వాసన చూసి క్రింద పడేసి వెళ్లిపోయారు. తెల్లవారు జామున అనంతాచార్యులు కైంకర్యానికి పూలు కోయడానికి తోటలోనికి వెళ్లారు. అక్కడ ఎక్కడా పూలు లేవు. పైగా కింద పూలను ఎవరో తుంచి పడేసి ఉన్నారు. అనంతాచార్యులు ఎక్కడో పైన మిగిలిన పూలు సేకరించి మాల తయారుచేసి తీసుకుని వెళ్లి చాలాబాధతో స్వామికి అర్పించారు. అపుడు స్వామిని ఈ

2017, అక్టోబరు 2న
బ్యాక్ సవారీ ఉత్సవం సందర్భంగా...



విధంగా వేడుకుంటాడు, 'స్వామీ! దయచేసి క్షమించు. ఎవడో దుర్మార్గుడు నా తోటలో పూలు తుంచి వేశాడు. రేపు మీకు మంచిపూలతో మాల తయారు చేస్తాను' అని చెప్పి వెళ్లిపోయాడు.

అనంతాచార్య ఎలాగైన వారిని పట్టుకోవాలని ప్రయత్ని స్తాడు. కానీ స్వామివారు మాత్రం దొరకకుండా తప్పించుకుని అప్రదక్షిణ మార్గంలో గర్భగుడిలోకి ప్రవేశిస్తారు. అమ్మవారు మాత్రం తప్పించుకోలేక అతనిచేతిలో చిక్కుకుపోయింది. అమ్మ వారిని పూలతీగలతో ఒక చెట్టుకు కట్టేసి తాను ఆ రాత్రంతా అక్కడే కాపలా ఉంటారు.

సుప్రభాతం తర్వాత పూజారులు తలుపులు తెరచి స్వామివారికి హారతి ఇవ్వడానికి సిద్ధమవుతారు. శ్రీవైష్ణవులకు లక్ష్మీదేవి ఆరాధ్యదైవం కాబట్టి మొట్టమొదటి హారతి అమ్మ వారికి ఇచ్చి తర్వాత స్వామికి ఇస్తారు. కానీ ఇక్కడ హారతి ఇవ్వడానికి అమ్మవారు స్వామివారి హృదయస్థానంలో లేరు. పూజారులు కంగారుపడ్డారు. అప్పుడు స్వామివారు పూజారులతో ఇలా చెప్తారు.

'మీరేమి కంగారు పడవద్దండి. మేము ఇద్దరం అనంతా చార్య తోటలోకి వెళ్లి అతనికి చిన్నసేవ చేద్దాము అనుకున్నాము. అతను మమ్మల్ని తప్పుగా అర్థం చేసుకుని చెట్టుకు కట్టివేయ డానికి ప్రయత్నించాడు. కానీ నేను ఎలాగో తప్పించుకుని వచ్చేశాను. మీ అమ్మవారు అక్కడే నానా అవస్థలు పడుతూ ఉంది. కాబట్టి మీరు వెళ్లి నా తరపున అనంతాచార్యులకు క్షమాపణ చెప్పి అమ్మవారిని తీసుకురండి' అని చెప్పాడు. పూజారులు బాజా, భజంత్రీలతో అనంతాచార్య తోటలోకి ప్రవేశించి జరిగిదంతా వివరిస్తారు.

స్వామివారి సేవకు మీరు అడ్డు తగిలారు అని నీవు విధించిన శిక్షకు అమ్మవారు ఎంతో పరవశించిపోయారు. కానీ అనంతాచార్యులవారు నా సేవకు వీరు అడ్డుతగిలారు కాబట్టి నేను వీరికి శిక్ష విధించాల్సిందే అని అంటాడు. అర్చకులు భయపడిపోయారు. మనది శ్రీ సంప్రదాయం కాబట్టి అమ్మవారు లేకుండా మనం ఏపూజ చేయడానికి లేదు అని అంటారు. నేను మాత్రము ఈమెను విడిచిపెట్టేది లేదు. కానీ ఒక్క షరత్తు మీద వదిలిపెడ్తాను, అదేమిటంటే తండ్రి తన సొంత కూతురు ఎంతపెద్ద తప్పు చేసినా క్షమిస్తాడు. కాబట్టి ఈమె నన్ను తన సొంత తండ్రిగా అంగీకరిస్తే నేను ఈమెను వదిలిపెడ్తాను అంటాడు. పూజారులు అమ్మవారిని బ్రతిమలాడుతారు. అమ్మవారికి కావలసింది అదే. వెంటనే అమ్మవారు ఒప్పుకుని నేను ఈ రోజునుండి అనంతాచార్యుని నా తండ్రిగా అంగీకరిస్తు న్నాను అని చెబుతుంది. ఆ మాట వినగానే అనంతాచార్యుల వారు ఎంతో సంతోషించి అమ్మవారికి సాష్టాంగ ప్రణామంచేసి రెండుచేతులతో, దోసిలి పడతాడు. అమ్మవారు చిన్న విగ్రహంగా మారిపోయి అనంతాచార్య దోసిలిలోకి వచ్చేస్తుంది.

అప్పుడు పూజారులు ఆ విగ్రహాన్ని తీసుకుని వెళ్లి గర్భ గుడిలో ఉన్న స్వామివారికి చూపిస్తారు. అమ్మవారు స్వామి వక్షఃస్థలంలో చేరు కుంటారు. అప్పుడు పూజారులు హారతి, నైవేద్యం సమర్పిస్తారు.

ఈ లీల జరిగినరోజు గుర్తుండే విధంగా బ్రహ్మోత్సవా లలో చక్రస్నానం ముగిసిన మరుసటిరోజు సాయంత్రం స్వామి వారిని ఉభయదేవేరులతో అప్రదక్షిణమార్గంగా అనంతాచార్య సమాధివద్దకు తీసుకుని వెళ్తారు. అనంతాచార్య సమాధి దగ్గర ఆయన వంశీయులకు స్వామివారి తరపున పూజారి మర్యాద చేస్తారు. తరువాత స్వామివారు అప్రదక్షిణ మార్గంలోనే ఆలయం లోనికి వేంచేస్తారు. ఈ ఉత్సవానికే **"బ్యాక్ సవారీ"** అని పేరు.

వేదాంతదేశికుల వారి జీవితం పరమపావనం



– శ్రీ వేమరాజు అనంతపద్మనాభం

పవిత్రభారతావనిలో ధర్మసంస్థాపనకై, పరిరక్షణకై యుగయుగాలుగా ఎంతోమంది మహనీయులు జన్మించి సనాతనధర్మాన్ని సువ్యవస్థితము చేసిన విషయం మనందరికీ విశదమే. ఆదిశంకరభగవత్పాదులు, శ్రీమద్రామానుజులు వంటి మహనీయులు తమ బోధలద్వారా రచనలద్వారా లోకోద్ధరణ చేశారు. ఈ కోవకు చెందిన మరో అవతార పురుషుడు, మహనీయుడు, విశిష్టాద్వైతసంప్రదాయాన్ని పరిఢవింపచేసిన మహాపురుషుడు **శ్రీవేదాంతదేశికులు.**

సంతానలేమితో వ్యధ చెందుతున్న శ్రీఅనంతసూరి తోతాంబ దంపతులకు స్వప్నంలో దర్శనమిచ్చిన శ్రీవేంకటేశ్వరస్వామి తన నైవేద్యఘంటను ప్రసాదించడం, దానిని తోతాంబ మింగడం– ఈ దివ్యసంఘటనానంతరం ఆ దంపతులకు పుత్రసంతతి కలిగెను. అతనిపేరు శ్రీవేంకటనాథుడు. ఇది క్రీ.శ. 1268 సంవత్సరంలో జరిగింది. వీరు కాంచీపురానికి సమీపములోని తూప్పుల్ గ్రామంలో జన్మించారు.

పుట్టుకతోనే విశేషప్రతిభాపాటవాలు కలిగిన శ్రీవేంకటనాథుడు 20వ సంవత్సరం వచ్చేటప్పటికే సకలశాస్త్ర పారంగతుడయ్యాడు. సంస్కృతం, ప్రాకృతం, మణిప్రవాళం, (సంస్కృత తమిళ మిశ్రమైన భాష) వంటి అనేకభాషలలో ప్రావీణ్యత సాధించాడు. తర్కం, వ్యాకరణం, వేదాంతం, కావ్యములు మున్నగు విషయాలలో ఎంతో అధికారము సాధించాడు. వీరికి **“కవితార్కిక కేసరి”** అనే బిరుదు ఉన్నది.

వేంకటనాథుడు బహుముఖప్రజ్ఞాశాలి. శ్రీహయగ్రీవ మంత్రోపాసనలోను, గరుడమంత్రోపాసనలోను సిద్ధి పొందిన వ్యక్తి.

వేంకటనాథునికి వివాహం జరిగిన కొన్నిసంవత్సరాలకు కడలూరుకు సమీపంలోని తిరువహీంద్రపురంవద్ద ఒక పర్వతంపై గరుత్మంతుని దర్శనార్థం తపస్సు చేశారు. గరుత్మంతుని దర్శనమయ్యాక, ఈయన సూచనమేరకు హయగ్రీవునికై తపస్సు చేశారు. హయగ్రీవుడు ప్రత్యక్షమై సమస్తజ్ఞానాన్ని ప్రసాదించాడు.

తన యావజ్జీవితం విద్యాబోధ చేస్తూన్న, శ్రీరామానుజ సంప్రదాయాన్ని ప్రచారం చేస్తూ భిక్షాటన ద్వారానే జీవించిన నిరాడంబరుడు వేంకటనాథుడు.

ఎన్నోసంవత్సరాలు తిరువహీంద్రపురంలో నివసించి తరువాత దేశములోని అనేక తీర్థాలు సందర్శించారు. శ్రీరంగంలో పండితులతో శ్రీరామానుజ ప్రతిపాదితమైన విశిష్టాద్వైత సంప్రదాయంపై వాదించి, జయించి వేదాంతదేశికులు అయినారు. నాటినుండి వీరిపేరు **వేదాంతదేశికన్** లేక **వేదాంత దేశికులుగా** ప్రసిద్ధిగాంచినది. వీరికి 48వ ఏట శ్రీవరదాచార్యులు అనే పుత్రుడు పుట్టెను.

శ్రీవేదాంతదేశికులు సారూప్యత పొందిన ఒక విజ్ఞాన సాగరం, విజ్ఞాన సర్వస్వం. వీరు శతాధిక గ్రంథములను రచించారు. అందులో మహాకావ్యాలు, లఘుకావ్యాలు, నాటకం, వ్యాఖ్యానాలు, స్తోత్రములు, వ్యాకరణశాస్త్ర గ్రంథములు, వేదాంత గ్రంథాలు మొదలైనవి. తమిళభాషలో వీరు రచించిన గ్రంథాలను **దేశిక ప్రబంధములుగా** వ్యవహరిస్తారు. వీరు చేసిన కృషి అనన్య సామాన్యం, అనితరసాధ్యం.

ప్రధానంగా వీరిజీవితం శ్రీరామానుజుల విశిష్టాద్వైత సంప్రదాయాన్ని విశ్వవ్యాప్తం చేయడంలో గడిచినది. శ్రీరామానుజుల దివ్యప్రబంధమునకు వ్యాఖ్యానము వ్రాయడమే కాకుండా, శ్రీరంగంవంటి ప్రముఖ దేవాలయాలలో దివ్య ప్రబంధపారాయణం చేసే సంప్రదాయాన్ని నిలబెట్టారు.

కావ్య రచనలు

శ్రీవేదాంతదేశికులు ‘యాదవాభ్యుదయం’ అనే పెద్ద కావ్యాన్ని రచించారు. మహాకవి కాళిదాసు రచించిన మేఘ సందేశము ప్రేరణతో ‘హంససందేశం’ అనే లఘుకావ్యాన్ని

అక్టోబరు-28న వేదాంతదేశికుల శాత్తుమొఱ సందర్భంగా..

రచించారు. వీరి కవితాశైలిపై పూర్వకవులైన కాళిదాసు, భవభూతి, భారవి వంటి వారి ప్రభావం ఎంతో ఉన్నది.

రహస్య గ్రంథములు

శ్రీవేదాంతదేశికులు మణిప్రవాళభాషలో అనేక తాత్త్విక గ్రంథాలు వ్రాశారు. వీటిలో 'రహస్యత్రయసారం' విశిష్టమైనది.

స్తోత్రములు

శ్రీవేదాంతదేశికులు రచించిన స్తోత్రములు ఎన్నో ఉన్నాయి. శ్రీరంగనాథునిపై కేవలం మూడుగంటలసమయంలో 1000 శ్లోకాలలో 'శ్రీపాదుకాసహస్రం' రచించిన మహిమాన్వితులు వీరు. ఇంకా శ్రీస్తుతి, భూస్తుతి, హయగ్రీవస్తోత్రం, అచ్యుతశతకం వంటివి ఎన్నో ఉన్నాయి. వీరు చేసిన శ్రీస్తుతి వలన ఒక పేదబ్రాహ్మణునికి బంగారునాణాలు వర్షించాయి. ఆలోచిస్తే ఆదిశంకరుల కనకధారస్తోత్రంవంటిదే శ్రీస్తుతికూడ. రెండింటి పరమార్థం దీనులను అనుగ్రహించడమే.

శ్రీవేదాంతదేశికులు 101 సంవత్సరాలు జీవించి తన కుమారుని తొడపై తలబెట్టి దివ్యప్రబంధం, ఉపనిషత్తులు వింటూ దేహత్యాగం చేసిన మహిమాన్వితుడు, కారణజన్ముడు, అవతారపురుషుడు, ధన్యజీవి. వీరిప్రతిభ అనన్యసామాన్యం–అందరినీ ఆశ్చర్యచకితులను చేస్తుంది.

శ్రీవేదాంతదేశికుల స్తోత్రములను పఠించేముందు చేయవలసిన ధ్యానశ్లోకాన్ని శ్రీవరదాచార్యులు (ఆయన పుత్రుడు) రచించారు.

శ్రీమాన్ వేంకటనాథార్య కవి తార్కిక కేసరీ।
వేదాంతాచార్యవర్యో మే సన్నిధత్తాం సదా హృది॥

ఇంకా వేదాంతదేశికులవారిని ఇలా ప్రస్తుతిద్దాం...

రామానుజదయాపాత్రం జ్ఞానవైరాగ్యభూషణమ్।
శ్రీమద్వేంకటనాథార్యం వందే వేదాంతదేశికమ్॥

శ్రీవేదాంతదేశికుల విగ్రహం శ్రీరంగంలో రంగనాయకీదేవి సన్నిధిలో అందరికీ దర్శనమిస్తోంది.

శ్రీమాన్ వేదాంతదేశికులవారు సనాతన ధర్మపరిరక్షణలో, విశిష్టాద్వైతమత పరివ్యాప్తిలో, దివ్యప్రబంధబోధనలో, సాహిత్యంలో చేసిన కృషి శ్రీవేంకటేశ్వరస్వామి కరుణతో ఎన్నో వేల సంవత్సరాల పర్యంతం భక్తి ప్రపత్తులతో గుర్తించుకోవలసినది. సాంజలికంగా ఆచార్యులకు ప్రణమిల్లుటయే మనం చేయవలసిన కర్తవ్యం.

సర్వం ఆచార్యదేవ చరణారవిందార్పణమస్తు

అక్టోబరు, 28న శ్రీపిళ్ళైలోకాచార్యుల వర్షతిరునక్షత్ర సందర్భంగా..

శ్రీపిళ్ళైలోకాచార్యులు

– శ్రీ ఈ.రంగాచార్యులు

విశిష్టాద్వైతసిద్ధాంతప్రవర్తకులలో ప్రధానులు శ్రీరామానుజులు. వీరికి పిమ్మట ఆ సిద్ధాంతాన్ని గ్రంథరచనలద్వారా, ప్రవచనాలద్వారా మరింత బలోపేతం చేసి, ప్రచారం చేసిన ఆచార్యులెందరో ఉన్నారు. వారిలో **శ్రీపిళ్ళైలోకాచార్యుల**వారు సాటిలేని వైభవాన్ని కలవారు.

శ్రీరామానుజుల ప్రధానశిష్యులలో గోవిందభట్టర్ (ఎమ్బార్)ఒకరు. వీరు శ్రీరామానుజులకు పినతల్లి కుమారుడు. గోవిందభట్టర్ శిష్యుడు పరాశర భట్టర్. భట్టర్ శిష్యులు నంజీయర్ అనే వేదాంతి. వీరి శిష్యులు లోకాచార్యులనబడే నంబిళ్ళై. వీరి శిష్యులు వడక్కుత్తిరువీదిపిళ్లై అనే శ్రీకృష్ణపాదులు. వీరి కుమారులే శ్రీపిళ్ళైలోకాచార్యులు.

వీరి జన్మస్థలం శ్రీరంగం. క్రోధనసంవత్సరం తులామాసం శ్రవణానక్షత్రంలో క్రీ.శ.1205వ సంవత్సరంలో జన్మించారు. సుమారు 106 సంవత్సరాల పరిపూర్ణజీవితాన్ని గడిపిన ఈ మహనీయులు శ్రీరామానుజ సంప్రదాయానికి, విశిష్టాద్వైత సిద్ధాంతానికి చేసిన సేవ అనిర్వచనీయమైనది, అజరామమైనది.

వీరి జన్మ వృత్తాంతం విలక్షణమైనది. నంబిళ్ళై ప్రతిదినం తమ శిష్యులకు సిద్ధాంతసంప్రదాయ గ్రంథప్రవచనాన్ని (శ్రీరంగంలో) చేసేవారు. ఆ ప్రవచనాన్ని వినడంకోసం వారి శిష్యులు వడక్కుతిరువీదిపిళ్ళై ప్రతిదినం వెళ్ళేవారు. పిళ్ళైకు వివాహమై చాలా కాలమైనా సంతానం కలుగలేదు. ఒకనాడు పిళ్ళై తల్లి నంబిళ్ళై దగ్గరకు వచ్చి, తన కుమారునకు పుత్రసంతానం కలిగేటట్లు ఆశీర్వదించమని కోరింది. నంబిళ్ళై అపుడు వడక్కుత్తిరువీదిపిళ్ళై పత్నిని తమవద్దకు తీసికొనిరమ్మని పల్కి "నావంటి ఒక సుపుత్రుడు నీకు కల్గుతాడు" అని ఆశీర్వదిం

చారు. ఆచార్యుల మాటను పిళ్ళై శిరసా వహించగా, కాల క్రమేణ పిళ్ళైకు ఒక కుమారుడు పుట్టాడు. లోకాచార్యులనే పేరుతో ప్రసిద్ధులైన తమ ఆచార్యులు నంబిళ్ళై అనుగ్రహంవల్ల కల్గిన పుత్రుడైనందున, పిళ్ళై, తమ కుమారునకు ఆచార్య నామాన్నే "లోకాచార్యుల"ని పెట్టారు. అయితే, ఆ ఇద్దరి మధ్య భేదం గుర్తించడం కోసం ముందు 'పిళ్ళై' అనే పదాన్ని చేర్చి "పిళ్ళైలోకాచార్యులు" అనే పేరుతో వీరు వ్యవహరింపబడ్డారు.

పిళ్ళైలోకాచార్యులు సాక్షాత్తు కంచి వరదరాజస్వామి అవతారమేననే విషయాన్ని తెలిపే ఒక ఐతిహ్యాన్ని శ్రీవర వరమునులు, శ్రీపిళ్ళైలోకాచార్యులవారి గ్రంథం శ్రీవచన భూషణాన్ని వ్యాఖ్యానిస్తూ, అవతారికలో ప్రస్తావించారు. కంచి వరదరాజస్వామి 'మణప్పాక్కత్తునంబికి ('మణప్పాక్కమ్' - అనే గ్రామంలోని భక్తులొకరు) కలలో కన్పించి, కొన్ని అపూర్వమైన సంప్రదాయార్థాలను బోధించి, 'మీరు శ్రీరంగానికి పోయి కావేరి నదితీరంలో ఉండండి. ఇంకా కొన్ని విశేషాలను మేము అక్కడ తెలియజేస్తాము'- అని పల్కి అదృశ్యమయ్యాడు. నంబి ఆ రీతిలోనే శ్రీరంగాన్ని చేరి, రంగనాథుని సేవించి, వరదరాజ స్వామి తమకు తెల్పిన విషయాలను స్మరిస్తూ, ఏకాంతంగా ఒక కోవెలవద్ద కాలం గడుపుతున్నారు. కొంతకాలం తరువాత, ఒకనాడు, పిళ్ళైలోకాచార్యులు తమ అంతరంగ శిష్యులతో కలసి నంబి ఉండే కోవెల దగ్గరకు యాదృచ్ఛికంగా వచ్చారు. ఆ చోట ఏకాంతంగా ఉన్నదని తలచి, అక్కడ తమ శిష్యులకు రహస్యార్థాలను ఉపదేశించడం ఆరంభించారు. అపుడక్కడే ఉన్న నంబి ఆ ఉపదేశాలను విన్నారు. అవి, తమకు పూర్వం వరదరాజస్వామి స్వప్నంలో పల్కిన అర్థాలేఅని గ్రహించి, వెంటనే పిళ్ళైలోకాచార్యుల పాదాలపై వాలి, "వారేనా మీరు!" అని ఆశ్చర్యంతో పలికారు. పిళ్ళైలోకాచార్యులు అదేమని ప్రశ్నించగా జరిగిన సంగతిని నంబి తెలిపారు. పిళ్ళైలోకాచార్యులు సంతోషించి, నంబి ప్రార్థనపై వారిని తమ శిష్యులగా చేసికొన్నారు. ఈ వృత్తాంతాన్నిబట్టి కంచి వరదరాజస్వామియే పిళ్ళైలోకాచార్యులుగా అవతరించారని సాంప్రదాయికవిశ్వాసం.

సహజంగా సాటి లేని ప్రతిభను కలవారై, నమ్బిళ్ళై పరిపూర్ణానుగ్రహానికి పాత్రమై, విద్వద్వరిష్ఠులైన శ్రీకృష్ణపాదుల శిక్షణలో శాస్త్ర, సాంప్రదాయికవిద్యలన్నింటిని నేర్చిన పిళ్ళైలోకాచార్యులు సాటిలేని మేటి పాండిత్యాన్ని గడించారు. తాము గ్రహించిన అపూర్వమైన జ్ఞానసంపదను లోకానికి ఉదారంగా అందించదలచి, అష్టాదశరహస్యాలనే పేరుతో 18 గ్రంథాలను రచించారు. ఇవన్నీ మణిప్రవాళభాష (అంటే సంస్కృత - ద్రావిడభాషల సమ్మేళనంతో కూడిన భాష) లో రచింపబడ్డాయి. ఈ పద్దెనిమిది రహస్య గ్రంథాలద్వారా పిళ్ళైలోకాచార్యులవారు వేదేతిహాసపురాణాలలో, ఆళ్వార్లప్రబంధాలలో, పూర్వాచార్యుల శ్రీభాష్యాదిగ్రంథాలలో, స్తోత్రాలలో ఉండే అపూర్వార్థాలను సమీకరించి, అందించి విశ్వశ్రేయస్సుకు పాటుపడ్డారు.

1)ముముక్షుప్పడి 2)యాదృచ్ఛికప్పడి 3)శ్రియఃపతి పడి 4)పరన్దపడి 5)తనిచరమమ్ 6)తనిద్వయమ్ 7)తని ప్రణవమ్ 8)శ్రీవచనభూషణమ్ 9)అర్థపంచకమ్ 10)తత్త్వశేఖరమ్ 11)తత్త్వత్రయమ్ 12)అర్చిరాది 13)ప్రమేయశేఖరమ్ 14)నవవిధసంబంధమ్ 15)ప్రపన్నపరిత్రాణమ్ 16)సార సంగ్రహమ్ 17)నవరత్నమాలై 18)సంసారసామ్రాజ్యమ్ - అనే ఆ 18 గ్రంథాలు.

ఈ గ్రంథాలన్నిటిలో శ్రీవచనభూషణమనే గ్రంథానికి గల గౌరవం గొప్పది. అందువల్లనే వరవరమునులు *"ఆర్వశన బూడణత్తిన్ ఆళ్పొరుళెల్లామ్ అఱివార్?"* (శ్రీవచనభూషణ గ్రంథంలోని గంభీరాలైన అర్థాలను అన్నిటిని తెలియగల వారెవరు?) అని అన్నారు.

పిళ్ళైలోకాచార్యులవారి తమ అంతిమదశలో శ్రీరంగానికి వెళ్ళే మార్గమధ్యలో "జ్యోతిష్కుడి" అనే చోట క్రీ.శ. 1311వ సంవత్సరంలో పరమపదించారు.

2017 నవంబరు నెల ముఖ్యమైన పండుగలు

- **01** కైశికద్వాదశి
- **03** కార్తికపూర్ణిమ
- **08** తిరుపతి, శ్రీకపిలేశ్వరస్వామివారి లక్షబిల్వార్చన
- **15-23** తిరుచానూరు, శ్రీపద్మావతీఅమ్మవారి బ్రహ్మోత్సవాలు
- **16** ధన్వంతరిజయంతి
- **24** సుబ్బరాయషష్ఠి
- **30** గీతాజయంతి



పుష్పయాగం

– శ్రీ అప్పరుసు రమాకాంతరావు

ఏమాత్రం సందడి చేయకుండా వికసించి పరిమళించే పుష్పం దైవానికి ప్రతిరూపం. మానవులను నిష్కల్మష ఆధ్యాత్మిక అనుభూతులకు గురిచేస్తూ, చూడగానే కన్నులకు ఇంపు చేసే పువ్వుల్లో దైవత్వం నిండి ఉంటుంది. పుష్పాలు తమ రూప లావణ్యాలు, శోభతో మనలను ఆత్మసమర్పణకూ అనురక్తికి గురి చేస్తాయి. మనిషినుంచి ఏమీ ఆశించకుండానే పువ్వులు మనోహరమైన సౌరభాలను వెదజల్లుతూంటాయి – ఆ పరాత్పరుడిలాగా! దేవదేవుడూ అంతే! భావంలో అనురాగము ఆర్తి కల్పిస్తూ, మననుంచి ఏమీ తీసుకో కుండానే భక్తుడికి అన్నీ ఇవ్వాలని భావిస్తాడు. యజు ర్వేదంలో భాగమైన మంత్రపుష్పంలోని పదమూడవ శ్లోకం **"యోఽపాం పుష్పం వేద, పుష్పవాన్ ప్రజావాన్ పశువాన్ భవ"** అంటూ ఆరంభమవుతుంది. పుష్పాలు ఆ దేవదేవుని ఆశ్రయాలై ఉంటాయని తెలుసుకొన్న వారు ముక్తులవుతారన్నది ఆ మంత్రార్థం.

పుష్పాలను దైవానికి సమర్పించడంవల్ల వాటిలోని సచేతనత్వం చలించి మనిషిలోకి పవిత్రత ప్రవేశిస్తుందని నారాయణోపనిషత్తు వివరిస్తోంది. హృదయంలో ప్రసన్నతకు సర్వశ్రేష్ఠమైన మూలం పుష్పాలే! **"పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి – తదహం భక్త్యుపహృతమ్ అశ్నామి ప్రయతాత్మనః"** అని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీత తొమ్మిదో అధ్యాయం (రాజావిద్యా రాజగుహ్యాయోగం) లో చెప్పారు. దైవానికి సమర్పించే కానుకలన్నింటికన్నా పుష్పనివేదన ఆత్మసమర్పణకు చక్కని ప్రాతిపదిక. పెరుమాళ్ళకు సమర్పించే పుష్పాలను తరువు నుంచి కోయడానికి సైతం విలక్షణ విధానం ఉందని ఆగమ శాస్త్రాలు చెబుతున్నాయి. స్నానం చేశాక పాదరక్షలు ధరించకుండా మొక్కవద్దకు వెళ్ళాలి. రెండుచేతులతో ఆ మొక్క కాండాన్ని స్పృశించి ఇష్టదైవాన్ని ప్రార్థించాలి. పుష్పాన్ని ఆ మొక్కనుంచి దూరం చేస్తున్నందుకు మన్నించమని మనసులో అనుకోవాలి. బొటన వేలు, చూపుడు వేలు, మధ్య వేలు కలిపి పువ్వును కోయాలి. వేలి గోరును పుష్పానికిగానీ, మొక్క రెమ్మకు గానీ తాకించకూడదు. స్వార్థానికి కాక పరమాత్మ సమర్పణకు మాత్రమే ఆ పుష్పాన్ని వినియోగిస్తున్నాననే భావం ప్రస్ఫుటం కావాలి. తొండరడిప్పొడి ఆళ్వార్ (విప్రనారాయణ) శ్రీరంగంలో రంగనాథస్వామికి పుష్పకైంకర్యం చేసేవారు. మొక్క లను సంరక్షణచేస్తూ మాలలుగుచ్చి స్వామికి సమర్పించేవారు. మాల కోసం పుష్పాలను సేకరించేందుకు ఆయన ఆచరించిన పద్ధతిని నేటికీ సంప్రదాయంగా అవలంబిస్తున్నారు. పుష్పాన్ని కోసే అయిదు వేళ్ళు పంచేంద్రియాలకు సంకేతంగా భావించాలని 'తిరుచ్చంద విరుత్తమ్' ప్రబంధంలో ఉంది. పుష్పాన్ని పెరుమాళ్ళకు సమర్పించే ముందు, హృదయానికి తాకించి అర్పించాలని అంటారు. ఇలా చేయడం హృదయ సమర్పణకు గుర్తు.

తిరుమలలో నెలకొన్న శ్రీవేంకటేశ్వరస్వామి సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే! వేంకటాచలపతి శ్రీమహావిష్ణువు కలియుగ అవతారం. శ్రీవైష్ణవ సంప్రదాయంలోని 108 దివ్యదేశాలలో తిరుమల ఒకటి. శ్రీవైఖానస భగవచ్ఛాస్త్రోక్త మార్గాన్ని అనుసరించి తిరుమలలో శ్రీవారికి రోజుకు ఆరుసార్లు పూజలు జరుగుతాయి. దీనినే ఆగమ పరిభాషలో **'షట్కాల పూజ'** అని అంటారు. ప్రతి పూజలోను పుష్పాలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. తిరుమల శ్రీనివాసుడు అలంకారప్రియుడు. అష్టదళపాద పద్మారాధన, పూలంగిసేవ, డోలోత్సవం, సహస్రదీపాలంకరణ, వసంతోత్సవంలో శ్రీవారిని పూలతో మనోహరంగా అలంకరిస్తారు. ప్రతిరోజు స్వామివారికి వంద అడుగుల పొడవైన ఏడుపూలహారాలను సమర్పిస్తారు. ఇరవై ఏడు రకాలపుష్పాలు, ఏడురకాల సుగంధభరితమైన ఆకులు ఈ హారంలో ఉంటాయి. ప్రతిరోజూ వందకిలోల పూలను మాలలుగా అల్లుతారు. దైవానికి సమర్పించే పూలు విశేషమైనవి. ఇరవై ఏడు రకాల పూలలోని ఒక్కో రకమైన పుష్పానికి ఒక్కో నిర్దిష్ట అనన్యత ఉంది. ఐతిహాసిక శాస్త్రీయత ఉంది. నాథముని సంకలనం చేసిన నాలాయిర దివ్యప్రబంధంలో శ్రీవారికి నివేదించే పుష్పాలగురించిన వివరాలు ఉన్నాయి. పల్లవరాజులు పుష్పప్రియులు. వారి పరిపాలనాకాలంలోనే తిరుమలలో పుష్పవైభవాన్ని ప్రారంభించి ఉంటారని చరిత్రకారుల అభిప్రాయం.

అక్టోబరు 28న శ్రీవారి పుష్పయాగం సందర్భంగా..

శ్రీనివాసునికి అలంకరించే హారాలను శిఖామణి, కంఠ సరి, సాలగ్రామమాల, వక్షఃస్థల లక్ష్మి, శంఖ – చక్ర, కఠారి సరం, తావళం అని వ్యవహరిస్తారు. సరం అంటే మాల. శిఖామణిహారంలో ప్రధానంగా గులాబి, బొందుమల్లె, చేమంతి పువ్వులు ఉంటాయి. ఈ హారాన్ని స్వామివారి కిరీటం నుంచి భుజాలపై దాకా అలంకరిస్తారు. ఈ మాల పన్నెండు అడుగుల దీర్ఘమైంది. కంఠసరిని కుడి ఎడమల భుజాలపై అలంకరిస్తారు. సాలగ్రామమాలను కూడా అత్యంత పరిమళభరిత పుష్పాలతో అల్లుతారు. ఈ హారాన్ని కంఠం నుంచి కటిప్రదేశం వరకు మనోజ్ఞంగా ధరింపజేస్తారు. వక్షఃస్థల లక్ష్మీహారం ఆ మూర్తి మధ్య స్థలంలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవీలపై వాలేట్టుగా సజ్జీకరిస్తారు. శ్రీవారి చిహ్నామైన శంఖుచక్రాలను శంఖచక్రమాలతో సౌందర్యీకరిస్తారు. కఠారి సరాన్ని నడుము చుట్టూ అలంకరిస్తూ అందులో శ్రీవారి నందకం ఇమిడేలా చూస్తారు. తావళం అనే పేరుతో అల్లిన మూడు మాలలను శ్రీవారి కంఠం నుంచి చరణాలదాకా విభూషిస్తారు. ఈ మాలధారణతో దర్శనమిచ్చే శ్రీనివాసుడు భక్తుల హృదయాల్లో కలిగించే అనుభూతిని ఆస్వాదించాలే కాని వివరించడం అసాధ్యం. ఆ రూపాన్ని ఎంత చూసినా తనివితీరదు. అందుకే అన్నమయ్య **'హరి నీవే సర్వాత్మకుడవు'** అనే కీర్తనలో **"చూడక మానవు చూచెడి కన్నులు-ఏడనేనైనా ఇతరములు-నీడల నింతా నీరూపము అని – యీడువడని తెలివియ్య గదే"** అంటూ ఆర్తితో ఆలపించాడు.

యాగం ఒక విశిష్టమైన సంప్రదాయం. పురాణకాలం నుంచి వివిధరకాలైన యాగాలు జరిగాయి. **'పుష్పయాగం'** మహోన్నతమైన క్రతువు. యజ్ఞయాగాలన్నీ భౌతిక పారమార్థిక కామనలతో చేయడం పరిపాటి. దేవదేవుణ్ణి ఏదీ కోరకుండా ఆ వేల్పుకు కృతజ్ఞతలు తెలుపుకొనేందుకే ఈ యాగం చేస్తారని యజుర్వేదంలోని ఈశావాస్యోపనిషత్తు వివరిస్తోంది. తిరుమలలో బ్రహ్మోత్సవాల తర్వాత నక్షత్రసమూహానికి మకుటాయ మానమైన శ్రవణనక్షత్రంరోజు పుష్పయాగం నిర్వహిస్తారు. శ్రవణం శ్రీవారి జన్మనక్షత్రం. అదేకాక, శ్రీమహావిష్ణువు అగ్రాసనాధిపత్యము వహించే నక్షత్రం ఇది. యాగానికి ముందురోజే అంకురార్పణ చేస్తారు. సంపంగిప్రాకారంలో స్నపనతిరుమంజనం నిర్వహించాక, ఉత్సవమూర్తులను సంపంగిమండపంలోకి ఆగమవిధానంలో ఆహ్వానిస్తారు. అక్కడే పుష్పయాగం నిర్వహిస్తారు. టన్నులకొద్దీ పరిమళభరిత పుష్పాలను ఈయాగంలో మలయప్పస్వామికి సమంత్రంగా సమర్పిస్తారు. ఉభయనాంచారులైన శ్రీదేవిభూదేవీ సమేతంగా మలయప్పస్వామి వేంచేసి ఉంటారు. పుష్పయాగంలోని మంత్రాలు వీక్షకులు, అధ్వర్యుడు, ఉద్గాతకు అలౌకిక అనుభూతులను కలిగిస్తాయి. ఈ యాగంలో శ్రీవారికి పద్దెనిమిది రకాల పువ్వులను సమర్పిస్తారు. చేమంతి, లిల్లీ, గులాబీ,



నందివర్ధనం, తులసి, మరువం, దవనం తప్పకుండా ఉంటాయి. పుష్పాలను మలయప్పస్వామి, హృదయాలను స్పృశించి చరణాలపైబడి, వక్షఃస్థలం దాకా రాశిగా చేరుతాయి. వెంటనే వాటిని తొలగించి తిరిగి పుష్పనివేదన చేస్తారు. ఇలా ఇరవైమార్లు నివేదన కొనసాగుతుంది. ఆ తరవాత మంగళహారతితో పుష్ప యాగం పరిసమాప్తమవుతుంది.

జైమినీయ సూత్రం ప్రకారం పరాత్పరుణ్ణి ప్రసన్నం చేసుకునేందుకే యాగం చేస్తారని తెలుస్తోంది. పుష్పయాగం వల్ల భూమండలానికంతకూ పవిత్రత చేకూరుతుంది. పుష్పసౌరభాలు, పరిసరాలను ఎంతగా మంజరింపజేస్తాయో, యాగఫలితాలు అంతగా మానవులకు మేలు చేస్తాయి. ఆరోగ్యం, ఆనందం, సంపదలు యాగ ఫలితాలని శుక్లయజుర్వేదం చెబుతోంది. **'విన్నపాలు వినవలె వింత వింతలు'** అంటూ అన్నమయ్య శ్రీవారిని నిద్రలేపుతాడు. ఆ దేవదేవునికి ఎన్నో విన్నవించి, ఏవేవో వింత వింత కోరికలు కోరుతుంటాము. అలా మన కష్టాలుసుఖాలు వింటూ, దుఃఖవిముక్తి చేస్తూ అలసి సొలసిపోతాడేమో ఆ వేంకటాచలపతి. ఆ పెరుమాళ్ళ మానసానికి హాయిని కలిగిస్తూ పరిమళాలు వెదజల్లే పుష్పాలతో యాగం చేయడం భక్తులమైన మనకు ఆనందదాయకమే కదా!

సేనై ముదలియార్

– శ్రీమతి ఈ.విజయలక్ష్మి

పరమపదమనే విష్ణులోకంలో వేంచేసి ఉండే భగవంతుడైన శ్రీమన్నారాయణుని అనంతగరుడ విష్వక్సేనాది నిత్యులు, ఈ లోకంనుండి సంసార సంబంధం తీరగా అక్కడకు చేరిన ముక్తులు సదా సేవిస్తూ, ఆనందిస్తూ ఉంటారని *'తద్విప్రాసోవిపన్యవోజాగృవాంసః సమింధతే'* ఇత్యాది వైదిక సూక్తులు తెల్పుతున్నాయి. ఆ విధంగా సదా భగవత్సేవను చేసుకొనే గొప్ప అదృష్టాన్ని పొందిన వారిలో విష్వక్సేనుడు ముఖ్యుడు. 'విష్వక్సేనుడంటే' – అంతటా సేనలు కల్గినవాడని అర్థం. విష్వక్సేనుని అధీనంలో ఉండే భగవత్పరివారం, అతని నాయకత్వంలో, అతడు చేసే సూచనలను అనుసరించి స్వామి కైంకర్యం చేస్తారు. అందువల్ల వైష్ణవ సంప్రదాయంలో విష్వక్సేనునకు **'సేనైముదలియార్'** అని పేరు. 'ముదలియార్' అంటే – నాయకుడు.

ఇతడు, పరమపదంలో భగవంతునకు ఈశాన్యదిశలో వేంచేసి ఉంటాడు. చతుర్భుజుడు, శంఖచక్రధరుడు, నీలమేఘం వంటి వర్ణాన్ని కలవాడు – అనే విషయం భగవద్రామానుజుల నిత్యగ్రంథంలోని *"ఓమ్ నమో భగవతే విష్వక్సేనాయేతి భగవతః ప్రాగుత్తర పార్శ్వే దక్షిణాభిముఖం భగవంతం విష్వక్సేనమాసీనం చతుర్భుజం శంఖచక్రధరం... నీలమేఘనిభమ్"* అనే సూక్తి ద్వారా తెలుస్తున్నది. భగవన్నివేదిత ప్రసాదాన్నే నియతంగా స్వీకరించే స్వభావం కలవాడు కనుక ఇతడు 'శేషాశను'డనే విలక్షణనామంతో నిర్దేశింపబడుతున్నాడు. ఈ విష్వక్సేనుని వైభవాన్ని గూర్చి భగవద్యామునులు స్తోత్రరత్నంలో *'త్వదీయ భుక్తోజ్ఝిత శేషభోజినా, త్వయా నిసృష్టాత్మభరేణ యద్యథా, ప్రియేణ సేనాపతినా నివేదితం తథానుజానం తముదారవీక్షణైః'* (నీవు భుజించగా విడచిన ప్రసాదాన్ని స్వీకరించే స్వభావాన్ని కలవాడు, నీవు అప్పగించిన జగద్రక్షణభారాన్ని నిర్వహించేవాడు, నీకు ప్రియుడైన సేనాపతి ఏయే విషయాన్ని ఏయే విధంగా నివేదిస్తాడో, దానిని ఆయా విధంగానే విప్పారిన నేత్రాలతో ఆనందంగా నీవు అమోదిస్తావు) అనే శ్లోకంతో స్తుతించారు. దీని వల్ల, భగవంతునకు ఆనందం, అంగీకారం అయ్యే రీతిలో జగద్రక్షణభారాన్ని నిర్వహించగల పరిపాలనాసమర్థుడతడని తెలుపబడుతున్నది.

అక్టోబరు 26న సేనై ముదలియార్ వర్షతిరునక్షత్ర సందర్భంగా...

విష్వక్సేనుడు భగవత్సేవలో సమర్థుడైనట్లే, అతని ప్రియపత్ని అయిన 'సూత్రవతి' కూడా లక్ష్మీదేవిని సేవించడంలో సమర్థురాలు. ఈమె చేసే సేవను గూర్చి శ్రీపరాశర భట్టర్ శ్రీరంగరాజస్తవములో–*"సైన్యధురీణ ప్రాణసహాయామ్, సూత్రవతీ మాశ్రియమంబామ్, శ్రీపదలాక్షాలాంఛిత సేవా ప్రోతల సద్ధోర్వల్లి విలాసామ్"* (సూత్రవతీదేవి లక్ష్మీదేవి పాదాల సంవాహనం (పాదాలను ఒత్తడం) చేస్తుంది. అపుడు లక్ష్మీదేవి పాదాలకు అలంకారంగా పూసికొన్న పారాణి సూత్రవతి ధరించిన ఉత్తరీయం పై అంటుకొంటున్నది. ఈ పారాణిగుర్తులు సూత్రవతి చేసే సేవకు గుర్తులు. ఈమె తన భర్త అయిన విష్వక్సేనునకు ప్రాణసమానురాలు. అన్ని కైంకర్యాలలో చేదోడు వాదోడుగా ఉంటుంది అని ప్రస్తుతించారు. వైదిక క్రియాకలాపాలలో విష్వక్సేనుని ఆవాహన చేసేటపుడు సూత్రవతీ సమేతునిగా ఆవాహన చేసి, అర్చిస్తారు.



ఇంటికి అతిథిగా వచ్చినచో శత్రువుకైననూ ఆతిథ్యమివ్వాలి

విష్వక్సేనునకు అమితమైన పరివారం ఉన్నా, వారిలో కరిముఖుడు, జయత్సేనుడు, హరివక్త్రుడు, కాలప్రకృతి- అనే నల్గురు ప్రధానులు. అందువల్లనే శ్రీరామానుజులు 'నిత్యగ్రంథ' మనే భగవదారాధన ప్రక్రియను తెలిపే గ్రంథంలో విష్వక్సేనుని ఆవాహన చేసిన తర్వాత, ప్రధానంగా ఈ నల్గురిని ఆవాహన చేయాలని తెలిపారు.

శ్రీవైష్ణవాలయాలలో బ్రహ్మోత్సవాది విశేషకార్యక్రమాలు నిర్వహింపబడేటపుడు, ఈ కార్యాలు నిర్విఘ్న పరిసమాప్తికోసం విష్వక్సేనుని ఆరాధించడం పరిపాటి, ఆ సమయంలో విష్వక్సేనుని ఆవాహనం చేయడంకోసం, ఆహ్వానించడం కోసం **"శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్, ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోప శాంతయే"** అనే ప్రార్థనాశ్లోకం పఠింపబడుతున్నది.

భగవదారాధన సమయంలో ప్రదర్శించే పలుదేవతలకు సంబంధించిన ముద్రలలో విష్వక్సేన ముద్రకూడా ఒకటి. దీనిని లక్ష్మీ తంత్రమనే పాంచరాత్రాగమ సంహిత – ***'అంగులీ త్రితయేనైవ ముష్టింబద్ధ్వాతు పూర్వవత్, తర్జనీం ద్విగుణీకృత్య త్వంగుష్ఠాగ్రేనియో జయేత్, ప్రోద్యతో దక్షిణో బాహుశ్చక్రక్షేపే యథో ద్యతః, విష్వక్సేనస్యముద్రేయం విశ్వబంధన కృంతనీ'*** (మూడు వేళ్ళతో పిడికిలి బిగించి, చూపుడు వేలును ముడిచి, బొటన వేలుతో కలపాలి. చక్రాన్ని విసరే సమయంలో వలె కుడిచేతిని ఎత్తాలి. ఇది విష్వక్సేనముద్ర. ఇది సకలబంధాలను తీరుస్తుంది) అని లక్ష్మీ తంత్రం తెల్పింది.

ఆళ్వార్లుగా కీర్తింపబడే భక్తశిఖామణులలో ప్రధానులైన నమ్మాళ్వార్లు విష్వక్సేనుని అంశతో ఆవిర్భవించారని సంప్రదాయిక విశ్వాసం. అందువల్లనే **'వృషభే తు విశాఖాయాం కురుకాపురి వాసినమ్, పాండ్యదేశే కలే రాదౌ శఠారిం సైన్యపం భజే'** అనే ప్రార్థనా శ్లోకంలో విష్వక్సేన రూపునిగా నమ్మాళ్వార్లు స్తుతింపబడుతున్నారు. ఇంతేకాక, నమ్మాళ్వార్లకు పంచ సంస్కారాలను చేసి, మంత్రోపదేశాన్ని చేసినవాడు విష్వక్సేనుడేనని సంప్రదాయం.

అందువల్లనే శ్రీవైష్ణవ గురుపరంలో "శ్రీమతే శఠకోపాయనమః" అనే నమ్మాళ్వార్ల నామం తర్వాత, "శ్రీమతే విష్వక్సేనాయ నమః" అని విష్వక్సేనుల నామం అనుసంధింపబడుతున్నది.

శ్రీ చక్రత్తాళ్వారులు

(సుదర్శన వైభవము)


– డా॥ ఎమ్.టి.ఆళ్వార్

శ్రీమహావిష్ణుభక్తిని శరణాగతితత్త్వాన్ని, శ్రీమహావిష్ణువు యొక్క పారమ్యాన్ని వేదనిగూఢార్థములతో లోకానికి ఉపదేశించినవారు 'ఆళ్వారులు'. ఆళ్వార్ అంటేనే శ్రీహరి భక్తి ప్రవాహములో మునిగినవారని అర్థం. ఆళ్వారులు పన్నిద్దరు అని అందరికీ తెలిసినదే. కాని మహావిష్ణువునకు అత్యంత ప్రీతిపాత్రులై, సకలవిధ కైంకర్యాలను క్షణంకూడా విడువకుండా చేసే పరమభాగవతోత్తములు స్థావరజంగమాలలో ఉండడము చేత అలాంటివారిని కూడా ఆళ్వారులు అని కీర్తిస్తారు.

ముఖ్యంగా అలాంటివారిలో 1)అనన్తాళ్వారులు (శేషులవారు) 2)గరుడాళ్వారులు 3)విష్వక్సేనాళ్వారులు శ్రీవైకుంఠంలో శ్రీవారిసేవలు చేస్తూంటారు. భూలోకంలో పరమభాగవతులను పిలిచే 'ఆళ్వారు' అనే గొప్పపదాన్ని వైకుంఠంలోని పరివార నిత్యసూరులకు ఉపయోగించడం ఎంత ఆశ్చర్యం! ఆ కోవవారే శ్రీచక్రత్తాళ్వారులు, వీరి దివ్యనామము 'శ్రీసుదర్శనము' ఆయుధాగ్రేసరము కూడా. శ్రీవారునెలవైయున్న కోవెలను **'కోయిల్ ఆళ్వార్'** అని కూడా అంటారు. శ్రీరామాయణంలో కూడా ఇంతటి మహనీయులను భరతాళ్వాన్, శత్రుఘ్నాళ్వాన్, ఇళైయాళ్వార్ (లక్ష్మణపెరుమాళ్) విభీషణాళ్వారులు, శ్రీమద్భాగవతంలోని ప్రహ్లాదాళ్వారులు గజేంద్రాళ్వారులు అని, విలక్షణంగా 'ఆళ్వార్, ఆళ్వాన్' శబ్దాలతో శ్రీవైష్ణవసంప్రదాయములో వ్యవహరించడం ఎంతో గాంభీర్యమైన విషయాలతో నిండి ఉన్నాయి.

భగవానుని జన్మకర్మలు దివ్యమైనవి, మనవలే కర్మప్రారబ్దపరమైనవికావు. స్వామి ఎన్ని అవతారములు దాల్చినా ఏ పరిస్థితులలోనున్న తన అసాధారణ, దివ్యచిహ్నములైన 'శంఖచక్రములను' విడిచిపెట్టడు. శ్రీమన్నారాయణ తత్త్వమున శ్రియఃపతిత్వము, శంఖచక్రలాంఛనములు తప్పనిసరిగా ఉండును. అసాధారణ సర్వమంగళప్రదమైన అర్చామూర్తులలో శుభాశ్రయుడై శంఖచక్ర లాంఛనములను ధరించి ఉండడం విడ్డూరము కాదు. శ్రీవారి చక్రమునే శ్రీసుదర్శనాళ్వారులు లేదా చక్రత్తాళ్వారులుగా కీర్తిస్తారు.

అక్టోబరు 01న శ్రీవారి బ్రహ్మోత్సవసమాప్తిన
శ్రీసుదర్శన చక్రస్నాన సందర్భంగా...



అందుకే నారాయణుని 'చక్రి–చక్రపాణిః, చక్రధారీ, శ్రీసుదర్శనాయుధ అని' సంబోధిస్తుంటారు. శ్రీమన్నారాయణుడే సుదర్శనరూపుడు. అనగా తనకు తానే సుదర్శనచక్రముగా పరిణమించినవాడని పెద్దలు చెప్పుదురు. సమస్త ఆయుధము లన్నిటికీ ఈ సుదర్శనచక్రమే ప్రతినిధి. అహిర్బుధ్న్యసంహిత లలో *"సోమసూర్య, దహన, ప్రభోజ్జ్వలం చక్రమేతదుదితమ్."* చంద్ర–సూర్య–అగ్ని కృత్యములు ఈ సుదర్శనుని ప్రభావములు అని కొనియాడబడినది. శ్రీ విష్ణుపురాణములో అస్త్రభూషణా ధ్యాయములో సుదర్శనము మనస్తత్త్వమునకు ప్రతీకగా పేర్కొన బడినది. శ్రీమన్నారాయణుని దుష్టశిక్షణ–శిష్టరక్షణ–ధర్మసం స్థాపన కృత్యములు శ్రీసుదర్శనుడే చేయుచున్నాడని, కాల స్వరూపుడని స్వామివారికి ఆయుధమేకాదు ఆభరణము కూడా ఈ సుదర్శనుడే అని చెప్పబడినది.

వేదములలో

ఓమ్ సుదర్శనాయ విద్మహే।
హేతి రాజాయ ధీమహి।
తన్నోశ్చక్రః ప్రచోదయాత్।

అని శ్రీసుదర్శనగాయత్రి ప్రసిద్ధముగా నున్నది.

'శ్రీసుదర్శనపాంచజన్యాభ్యాం నమః' అని శ్రీవారి తిరువారాధన ఆగమాలలో చాలా పర్యాయములు చెప్పబడు చుండుట గమనించవచ్చును. ఈ సృష్టి అంతా చక్రమయములే. అండములు, అండాంతరములు, గోళములు అన్ని గిరగిర తిరుగుట చక్ర ప్రభావమే. శ్రీమద్రామాయణమున విశ్వామిత్ర మహర్షి శ్రీరామలక్ష్మణులకు అస్త్రశస్త్రముల నిచ్చుచూ–

పరితుష్టోఽస్మి భద్రం తే రాజపుత్ర మహాయశః।
ప్రీత్యా పరమయా-యుక్తో-దదామ్యస్త్రాణి సర్వశః॥

శ్రీరామభద్రా! రాజకుమారా! నీవు కీర్తిమంతుడవు. నీమీద మిక్కిలిప్రీతితో నేను ఈ క్రింది అస్త్రములను ఇచ్చు చున్నాను, స్వీకరించుము అని పలుకుతూ –

దండచక్రం-మహద్దివ్యం-తవ దాస్యామి రాఘవ
ధర్మచక్రం తతోవీర-కాలచక్రం-తథైవ చ
విష్ణుచక్రం తథాత్యుగ్రం-ఐంద్రమస్త్రం తథైవ చ
(బాల-27 అ, 4, 5, శ్లో)

అని అనేక దివ్యాస్త్రాలు చక్రపరంగా ఉపదేశించడం గమనార్హము. శ్రీమన్నారాయణుని దివ్యాయుధాలలో శ్రీసుదర్శన చక్రము మహాప్రభావము గలిగినదని సమస్త వైదిక లౌకిక వాఙ్మయము ఉద్ఘోషించుచున్నది. సమస్త శ్రీవైష్ణవ దివ్యక్షేత్రాలలో జరుగు బ్రహ్మోత్సవాల నిర్వహణలో శ్రీసుదర్శనభగవానునిదే పై చేయి, ఉత్సవములు పూర్తి అయిన వెంటనే శ్రీసుదర్శన చక్రముతో 'తీర్థవారి' ఉత్సవము జరిగి 'చక్రస్నానము' నిర్వహిం చుట పరిపాటి. శ్రీహరి గర్భాలయములపై ధ్వజస్తంభములపై శ్రీసుదర్శన లాంఛనములు, చిహ్నములు కనబడుచున్నవి.

శ్రీసుదర్శనుల విశ్వరూపము 1)జ్వాలా 2)నేమి 3)అర 4)నాభి 5)అక్ష 6)పురుష రూపముగాఉండి కన్నులు మిఱు మిట్లుగొల్పును. శ్రీలక్ష్మీనారాయణులు ఈ చేతనాచేతన రక్షణ భారాన్ని తన ప్రియమైన ఆయుధము శ్రీసుదర్శన ఆళ్వారులపై ఉంచి ఆనందముగా కాలం గడుపుతుంటారు. ఆ సుదర్శనుడే ఈ సమస్త చరాచరలోకాలను శ్రీహరి ఆజ్ఞమేర నడుపుతుండడం ఎంతమహిమను తెలుపుతుందో మనం గమనించగలము.

శ్రీసుదర్శన భగవానుని దివ్యరూపం వర్ణించే శ్రీసుద ర్శన శతకంలోని 80వ పద్యాన్ని ఒక్కసారి స్మరించుకుందాం!

శ్లో॥ చక్రం కుంతం కృపాణుం-పరశు-హుతావహో వంకుశం దండశక్తీ
శంఖం!కోదండపాశౌ హల, ముసల, గదా, వజ్ర శూలాంశ్చహేతీన్।
దోర్భిః సవ్యాపసవ్యైః దధదతుల బలస్తంభితా రాతిదర్పైః
వ్యూహాస్తేజోభిమానీ నరక విజయినో జృంభతాం సంపదేవః ॥





ఇటీవల తిరుమల
శ్రీవారిఆలయంలో జరిగిన
పవిత్రోత్సవ దృశ్యాలు













ఇటీవల తిరుచానూరు
శ్రీపద్మావతీఅమ్మవారి ఆలయంలో జరిగిన
పవిత్రోత్సవ దృశ్యాలు













ఇటీవల తిరుపతి
శ్రీగోవిందరాజస్వామివారి ఆలయంలో జరిగిన
పవిత్రోత్సవ దృశ్యాలు











01-09-2017న తిరుపతికి విచ్చేసిన
భారతరాష్ట్రపతి గౌ॥శ్రీ రామ్‌నాథ్ కోవింద్ దంపతులను ఆహ్వానిస్తున్న
ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర ముఖ్యమంత్రి గౌ॥ శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు



భారతరాష్ట్రపతి గౌ॥ శ్రీ రామ్‌నాథ్ కోవింద్ గారిని
ఆహ్వానిస్తున్న తి.తి.దే. సంయుక్తకార్యనిర్వహణాధికారి
శ్రీ పోల భాస్కర్, ఐ.ఏ.ఎస్., (తిరుపతి)



తిరుమల తిరుపతి దేవస్థానం తరపున
కాణిపాకం, శ్రీవరసిద్ధివినాయకస్వామి వారికి
బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టువస్త్రాలను సమర్పిస్తున్న
కార్యనిర్వహణాధికారి శ్రీఅనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,

కేదార గౌరీవ్రతం

- శ్రీమతి రాజీ రఘునాథన్

కేదారగౌరీవ్రతం శివుని ఆరాధించి పూజించే వ్రతాలలో ప్రథమమైనది. ప్రతి ఏటా ఈ నోము ఆశ్వయుజమాసం శుక్లపక్ష అష్టమినాడు ఆరంభింపబడుతుంది. ఈ వ్రతాన్ని సాధారణంగా ఆడవారు అనుష్ఠిస్తారు. కన్యలు మంచి భర్త లభించాలనే కోరికతో, ముత్తైదువలు దీర్ఘసౌభాగ్యంకొరకు ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. ఆశ్వయుజమాసం అమావాస్య వరకు 21 రోజులు ఈ వ్రతాన్ని జరుపుకునే పద్ధతి ఉన్నది. ఈ వ్రతాన్ని అనుష్ఠించేవారు శివపార్వతుల అనుగ్రహంతో సకలసౌభాగ్యాలను, దీర్ఘ సుమంగళి భాగ్యాన్ని పొంది, శివసాయుజ్యాన్ని చేరుతారని పురాణాలు వివరిస్తున్నాయి. మంచి సుఖమయ జీవితం కొరకు పురుషులు కూడా ఈ వ్రతాన్ని ఆచరిస్తారు.

భక్తులు ఏకాగ్రచిత్తముతో పవిత్రులై ఈ వ్రతాన్ని అనుష్ఠించటంవలన వారి కోరికలను అమ్మవారి కోరికమేరకు పరమశివుడు అతిత్వరగా అనుగ్రహిస్తాడు అన్నది భక్తుల అనుభవం. అందులోనూ సర్వలోకమాత, జగజ్జనని పార్వతీదేవి స్వయముగా ఈ వ్రతాన్ని అనుష్ఠించి పరమశివుని 'ఎడమ భాగాన్ని పొందింది' అన్నది ఈ వ్రతానికి ఉన్న ప్రత్యేకత.

మహిళలు, పురుషులు అన్న బేధంగానీ, వయసుతో ప్రమేయంగానీ లేకుండా జీవితంలో ఏ స్థితిలో ఉన్నవారైనా ఈ వ్రతాన్ని ఆచరించి కోరిన వరాలను పొంది ఇహ, పరసుఖాలను అనుభవించి ఆనందించడానికి ఈ వ్రతం ఒకమంచి ఉపాయం.

వ్రతచరిత్ర

కైలాసంలో నిండుసభలో శివుడు పార్వతీసమేతుడై కొలువై ఉన్నాడు. సిద్ధ, కింపురుష, యక్ష, గంధర్వులు శివుని సేవిస్తున్నారు. దేవతలు, మునులు, ప్రమథగణములు శివుని స్తుతించుచున్నారు. అప్పుడు ప్రమథగణములలో ఒకడైన భృంగి ఆనందపులకితుడై నాట్యం చేశాడు. అతడు వినోదపూరితమైన నాట్యగతులతో సభలోని వారినీ, శివుణ్ణి మెప్పించాడు. పరమశివుడు భృంగుని అభినందించాడు. సంతోషించి ఆ ప్రమథగణుడు అమ్మవారిని విడిచి శివునికి నమస్కరించాడు. బ్రహ్మ, విష్ణువు, దేవేంద్రుడితో సహా ముక్కోటి దేవతలు, మునులు అందరూ పార్వతీపరమేశ్వరులకు ఇరువురినీ ముమ్మార్లు ప్రదక్షిణంచేసి నమస్కరించి తమ తమ ప్రదేశాలకు వెళ్లారు. కానీ భృంగిమాత్రం ఒక కీటకం రూపం ధరించి శివునికి మాత్రం భక్తితో మూడుసార్లు ప్రదక్షిణం చేశాడు.

భృంగి యొక్క ఆ చర్యను చూసి కోపగించిన పార్వతీదేవి, పరమేశ్వరునితో కారణం అడగ్గా శివుడు చిరునవ్వుతో, ఇలా పలికాడు - "దేవీ! ప్రాపంచిక వాంఛలులేని యోగులు, మోక్షాన్ని కోరి నన్ను కొలుస్తారు. నీవు ప్రపంచ సుఖాలను ఇచ్చే ప్రకృతివి. నేను మోక్షాన్ని ఇచ్చే మహాయోగి. ఇందులో ఆశ్చర్యం ఏమిలేదు."

శివుని మాటలు విని ఇంకా ఆగ్రహం చెందిన లోకమాత 'నా శక్తి లేనిదే మీ భక్తుడైన ఈ భృంగి మోక్షాన్ని కూడా పొందలేడు' అని చెప్పి భృంగిని శక్తిహీనుడ్ని చేసింది. భృంగి నిలబడలేక కిందపడబోతుంటే 'నా భక్తుడ్ని కాపాడుట నా ధర్మం' అని చెప్పి శివుడు, భృంగి చేతికి ఒక దండాన్ని (కర్ర) అందచేశాడు. వెంటనే భృంగి లోకనాయకునికి నమస్కరించి తన నివాసం చేరుకున్నాడు.

అదంతా చూసిన పార్వతీదేవి, ఇంకా పట్టరాని ఆవేశం చెందింది. భృంగితోపాటు తనభర్త కూడా తనను అవమానించినట్లు తలచి, కైలాసాన్ని వదిలి భూలోకాన్ని చేరి ఓ వృక్షం కింద కూర్చుంది. ఆదిశక్తి యొక్క దివ్యపాదములు సోకి ఆ వనమంతా సస్యశ్యామలంగా పుష్పాలతో నిండింది.

మహాతపస్వి గౌతముడు దేవీరాకను గ్రహించి ఆమెను ఆహ్వానించి అతిథి మర్యాదలు సమర్పించి పూజలు జరిపి, "తల్లీ! నీవు ఇక్కడికి విచ్చేసిన కారణం ఏమి?"అని ప్రశ్నించాడు.

అందులకు దేవి "భృంగి చేసిన అలక్ష్యం వలన కోపంతో నా ప్రియనాథుణ్ణి వదిలి చాలా దూరం వచ్చేశాను. నేను శివుని సతిగా, నా నాథుడితో సమానమైన యోగ్యతను పొందగోరి తపస్సు ఆచరించుటకు సంకల్పించాను. నేను ఆశించిన ఫలమును పొంది శివుని అర్ధాంగినై తరించుటకు తగిన వ్రతమును నాకు ఉపదేశించండి, మహామునీ!" అని కోరింది.

19-10-2017వ తేది
కేదారగౌరీవ్రతం సందర్భంగా....

అందుకు గౌతముడు కేదారేశ్వరవ్రతమును ఆచరించి మనోభీష్టసిద్ధిని పొందవలసినదని సూచించాడు. వ్రత విధానాన్ని వివరించమని పార్వతీదేవి కోరగా, గౌతముడు వివరించాడు. ఆ విధంగా పార్వతీదేవి 21 రోజులు నిష్ఠతో శివుని కేదారేశ్వరుడిగా పూజించి శివుని శరీరంలో సగభాగాన్ని పొంది 'అర్ధనారీశ్వరుడు' అని శివుని లోకం కీర్తించే విధంగా శివుని ఎడమ భాగంలో ఉండి భక్తులను అనుగ్రహిస్తోంది. ఆ రోజు పార్వతీదేవి శివుని చూసి అనుగ్రహిస్తుంది. ఆరోజు పార్వతీదేవి శివుని చూసి "నాథా! ఈ వ్రతాన్ని లోకంలో ఎవరు ఆచరించినా వారి కోరికలను తీర్చవలసినది" అని ప్రార్థించింది. శివుడు ఆమె కోరికలను అంగీకరించి భక్తులను అనుగ్రహిస్తున్నాడు.

వ్రతవిధానం

ప్రతిసంవత్సరం ఆశ్వయుజమాసం శుద్ధ అష్టమిరోజు ఈ వ్రతాన్ని ప్రారంభించి దీపావళి అమావాస్యవరకు పూజాక్రమముతో 21 రోజులు కేదారేశ్వరుణ్ణి పార్వతీసమేతంగా ఆరాధించాలి. 21 పోగులతో తెల్లని పట్టుగాని, నూలుపోగుగానీ తోరముగా తయారుచేసి అందులో 21 ముడులువేసి సిద్ధం చేసుకోవాలి.

ప్రతినిత్యం నిద్రలేచి పరిశుద్ధమై, పవిత్రముగా ఈ పూజను జరపాలి. శుభ్రమైన స్థలమున ధాన్యరాశి పోసి, దానిమీద ఒక పూర్ణకుంభం పెట్టుకుని 21 నూలుపోగులు చుట్టి దానిమీద తెల్లనిబట్టగాని, మరో వస్త్రంగాని చుట్టి, బంగారంగాని, వెండిగాని పెట్టి గంధం, అక్షింతలు ఆ



కలశంలో ఉంచి, అందులో కేదారేశ్వరుని ఆవాహనంచేసి పూజించి, ఆ తరువాత 21 మంది బ్రాహ్మణులను పిలిచి కాళ్లు కడిగి పీఠంమీద కూర్చోబెట్టి, పురోహితులను ముందుగా పూజించి, పిమ్మట 21మంది బ్రాహ్మణులను పూజించవలెను. కానీ ప్రస్తుతం ఈ కాలంలో 21 మంది బ్రాహ్మణులను పిలిచి పూజించే పద్ధతి కనిపించటం లేదు. ఇప్పుడు యథాశక్తి సమయానుకూలంగా ఈ నోమును జరుపుకోవటం కనిపిస్తుంది. ఈ 21 రోజులు కలశంలో ధాన్యం రాశిగాని, బియ్యంగాని పోసిపెట్టి గంధం పుష్పాలతో పూజించి కలశాన్ని తీయకుండా ఉంచి, 21 రోజులు పూజలు జరిపిన తర్వాత ఆఖరున దాన్ని ఓ బ్రాహ్మణునికి భోజనం పెట్టుకుని ఇస్తున్నారు.

ఈ విధంగా ప్రతిరోజు కేదారేశ్వరునికి పూజ చేసుకొని పగలంతా ఉపవాసం ఉండి, రాత్రిభోజనం చేసి, ఆఖరిరోజున పూజచేసిన తర్వాత, జంధ్యంపోగు, ఒకపంచెల చాపు బ్రాహ్మణుడికి ఇస్తారు. దీపావళి అమావాస్యనాడు ప్రస్తుతం భోజనానికి ఏ బ్రాహ్మణుడూ రావట్లేదు కనుక, మరునాడు కార్తిక సోమవారం ఉంటే, ఆ సోమవారంనాడు బ్రాహ్మణుణ్ణి ఆహ్వానించి, అప్పుడు భోజనం పెట్టి దక్షిణ తాంబూలాలను ఇచ్చేస్తున్నారు. అందువల్ల కార్తికసోమవారం వచ్చేదాకా కేదారేశ్వరపూజను ఆపకుండా కొనసాగించి ఆ రోజు తాంబూలాలను బ్రాహ్మణులకు ఇస్తున్నారు. కొందరు దీపావళి అమావాస్యనాడు ఒకరోజు మాత్రమే ఈ వ్రతాన్ని ఆచరించడం జరుగుతుంది. ఇంకా కొందరు కార్తిక సోమవారం ఒకరోజే కేదారేశ్వరవ్రతం చేసి ఆ రోజు బ్రాహ్మణునికి భోజనం పెట్టి బట్టలు దక్షిణ తాంబూలాలు సమర్పించి ఆశీర్వాదములను పొంది వ్రతాన్ని పూర్తిచేసుకోవటం కనబడుతుంది.

మరొక పద్ధతిలో, శివుని మట్టితో చేసిన లింగములోగాని, ధాన్యరాశిని పోసి అందులో పూర్ణకుంభమును ఉంచిగాని, బిల్వం మరియు పుష్పాక్షతలతో పూజించాలి. ప్రతిరోజు కేదారేశ్వరునికి 21 రకాల భక్ష్య, భోజ్యనైవేద్యాలను సమర్పించి, యథావిధిగా ధూప, దీప, గంధాదులతో షోడశోపచారపూజలు జరిపి ప్రార్థించాలి. ఈ విధానాన్ని 21 రోజులు పూజించి, 21 ముడులతో కూడిన తోరమును 21వ రోజైన దీపావళీ

తిరుమల శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామికి జరిగే వార్షిక ఉత్సవాల్లో 'దీపావళి ఆస్థానం' ఒకటి. ఆశ్వయుజమాసం అమావాస్య దీపావళినాటి ఉదయం యథాప్రకారం శ్రీవారి ఆలయంలో సుప్రభాతం మొదలుకొని మొదటి నైవేద్యం వరకు జరుపుతారు.

బ్రహ్మోత్సవ సమయంలో శ్రీమలయప్ప స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా రంగనాయక మండపంలో వేంచేసి ఉంటారు. శ్రీమలయప్ప స్వామివారిని దీపావళినాడు బంగారువాకిలి ముందు, ఏర్పాటు చేసి ఉన్న సర్వభూపాలవాహనంలో వేంచేపు చేస్తారు. శ్రీగరుడాళ్వారుకు అభిముఖంగా ఉన్న శ్రీమలయప్పస్వామికి ప్రక్కనే దక్షిణముఖంగా మరొక పీఠం పైన శ్రీవారి సేనాధిపతి అయిన విష్వక్సేనులవారిని కూడ వేంచేపు చేస్తారు.

ఆ తర్వాత రెండవ నివేదన ప్రారంభమవుతుంది. గర్భాలయం లోపల మూలమూర్తికి, బంగారువాకిలి ముందు ఉన్న శ్రీమలయప్పస్వామికి రెండవ అర్చన చేస్తారు. తర్వాత శ్రీవారి వంటశాలనుంచి ఛత్రచామర మంగళవాద్య పురస్సరంగా పిండి వంటలను, ఊరేగింపుగా బంగారు విమాన ప్రదక్షిణంగా తీసుకొనివస్తారు. గర్భాలయంలో శ్రీవారికి, బంగారువాకిలి ముందు శ్రీమలయప్పస్వామివారికి నివేదన చేస్తారు. ఆ తర్వాత పెద్దజియ్యంగారు ఆరు పట్టువస్త్రాలను వెండిపళ్ళెంలో తెస్తారు. దేవస్థానం అధికారులు మంగళవాద్య పురస్సరంగా, ఊరేగింపుగా విమానానికి, ధ్వజస్తంభానికి ప్రదక్షిణగా వచ్చి ఆనందనిలయం లోపల సమర్పిస్తారు. వాటిలో నాలుగు వస్త్రాలను అర్చకులు స్వీకరించి శ్రీవారి మూలమూర్తి కిరీటానికి, ఖడ్గానికి ఉత్తరీయంగాను, ఆది తోమాల గాను అలంకరించి అక్షతారోపణం చేస్తారు. మళ్ళీ మిగిలిన రెండువస్త్రాలను జియ్యంగార్లు తీసుకొని బయటకు రాగా, ఒక దానిని మలయప్పస్వామికి, రెండవ దానిని విష్వక్సేనులవారికి అర్చకులు అలంకరిస్తారు.

ఆ తర్వాత శ్రీవారి అర్చకులు శ్రీస్వామివారికి, సేనాధిపతికి అక్షతారోపణ చేస్తారు. పిదప ఘనంగా శ్రీస్వామివారికి ఆనంద కర్పూర నీరాజనాలు సమర్పిస్తారు.పిదప అక్కడ చేరిన స్థానీయులైన మహంతు, తాళ్ళపాక, తరిగొండ వారి హారతులు కూడా ఇస్తారు. పిదప శ్రీవారి ప్రసాదం వినియోగం అవుతుంది. దీపావళి నాడు బంగారువాకిలి ముందు జరిగే ఆస్థానం ఏకాంతంగా జరుగుతుంది. యాత్రికులు దర్శించడానికి వీలుపడదు. దీపావళి ఆస్థానం పూర్తైయిన వెంటనే శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామి భక్తాదులు నిర్వహించే కల్యాణోత్సవాది ఆర్జిత సేవల్లో పాల్గొనడానికి కల్యాణమండపానికి వేంచేస్తారు.

అమావాస్యనాడు పూర్తి ఉపవాసం ఉండి ప్రదోషవేళలో తోరాన్ని ధరించాలి. ఆడవారు ఎడమచేతి భుజానికిగాని మణికట్టుకుగాని కంకణంలా కట్టుకోవాలి. పురుషులు కుడిచేతికి తోరాన్ని కట్టుకోవాలి.

అనుష్ఠించాల్సిన విధానం

ఈ వ్రతాన్ని అమావాస్యముందున్న 9 రోజులు గాని, 7 రోజులు, 3 రోజులు లేదా ఒకరోజు మాత్రం ఆచరించ వచ్చు.

భూలోకంలో ఈ వ్రతం విస్తరించిన విధానం

నందికేశ్వరుడు ఈ వ్రతమహిమను శివభక్తుడైన చిత్రాంగదుడు అనే గంధర్వుడికి వివరించగా, ఆ గంధర్వుడు వ్రతఫలితంగా శివుని అనుగ్రహానికి పాత్రుడయ్యాడు.

దానిని మనుష్యలోకమునకు వెల్లడిచేయగోరి ఉజ్జయినీ నగర రాజు వజ్రదంతునకు కేదారేశ్వరవ్రత విధానాన్ని ఉపదేశించాడు. వజ్రదంతుడు ఈ వ్రతమును ఆచరించి సుఖభోగాలను పొంది శివానుగ్రహంతో సార్వభౌముడయ్యాడు.

ఇంకా, ఉజ్జయిని పట్టణంలోని వైశ్యకుల కుమార్తెలు పుణ్యవతి, భాగ్యవతి ఇరువురు ఈ వ్రతాన్ని ఆచరించి తమ దారిద్ర్యాన్ని పోగొట్టుకుని, శివానుగ్రహంతో ఐశ్వర్యము, సుందర రూపములు పొందారు. వారిరువురినీ రాజకుమారులు వివాహం చేసుకున్నారు.

వ్రతఫలం

దంపతుల క్షేమం, వ్యాధి నివారణం, దారిద్ర్యం తొలగుట, కన్యలకు త్వరలో మంచి భర్త లభించటం, శివుని అనుగ్రహాన్ని పరిపూర్ణంగా పొందుటవంటి ఎన్నో కోరికలతో భక్తులు కేదారేశ్వర వ్రతాన్ని ఆచరిస్తుంటారు. సకలసౌభాగ్యాలను నొసగి, అన్ని విధాలుగాను రక్షణను కలిగించే, ఈ కేదారగౌరీవ్రతం భార్యాభర్తల ఐకమత్యానికి తోడ్పడి, కుటుంబంలో సంతోషాన్నీ, సంతృప్తినీ నింపుతుంది.

ఆధ్యాత్మిక సాధనకొరకు, కుటుంబంవారి ఆయురారోగ్య అభివృద్ధి కొరకు, ఐశ్వర్యం, కుటుంబసభ్యుల అన్యోన్యం కొరకు, మనస్సులోని కష్టాలు తొలగి సంతోషం పెరుగుటకు, సంతానం యొక్క చదువు, ఉద్యోగం కొరకు, సంతానభాగ్యం వంటి అన్ని శుభఫలితాలకొరకు ఈ వ్రతాన్ని అనుష్ఠించుట, ఉత్తమ ఫలితాలను అందచేస్తుంది.

మనము కూడా ఈ వ్రతాన్ని ఆచరించి కుటుంబంలో ఐకమత్యాన్ని, శివపార్వతుల అనుగ్రహంతో ఇహపరసౌఖ్యాలను పొందుదుముగాక!



అక్టోబర్, 23
'తిరుమల నంబి శాత్తుమొఱ'
సందర్భంగా...

శ్రీవేంకటేశ్వర కరుణాపాత్రుడు తిరుమలనంబి

-శ్రీమతి తిగుళ్ల అరుణకుమారి

శ్రీవేంకటేశ్వరుని లీలలు అమోఘాలు. అవి విశ్వక్షేమ దాయకాలు. భక్తజనమనోహరాలు. జీవనతారణకారణాలు, అవ్యాజ కారుణ్యపూరితాలు, ఆశ్రితదుఃఖహారకాలు. అలాంటి లీలలలో 'తిరుమలనంబి' కథ ఒకటి.

కారణజన్ముడైన 'తిరుమలనంబి' అనునిత్యం శ్రీవేంకటేశ్వరారాధకుడు. ప్రతినిత్యం ఉషఃకాలంలోనే నిద్రనుండి మేల్కొని పవిత్రస్నానాన్ని ఆచరించి స్వామివారి కైంకర్యంకోసం సుదూర పాపనాశనతీర్థానికి వెళ్లి మట్టికుండలో పుణ్యతీర్థజలాలను నింపుకొని, అభిషేకసమయానికి స్వామివారి కోవెలకు చేరుకొని, స్వామివారి అభిషేకానికి జలాలను అందించేవాడు. స్వామివారు తిరుమలనంబి దినచర్యను చూస్తున్నారు. భక్తుడు పడుతున్న కష్టాన్ని చూచి భగవంతునికి జాలికలిగింది. తన సేవకోసం ఇంతగా తపిస్తున్న తిరుమలనంబికి చేయూతనందించాలను కొన్నాడు. ప్రతినిత్యం తిరుమలనంబి వెళ్లే కాలిబాటలో ఒక చెట్టుక్రింద వేటాడేవృత్తిలో ఉన్న ఒక బాలునిలా ప్రత్యక్ష మయ్యాడు. చేతిలో ధనుర్బాణాలు, వేటాడి వేటాడి అలసిపోయి దాహంతో నీటికోసం చెట్టుకింద వేచి ఉన్నట్లు నటిస్తున్నాడు. ఇంతలో నెత్తిమీద పూర్ణజలకుంభంతో తిరుమలనంబి అటుగా వస్తున్నాడని గమనించాడు. అతడు తన దగ్గరికి రాగానే- 'తాతా! దాహం! దాహం! త్రాగడానికి కొన్ని నీళ్లు కావాలి ఇస్తావా?' అని ప్రాధేయపడ్డాడు. తిరుమలనంబి బాలుణ్ణి చూశాడు. వేటాడి అలసిపోయి పిపాసార్తుడై ఉన్నాడని గ్రహించాడు. అయినా తనకుండలోని నీళ్లను ఇవ్వాలనుకోలేదు. ఎందుకంటే అవి స్వామివారి అభిషేకంకోసం తీసుకొనివెళ్తున్న పవిత్రజలాలు, వాటిని ఇవ్వాలని అనిపించలేదు - 'బాలకా! ఇవి స్వామివారి అభిషేకంకోసం తెచ్చిన పవిత్రజలాలు, వీటిని నీకు ఇవ్వలేను' అన్నాడు. అప్పుడా బాలుడు - 'తాతా! నాకు దాహంతో నోరు ఎండిపోతున్నది. ప్రాణాలు పోయేట్టున్నాయి నన్ను కాపాడు' అన్నాడు. తిరుమలనంబి - 'ఓ బాలకా! నిన్ను ఆ భగవంతుడే కాపాడుతాడు. అందరికీ ఆయనేకదా ప్రాణ రక్షకుడు. నేను నీకు ఏమీ చేయలేను' అని ముందుకు సాగిపోయాడు. వెంటనే ఆ బాలుడు తన ధనుస్సుకు బాణాన్ని ఎక్కుపెట్టి ఆ నీటికుండను బాణంతో కొట్టాడు. కుండకు చిల్లుపడింది. నీరు ధారగా కారుతోంది. బాలుడు ఆ నీటిని తన దోసిటితో పట్టుకొని త్రాగాడు, దాహం తీరింది. జరిగిన సంఘటనకు తిరుమలనంబి అవాక్కయ్యాడు. "అయ్యో! స్వామి వారి అభిషేకజలం ఇలా వ్యర్థమైపోయింది. ఇప్పుడేం చేయాలి? ఎంత అపచారం జరిగింది?" అని కుప్పకూలిపోయాడు.

అప్పుడా బాలుడు తిరుమలనంబిని పైకి లేపి 'తాతా! నీకు పవిత్రజలాలను నేను సృష్టించి ఇస్తాను' అంటూ ధనుస్సుకు బాణాన్ని సంధించి, కొండకు ఎక్కుపెట్టి కొట్టాడు. అంతలోనే ఆశ్చర్యం! కొండపైనుండి జలజలా జలధారలు ఉప్పొంగి ప్రవహించాయి. ఆకాశంనుండి గగనగంగాజలాలే కొండపైకి దూకి పడుతున్నట్లు అనుభూతి! అద్భుతదృశ్యం!! ఆశ్చర్యం తోనూ, ఆనందంతోనూ ఆ దివ్యజలాలను చూస్తున్న తిరుమల నంబి చేతికి ఒక బంగారు బిందెను అందించాడు బాలుడు. అప్పుడు అర్థమైంది తిరుమలనంబికి! ఆ బాలుడు ఎవరో కాదు సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరుడే. తన హృదయకమలంలో అధిష్ఠించి ఉన్న పరమదైవమే. వెంటనే ఆనంద తరంగాలలో ఓలలాడుతూ ఆ బంగారు కుండను స్వీకరించాడు తిరుమలనంబి. స్వామి అంతర్ధానమైపోయాడు!

స్వర్ణకలశంలో నీళ్లను నింపుకొని కోవెలకు చేరుకున్నాడు. తనివితీరేలా స్వామివారి అర్చామూర్తిని అభిషేకించాడు. తాను తరించాడు. లోకాన్నీ తరింపజేశాడు. తిరుమల నంబి కారణంగానే స్వామివారి కరుణతో ఆకాశగంగతీర్థరాజం ఉద్భవించింది. నేటికీ అక్కడినుండే స్వామివారి అభిషేకానికి పుణ్యజలాలు తెస్తారు. ఈ తీర్థరాజాన్ని దర్శించి, ఆ పవిత్ర జలాలలో గ్రుంకులాడి అశేషభక్తకోటి తరిస్తోంది! అందుకే శ్రీవేంకటేశ్వరుని సేవించి, తరించిన తిరుమలనంబి భక్తకోటికి ఆదర్శప్రాయుడయ్యాడు. తిరుమలనంబి స్మరణం శ్రీవేంకటేశ్వరుని సమర్చనమే! అందుకే *వేంకటేశ సమోదేవో న భూతో న భవిష్యతి!*

ఓర్పు వల్ల సిద్ధించని కార్యమంటూ ఉండదు

కైంకర్యమే.. తనువు దాల్చితే....

18

– డా॥ కంపల్లె రవిచంద్రన్



(మధురకవులు శ్రీనమ్మాళ్వార్లవారిని ఆచార్యులుగా స్వీకరించే ప్రయత్నంలో రామాయణాన్ని గుర్తుచేసుకుంటున్నారు. ఆ ఘట్టమే ఇది.)

అగ్నిహోత్రం, తపస్సు, సత్యం, భూతదయ, ఆతిథ్యం, వైశ్వదేవం ఇవి ఇష్టాలు.

వాపీకూప తటాకాదులను త్రవ్వించటం, దేవతాయతన నిర్మాణం చేయించటం, అన్నదానం చేయించటం, ఉద్యాన వనాల్ని నిర్మించటం ఇవి పూర్తాలు.

ఈ వేళ నీ మిథ్యావాక్యం వల్ల నీవు చేసిన ఇష్టా పూర్త రూపమైన మంచిపనులన్నీ వ్యర్థమైపోయాయి. నీ కొడుకు కృతాస్త్రుడు కానీ అకృతాస్త్రుడు కానీ రాక్షసులను ఎదిరింపలేని వాడు కానీ అవి నీ కనవసరం.

ఎందుకని?

అగ్నిచేత అమృతం రక్షింపబడుతూన్నట్లు ఈ విశ్వా మిత్రుని చేత నీ కొడుకు రక్షింపబడుతూ ఉంటాడు.

ఇక్కడ రాముడే అమృతం. అమృతానికి నాశనం లేదు. కాని, అది స్వతస్సిద్ధంగా చేష్టాలక్షణం కలది కాదు. దానికి ఆధారం ఒకటుండాలి. అది శరీరం. ఈ ఘటస్థానీయుడు విశ్వామిత్రుడు ఇదీ వశిష్ఠుని భావం.

విశ్వామిత్రుడే ఏమనుకుంటున్నావు!–

ఇతడు సాక్షాత్తు ధర్మం యొక్క స్వరూపమే. లోకంలో ఇంతకంటే బుద్ధిమంతుడు లేడు. తపస్సు అనే దానికి పరమ స్థానం. ఇంతకంటే అస్త్రవేత్త అయిన పురుషుడు ఈ మూడు లోకాల్లోనూ మరొకడుంటాడని నేననుకోవటం లేదు.

విశ్వామిత్రుడు ధర్మస్వరూపుడు కనుక – తనంత తానుగ తీసికొని వెడుతూన్న నీ కొడుకును తనశక్తితో తెలివి తేటలతో, తనతపస్సుతో రక్షింపగలడు.

అంతేకాదు– ఇతనితో వెడితే అకృతాస్త్రుడు అయిన నీ కొడుకు కృతాస్త్రుడయ్యే అవకాశముంది. కనుక సంశయింప వలసినదేమీ లేదు. అంతేకాదు– రాముడు కానివాణ్ణి పంపడా నికి వీలు లేదు. అని హెచ్చరించాడు. ఇప్పటికి దశరథుడు ప్రసన్నుడయ్యాడు.

దశరథుడు లక్ష్మణునితో కలిపి రాముణ్ణి పంపించాడు.

ముందు విశ్వామిత్రమహర్షి – ఆ వెనుక

పిల్లజుట్టుతో ధనుర్ధారి అయిన రాముడు – ఆ వెనుక

ధన్వి అయిన లక్ష్మణుడు

రెండుభుజాలకు రెండు తూణీరాలు. ఆ రెండు తూణీరాలతో కలిపి శిరస్సును చూస్తూ ఉంటే మూడు తలల మహాసర్పంలా ఉన్నారట. వారప్పుడే పడగవిప్పిన పాములు.

ఆ ఇద్దరితో కలిసి వెడుతూ ఉంటే అశ్వినీదేవతలతో కలిసి వెడుతూన్న బ్రహ్మదేవునిలా ఉన్నాడు మహర్షి.

ఇప్పుడాయన నిజంగా విశ్వామిత్రుడు.

అప్పుడాయనకు విశ్వం కూడా మిత్రమే కదా!

తన మిత్రమైన విశ్వం జబ్బుపడింది. అందుకని వైద్యుల్ని తీసికొని వెడుతున్నాడు –

నిశ్శబ్దంగా నడుస్తున్నారు. అలా సరయూనదికి దక్షిణపు ఒడ్డున యోజనన్నర (సరాసరి పన్నెండు మైళ్లు) నడచిన తర్వాత అప్పుడు – విశ్వామిత్రుడు 'రామా' అని మధురంగా పిలిచేడట. అంతవరకు ఆయన వాళ్లతో ఏమీ మాట్లాడలేదు.

వాళ్లూ అంతే – ఆయన వెనకాల అలా వెళ్ళిపోతూనే ఉన్నారు. పన్నెండేళ్ల పసివాళ్లు నోరు మెదపకుండా పన్నెండు మైళ్లు నడిచేరు. ఇదీ రాముని పితృవాక్యపరిపాలన అంటే –

తండ్రి వెళ్లమన్నాడు – ఆయన వెళ్లిపోతున్నాడు.

ఆయన్ను అనుసరిస్తూన్న లక్ష్మణుడూ అంతే!

ఎక్కడికి అన్నయ్యా! అని ఈయనా అడుగడు.

వీళ్లూ అన్నదమ్ములు..

వీళ్లూ కొడుకులు....

ఈ అనుసరణలో గ్రుడ్డిదనం లేదు. ప్రగాఢ విశ్వాసం ఉంది.

ఈ ఘట్టం తర్వాత నుంచే రాముని పరాక్రమం వ్యక్తమైంది. రాముడంటే ఏమిటో లోకానికి మొదటిసారి తెలిసింది. విశ్వామిత్రుడు కథలు చెప్పి ఆ వెన్నెల రాత్రులను పరిమళభరితాలుగా చేసి సుఖంగా నిద్రపట్టేలా చేశాడట.

కటికనేల మీద కమలాక్షుడు పరుండె
ప్రక్కగూడ అతని ప్రక్కబండె[1]
కథలు చెప్ప ఋషికి కదలిపోయెను గుండె
కథను నడుపువాడు కదలకుండె

(1 - లక్ష్మణరూపంలో ఉన్న శేషుడు)

కఠినమైన అరణ్యమార్గంలో నడుస్తున్నా కథలు, కమ్మని ఉపదేశాలు ఆ దారిలో పూవులు పరిచాయి. 'అలకలల్లాడగ గని ఆ రాణ్ముని ఎటు పొంగెనో' అన్నట్లుగా రాముడు వేగంగా నడుస్తూ గురూపదేశ సారాన్ని కూడా అంతేవేగంగా అర్థం చేసుకుని ఆచరించాడు.

ఇలా ఈ ఘట్టాన్ని గుర్తు చేసుకున్నారు మధురకవులు.

కనుక తానెంచుకున్న గురుదేవులు కూడా అంతటి వారే. అని ఆలోచించి, తెలుసుకోవడం కోసం అంజలిచేసి ఆళ్వారు ముందు నిలిచి ఇలా చెప్పబోగా–ఆళ్వారు కూడా "మన శిష్యుడు గణనాథుడు. ఇక్కడ జన్మించి నా దగ్గరకు వచ్చాడు. ఇతణ్ణి అనుగ్రహించాలి" అని కృపాకటాక్షాన్ని చూపారు.

"అచిత్తుతో జీవాత్మ సంబంధం కలిగి ఉన్నప్పుడు, అంటే ప్రకృతి గర్భంలో జీవుడు ప్రవేశించి కరణకళేబరాలను కలిగి ఉండేటప్పుడు, అంటే శరీరం వచ్చినప్పుడు దేన్ని అనుభవించి ఎక్కడ పడి ఉంటాడు?" అని మధురకవులు అడిగారు.

"శరీరగతమైన సుఖదుఃఖాదులను అనుభవిస్తూ శరీరాన్నే ఆశ్రయించుకుని ఉంటాడు. లేక, జీవాత్మ ప్రకాశుడు, శరీరం కలిగినప్పుడు జీవాత్మ ప్రకాశుడు, శరీరం కలిగి నప్పుడు జ్ఞానం ఉదయించినట్లయితే, ప్రకృతికి లోబడక, ఆచార్యానుగ్రహాన్ని పొంది, భక్తిజ్ఞానాలు పొంది, అకార వాచ్యుని తెలిసి నిత్యముక్తులతో ఉంటాడు." అని నమ్మాళ్వారు ప్రత్యుత్తరమిచ్చారు.

(ఇంకా ఉంది)

తిరుమలలో కార్తిక దీపోత్సవం

దీపావళి పండుగ మొదలుగా కార్తిక మాసమంతా దీపాల పండుగగా జరుపడం ఆనవాయితీ. తిరుమల శ్రీవారి ఆలయంలో కార్తికపౌర్ణమినాడు ఈ దీపోత్సవం విశేషంగా కన్నుల పండువుగా జరుగుతుంది. కార్తిక పున్నమినాటి సాయంత్రం శ్రీ శ్రీనివాసభగవానునికి సాయంకాల కైంకర్యాదులు నివేదనలు పూర్తి అయిన తర్వాత ఈ దీపోత్సవం విశేషంగా కన్నులపండువుగా జరుపుతారు.

మొదట శ్రీ యోగనరసింహస్వామి ఆలయం ప్రక్కన ఉన్న పరిమళం అరదగ్గర నూరు కొత్త మట్టి మూకుళ్లు ఉంచుతారు. అందులో నేతి వత్తులు వేసి దీపాలను వెలిగిస్తారు. తదుపరి వీటిని ఛత్రచామర, మంగళవాయిద్య సమేతంగా ఊరేగింపుతో విమానం ప్రదక్షిణం చేస్తూ, ఆనందనిలయంలో శ్రీవారికి హారతి ఇస్తారు. ఆ తర్వాత వరుసగా గర్భాలయంలో బ్రహ్మ అఖండం, కులశేఖరపడి, రాములవారి మేడ, బంగారువాకిలి, ద్వారపాలకులు, గరుడాళ్వారు, వరదరాజస్వామి సన్నిధి, వకుళమాత, బంగారు బావి, కల్యాణమండపం, సభ అర, తాళ్లపాక అర, భాష్యకారుల సన్నిధి, యోగనరసింహస్వామి, విష్వక్సేనులు, చందనం అర, పరిమళం అర, వెండివాకిలి, ధ్వజస్తంభం, బలిపీఠం, క్షేత్రపాలకుల సన్నిధి, తిరుమలరాయమండపం, పూలబావి, రంగనాయక మండపం, మహాద్వారం, బేడి ఆంజనేయస్వామి, శ్రీవరాహస్వామి ఆలయం, స్వామి పుష్కరిణి తదితరచోట్ల నేతిదీపాలు వెలిగిస్తారు. కార్తికమాసం పౌర్ణమి నాడు తిరుమల కొండలో జరిగే ఈ కార్తిక దీపోత్సవం చూసి తీరాలేగాని వర్ణించడానికి సాధ్యం కాదు.

ఆదర్శధర్మమూర్తి అత్రిమహర్షి

– డా॥ యల్లాప్రగడ మల్లికార్జునరావు

భారతీయ సనాతనధర్మంలో మహర్షులకు ఓ ప్రముఖ స్థానముంది. ఆ మహర్షులు వేదసారములను శ్రుతి, స్మృతి, పురాణాల రూపంలో అందించారు. వారు చూపిన ఆ జ్ఞాన జ్యోతుల కాంతులలోనే భారతీయ సనాతనధర్మం ముందుకు సాగుతోంది. అలాంటి మహర్షుల వరుసలో తొలిగా పేర్కొన దగిన మహర్షి అత్రిమహర్షి.

అత్రిమహర్షి ప్రధానంగా చెప్పుకొనే సప్తఋషులలో ఒకడు. ఆయన బ్రహ్మ మానసపుత్రుడు. సృష్టిని విస్తరింప చేయటం కోసం బ్రహ్మ సంకల్పంతో ఉద్భవించాడు. ఆయన అసలు పేరులోనే గొప్ప విశేషముంది. 'త్రి' అంటే మూడు అని అర్థం. అ 'త్రి' అంటే మూడు గుణాలు లేనివాడు కనుకనే అత్రి అనే పేరొచ్చింది. సత్త్వగుణం, రజోగుణం, తమోగుణం అనే మూడుగుణాలకు ఆయన అతీతుడు. అలా త్రిగుణాతీతుడుగా ఉండటం చాలా గొప్పదైన దైవిక విషయం. అంతటి మహోన్న తుడు కనుకనే ఈయన పేరును ఈనాటికీ నిరంతరం స్మరిస్తూ ఉంటారు. ఈ మహర్షికి మరో ప్రత్యేకత ఏమిటంటే త్రిగుణా లను జయించిన ఇల్లాలుగా **అనసూయ** దొరకటం. కర్దమప్రజా పతికి, దేవహూతికి అనసూయ జన్మించింది. ఈ ఇద్దరూ ఆదర్శ దంపతులు. అనసూయ అంటే అసూయ లేనిది. త్రిగుణాలను జయించిన ఆయనకు అసూయరహితురాలైన భార్య తగిన జోడీగా ఉండి ప్రపంచానికి చేసిన మేలు అంతా ఇంతా కాదు. అత్రి అనసూయల దాంపత్య జీవితం సర్వలోక సంక్షేమం కోసమే సాగింది.

మహాతపస్సంపన్నులు

అత్రిమహర్షి మహాతపస్సంపన్నుడు. వివాహానికి ముందు ఆ మహర్షి తపస్సుకు ఉపక్రమించాడు. ఆ తపస్సు కూడా తన తండ్రి అయిన బ్రహ్మదేవుడి అనుమతి మేరకే ప్రారంభించాడు. లోకసృష్టి విస్తరింపజేసే లక్ష్యంగా ఆ తపస్సు సాగుతోంది. ఆ తీవ్ర తపస్సుతో ఎంతో గొప్పజ్ఞానం ఆయనకు సమకూరింది. ఆ జ్ఞానంతోనే ప్రాణుల శరీర వ్యవస్థ పంచ భూతాత్మకమైనదని, అది అస్థిరమైనదని సంపూర్ణంగా గ్రహిం చాడు. అలాగే విశ్వంలో నిత్యమైనది ఆత్మమాత్రమేనని, ఆ ఆత్మను కూడా తెలుసుకున్నాడు. ఆత్మను తెలుసుకున్నాక కూడా ఆ ఉగ్రతపస్సును విడిచి పెట్టలేదు. ఆ తపశ్శక్తి ప్రభావంతో ఓ రోజున అత్రి మహర్షి నేత్రాల నుంచి ఓ దివ్యప్రశాంత తేజస్సు వెలువడింది. ఆ కాంతి దశదిశలా వ్యాపించింది. కానీ, ఆ దిశలు ఆ తేజస్సును భరించలేకపోయాయి. వెంటనే ఆ దిశలన్నీ తేజస్సును సముద్రంలోకి విడిచిపెట్టాయి. అయితే ఆ విషయాన్ని గమనించిన బ్రహ్మదేవుడు క్షణాలలో ఆ దివ్యతేజస్సును తనలోకి లాక్కున్నాడు. అప్పుడు అదంతా చూస్తూ ఆశ్చర్యపోతున్న దేవతలకు బ్రహ్మ ఇలా సమాధానం చెప్పాడు.

చంద్రోద్భవం

"ఓ దేవతలారా! ఇలా జరిగిందంతా లోకసంక్షేమం కోసమే. అత్రికి భవిష్యత్తులో అనసూయ అనే కన్యతో వివాహమౌతుంది. అప్పుడు ఆ దంపతులకు కుమారుడుగా చంద్రుడు ఉద్భవిస్తాడు. అలాగే, ఈ తేజస్సే మరోసారి క్షీర సాగరమథనవేళ చంద్రుడుగా అవతరించి లోకాలన్నిటికీ మేలు చేస్తాడు" అని బ్రహ్మదేవుడు దేవతలందరికీ చెప్పాడు.

అనురాగపూరిత భర్త

అత్రిమహర్షి ఎంతటి కఠోరమైన తపస్సు చేసి శక్తిని సంపాదించినా ఇల్లును, ఇల్లాలిని ఏనాడు బాధించలేదు. ఏ క్షణంలోనూ భార్యవిషయంలో అనురాగరహితంగా ప్రవర్తించ లేదు. భార్య పండుముసలిగా అయి కృశించి ఉన్న స్థితిలో కూడా ఆమె ఔన్నత్యాన్ని అందరికీ తెలియ చెబుతూ అనురాగ పూరితమైన భర్తగా భాసిల్లాడు. అరమరికలులేని దాంపత్య జీవితాన్ని అత్రి, అనసూయ దంపతులు కడదాగా గడిపారు. ఎన్నికష్టాలు వచ్చినా, ఎన్ని పరీక్షలు ఎదురైనా పరిస్థితులను ఇద్దరూ ఒకరికొకరు చెప్పుకొని, సమీక్షించుకొని విజయాలనే చేజిక్కించుకున్నారు. ఇలాంటి పరీక్షలలో అనసూయ పాత్రివ్రత్య మహిమను బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు పరీక్షించాలనుకున్న సందర్భం ఒకటి కనిపిస్తుంది.

ఆ రోజుల్లో అత్రిమహర్షి అనసూయతో కలిసి ఋక్ష పర్వతం మీద తపస్సు చేస్తూండేవాడు. తమకు సంతానం కావాలన్న సంకల్పంతో ఆ తపస్సు సాగుతోంది. ఓ రోజున బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నారు. సంతానం కావాలన్నాడు అత్రి. అయితే అనసూయ వస్త్ర

అక్టోబరు - 28 అత్రిమహర్షి వర్షతిరునక్షత్ర సందర్భంగా..

రహితంగా తమకు భోజనం వడ్డించాలని త్రిమూర్తులు పరీక్ష దృష్టితో అత్రికి చెప్పారు. నిజానికి ఈ మాట ఎంతో మథనపడే విషయం. ఆత్మగౌరవ సంబంధమైనది. అత్రి ఏ మాత్రం కుంగిపోలేదు. ఆయనకు తన భార్యమీద గట్టి నమ్మకం ఉంది. ఆ నమ్మకంతోనే జరిగిన విషయాన్ని అనసూయకు చెప్పాడు. అనసూయ కంగారు పడలేదు. అనవసరమైన కోపతాపాలకు గురికాలేదు. పరీక్షా సమయంలో చూపాల్సిన నిబ్బరాన్ని, గుండె ధైర్యాన్ని చూపింది. త్రిమూర్తులను భోజనానికి ఆహ్వానించమని భర్తకు చెప్పింది. ముగ్గురూ రాగానే అతిథి పూజ సత్కారాల య్యాక మంత్రజలాన్ని వారిపై చల్లింది. వెంటనే త్రిమూర్తులు పసిపాపల్లా మారిపోయారు. అనుకొన్నట్టుగానేవారికి ఆహారాన్ని అందించింది అనసూయ. ఊహ తెలియని పసిబాలలుగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు తల్లిచేత ఆహారాన్నిపొందిన తీరులో కడుపు నింపుకున్నారు. అలా అయ్యాక ఆమె మళ్లీ వస్త్రధారణ చేసి ముగ్గురు మీద మంత్రజలం చల్లింది. వారికి స్వస్వరూపాలు వచ్చాయి. అప్పుడా ముగ్గురూ ఆనందించి తమ అంశలచేత ముగ్గురు పుత్రులు జన్మిస్తారని వరమిచ్చి అంతర్ధానయ్యారు.

ముగ్గురు బిడ్డలు

అత్రి, అనసూయ దంపతులకు దైవాంశలతో ముగ్గురు బిడ్డలు కలిగారు. ముందుగా చంద్రుడు జన్మించాడు. ఆ తర్వాత దత్తాత్రేయుడు, దుర్వాసుడు జన్మించారు.

ఆదర్శజీవనం

అత్రి సాంసారిక జీవితాన్ని ఆదర్శంగా గడిపాడు. సంప్రదాయాన్ని అనుసరించి గృహస్థజీవితం ముగిశాక వాన ప్రస్థ ఆశ్రమం తీసుకోవాలి. అంటే భార్యాభర్త ఇద్దరూ శేష జీవితాన్ని తపస్సు చేస్తూ అడవులలో గడపాలి. ఆ విషయాన్ని అనసూయకు గుర్తు చేశాడు అత్రి. అయితే, ఆమె బిడ్డలు మరింత పెద్దయ్యాక వానప్రస్థానికి వెళ్లవచ్చు కదా! అని అనటంతో ఆమె మాటను మన్నించాడు. పృథు చక్రవర్తి చేస్తున్న యజ్ఞానికి వెళ్లి ఆశీస్సులందించి ఆయన ఇచ్చిన సంపదలను తెచ్చి సంతానానికి ఇచ్చాడు. దాంతో గృహస్థ జీవిత బాధ్యతలన్నీ అయినట్లు అనిపించి దంపతులిద్దరూ వానప్రస్థ ఆశ్రమానికి బయలుదేరారు.

ఆ కంటి చూపే ఓ గొప్పశక్తి

అత్రిమహర్షి నేత్రాలనుంచి ఉద్భవించిన తేజస్సే చంద్రుడుగా కావటం ఒక విశేషం. అలాగే ఆ కంటి చూపునకే మరో విశేషం కూడా ఉంది. అసలా చూపే గొప్ప శక్తి. ఆ రోజుల్లో జంభుడులాంటి రాక్షసులు దేవతలను విపరీతంగా బాధిస్తూండేవారు. రాహువు సూర్యచంద్రులను వేధిస్తూండేవాడు. బాధలు పడుతున్న దేవతలకు రాహువు వల్ల సూర్యచంద్రులు తేజస్సు కోల్పోవటంతో అంతా అంధకారమైపోయింది. ఆ అంధ కారంలో రాక్షసులు పెట్టే బాధలు మరింత పెరిగాయి. ఆ పరిస్థితి నుంచి తట్టుకోవటానికి తగిన ఉపాయాన్ని ఆలోచి స్తున్న దేవతలకు అత్రిమహర్షి శక్తి గుర్తుకొచ్చింది. వెంటనే ఆయనను ఆశ్రయించారు. అప్పుడా మహర్షి శక్తివంతమైన తన కంటి చూపుతోనే రాక్షసులందరినీ నశింపజేశాడు.

అత్రి అనసూయల ఆదర్శదాంపత్యానికి సంబంధించిన ఓ ఘట్టం వాల్మీకి రామాయణం అయోధ్యకాండ చివరలో కనిపిస్తుంది. సీతారామలక్ష్మణులు వనవాసం చేస్తూ దండ కారణ్యంలోని అత్రి ఆశ్రమానికి వచ్చారు. అప్పుడా మహర్షి రాముణ్ణి తన సొంత కుమారుడిలాగా ఆదరించాడు. అప్పుడే తపస్సు నుంచి ఆశ్రమానికొచ్చిన పండు ముసలిగా ఉన్న తన భార్య అనసూయను రామచంద్రుడికి పరిచయం చేస్తూ ఆమె గొప్పతనాలన్నిటినీ వివరంగా చెప్పాడు. ఆ చెప్పిన తీరులో ఆదర్శమూర్తి అయిన భర్త దర్శనం ఇస్తాడు.

అత్రి అందించిన సంపద

అత్రిమహర్షి మానవాళికి శ్రుతులు, స్మృతులను అందిం చాడు. అవన్నీ మానవాళికి మార్గదర్శక సూత్రాలు. లఘు అత్రి స్మృతి, వృద్ధ ఆత్రేయ స్మృతి అనేవి వాటిలోని ప్రధానమైనవి. అలాగే అత్రి సంహిత, అత్రి ధర్మ సంహిత అనేవి ముఖ్యమైనవి. వీటన్నిటికీ మించి ఆ మహర్షి ప్రతిపాదించిన మహోన్నత అంశం అంటరానితనం పనికి రాదు అనేది. దేవుడు అందరి వాడు అయినప్పుడు, ప్రతి జీవి దైవసృష్టి అయినప్పుడు ఈ భేదాలన్నీ అనవసరమంటాడు ఆయన. అత్రి దేవాలయ నిర్మాణా నికి సంబంధించిన ఎన్నెన్నో విషయాలను అందించాడు. స్థల పరీక్ష, వాస్తు, నిర్మాణ విధానం, మూలవిరాట్టును ప్రతిష్ఠింప చేయటం, ఆ తర్వాత అభిషేకపూజ, నివేదనలు ఎలా ఉండాలన్న విషయాలను స్పష్టం చేశాడు. ఇదంతా అత్రిమహర్షి మనకు అందించిన ఒక మహోన్నత శాస్త్ర విజ్ఞానం.

బుద్ధిమంతునికి అహంకారం ఉండదు

కడలి- శ్రీకపోతేశ్వరాలయం

- శ్రీ కొండూరి భాస్కర రమణమూర్తి

తూర్పుగోదావరి జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రాలలో రాజోలుమండలంలోని కడలిలో విరాజిల్లుతున్న శ్రీకపోతేశ్వరా లయం ఒకటి. కరుణామయుడైన మహాశివుడు స్వయంభువుగా వెలిసిన క్షేత్రమిది.

భక్తితత్పరత గలిగిన మానవులనేగాక పశుపక్ష్యాది కీటకములను కూడా పరమేశ్వరుడు అనుగ్రహించిన ఇతివృత్తాలు అనేకం. ఇందుకు ప్రముఖ నిదర్శనం ప్రధానంగా శ్రీకాళహస్తి క్షేత్రం. అదేవిధంగా, గృహస్థ ధర్మాన్ని పాటించి అతిథిని ఆదరించిన ఒక పావురాల జంటకు మోక్షాన్ని ప్రసాదించి తనలో లీనం చేసుకున్న క్షేత్రమే కడలి.

ఆ పావురాల జంట ప్రార్థనానుసారం భక్తులను అనుగ్రహించడానికి కరుణామయుడైన మహాశివుడు శ్రీకపోతేశ్వర స్వామిగా ఆవిర్భవించిన క్షేత్రమే **కడలి.**

అటవీప్రాంతమైన కడలిలో ఒక వృక్షంపై ఒక కపోతాల జంట కాపురముండేది. ఒకనాడు బాగా వర్షం పడడం వల్ల తడిసిముద్దైన ఒక వేటగాడు ఆ వృక్షం క్రింద చేరాడు. చలికి వణకసాగాడు.



శ్రీ కపోతేశ్వరాలయం, కడలి

అది చూచిన పావురాల జంట ఆ వేటగాణ్ణి తమ అతిథిగా భావించాయి. అతను పడుతున్న బాధకు తల్లడిల్లి తమ గూటిలోని ఎండుపుల్లలను చెట్టు క్రింద పరచి, సమీపంలోని శ్మశానం నుండి రగులుతున్న పుల్లను తెచ్చి మంటను రగిల్చి ఆ వేటగానికి ఉపశమనం కలుగజేశాయి.

చలినుండి తేరుకున్న వేటగాడు ఆకలిబాధతో అలమటించడం చూసిన పావురాల జంట కరుణతో ఆ మంటలో దూకి అతనికి ఆహార మయ్యాయి.

ఈ హఠాత్పరిణామం ఆ వేటగానిలోని మానవత్వాన్ని మేలుగొలిపింది. అతను కూడా అదే మంటలో దూకి ఆత్మ త్యాగం చేసుకున్నాడు.

పావురాల గృహస్థ ధర్మాచరణకు, కారుణ్యానికి సంతసించిన పరమశివుడు ప్రత్యక్షమై, ఆ పావురాల జంటను తనలో లీనం చేసుకోగా, పావురాలు పరమశివుని- ఆ వేటగాణ్ణి తిరిగి బ్రతికించి, భక్తులను అనుగ్రహించడానికి ఆ ప్రదేశంలో ఆవిర్భవించవలసినదిగా ప్రార్థించాయి. ఈ విధంగా శ్రీకపోతేశ్వర స్వామి కడలి క్షేత్రంలో స్వయంభువుగా ఆవిర్భవించాడు.

ఆ పావురాల జంటను తనలో లీనం చేసుకున్నాడన్న దానికి నిదర్శనంగా, శివలింగంపై రెండు వైపులా పావురాల తల, రెక్కలు, తోక గుర్తులను ఈ నాటికీ మనం స్వామి నిజ రూపదర్శనంలో చూడవచ్చు.

బ్రహ్మాండపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో ఈ క్షేత్ర ప్రస్తావన ఉన్నట్లు తెలియవస్తున్నది. రాజగోపురం పంచలోహ కలశాలతో శోభిల్లుతూ ఉంటుంది. ఇరువైపులా శృంగి, భృంగి స్వాగతం పలుకుతున్నట్లు శోభిల్లుతున్నారు. క్రీ.శ.15 - 16 శతాబ్దాలలో పల్లవులద్వారా ఈ ఆలయ నిర్మాణం జరిగినట్లు చారిత్రక ఆధారాలద్వారా తెలుస్తోంది.

గర్భాలయంలో ఉత్తరాభిముఖంగా ఉన్న స్వామి, ఆవిర్భవించిన వెంటనే శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి తన పడగలతో

నీడ పట్టాదని ప్రతీతి. అందువల్లనే ఇక్కడ ఒకే పీఠంపై శివుని, సుబ్రహ్మణ్యస్వామిని అర్చించుకోవడం ఒక విశేషం. రాహుగ్రహ దోషాలను నివారించే క్షేత్రంగా కూడా ప్రసిద్ధి.

శ్రీకపోతేశ్వర స్వామి అనుగ్రహంతో సంతానహీనులైన దంపతులకు సంతానం కలుగుతుందని నమ్మకం. గర్భాలయంలో స్వామివారి వెనుక సమున్నత పీఠంపై శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను దర్శించవచ్చు.

ఈ ఆలయ ప్రాంగణంలో అనేక ఉపాలయాలు విరాజిల్లుతున్నాయి. క్షేత్రపాలకుడైన శ్రీజనార్దనస్వామి (విష్ణువు), శ్రీసూర్యనారాయణమూర్తి, శ్రీవరసిద్ధి వినాయకుడు, పార్వతీదేవి (అంబిక)లతో కలసి పంచాయతన క్షేత్రంగా భాసిల్లుతున్నది. ఇతర ఉపాలయాలలో కాలభైరవుని, చండీశ్వరుని, కాళికాదేవిని, శ్రీవల్లీదేవసేనా సమేత శ్రీసుబ్రహ్మణ్యస్వామిని, భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామిని దర్శించి తరించవచ్చును.



ఆలయముఖద్వారం



శ్రీకపోతేశ్వరస్వామి ఆలయానికి ఎడమవైపున శ్రీబాలాత్రిపురసుందరి ఆలయం వెలసి ఉన్నది. జగద్గురువులు శ్రీఆది శంకరాచార్యులు ఈ క్షేత్రాన్ని దర్శించి శ్రీబాలాత్రిపురసుందరీ దేవిని శ్రీచక్రసహితంగా ప్రతిష్ఠించారని తెలియవస్తున్నది.

ఆలయ సమీపంలో నెలకొన్న పవిత్రపుష్కరిణి కపోత కుండంగా ప్రసిద్ధి చెందింది. మాఘమాసంలో ఆదివారంనాడు కాశీనుండి గంగమ్మ అంతర్వాహినిగా ఈ కుండంలోకి ప్రవహిస్తుందని భక్తుల నమ్మకం. ఆ రోజున ఈ పుష్కరిణిలోని నీటిలో వేసిన బిల్వదళం మునిగిపోవడమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనంగా భావిస్తారు. పుష్కరిణిలో పవిత్రస్నానాలాచరించేందుకు భక్తులు తరలి వస్తారు.

ప్రతి నిత్యం శ్రీకపోతేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం జరుపబడుతుంది. ప్రతిమాస శివరాత్రికి లక్షబిల్వార్చన జరపడం విశేషం. శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయంలోని శ్రీచక్రమేరువుకు నిత్యం కుంకుమార్చనలు జరుగుతాయి. మాసశివరాత్రి, మహాశివరాత్రి, శ్రీసుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు వైభవంగా నిర్వహించబడుతాయి. ఫాల్గుణ శుద్ధ ఏకాదశినాడు శ్రీకపోతేశ్వరస్వామివారి కల్యాణం వైభవంగా జరపడం విశేషం.

పరమపావనమైన కడలి క్షేత్రాన్ని రాజమండ్రి నుండి 71 కి.మీ., రాజోలు నుండి 8 కి.మీ., అమలాపురం నుండి 31 కి.మీ. ప్రయాణాన్ని రాష్ట్రరోడ్డు రవాణా సంస్థల బస్సుల ద్వారాగాని, సొంతవాహనాల ద్వారాగాని చేరుకొనవచ్చు. శ్రీకపోతేశ్వరస్వామి, శ్రీబాలాత్రిపురసుందరీదేవిలను దర్శించి తరించగలరు.

బుద్ధిమంతులు కాలాన్ని బట్టి వ్యవహరిస్తారు

నాగుల చవితి

– డా॥ కె.రామకృష్ణ



సనాతన భారతీయ సంప్రదాయం ప్రకృతికి పెద్దపీట వేస్తుంది. ఆచార వ్యవహారాలు, పండుగలు, పూజలు అన్నీ ప్రకృతి ఆరాధన ప్రధానంగా సాగుతాయి. చెట్టు, పుట్ట, నీరు, నిప్పు, గాలి, మట్టి... ఒకటేమిటి అనంత ప్రకృతిలోని అణు వణువును పూజించటం భారతజాతికి మొదటి కర్తవ్యంగా ఉంటుంది. ఈశ్వరాంశ ప్రతి ప్రాణిలోనూ వ్యాపించి ఉందని ఉపనిషత్తులు చెబుతున్నాయి. ప్రకృతి పరిరక్షణదిశగా మనిషిని కర్తవ్యబద్ధుణ్ణి చేయటం, అతడిలో సద్భావాలను ప్రేరేపించటం ఉపనిషత్తుల్లోని సారాంశం. హైందవ సంస్కృతిలోని పండుగలు చాలావరకు ఈవిధంగానే ఏర్పడ్డాయి. ఈక్రమంలో సర్పాలకు ప్రాధాన్యతనిస్తూ సాగే పర్వం **'నాగులచవితి'**.

వేదసంహితలు, బ్రాహ్మణాల్లో నాగులకు సంబంధించిన ప్రస్తావన ఉంది. పురాణ, ఇతిహాసాల్లో అనేకచోట్ల నాగులకు సంబంధించిన కథలు ఉన్నాయి. ప్రత్యేకించి, నాగమాత అయిన కద్రువకు సంబంధించిన గాథలు ఇతిహాసాల్లో ప్రస్తావనకు వస్తాయి. పాలకడలిలో శేషశయ్యపై పవళించిన మూర్తిగా శ్రీమహావిష్ణువును దర్శింపజేసే అదృష్టం ఆదిశేషునికి దక్కింది. పరమశివుడికి నాగులే ఆభరణాలు. ప్రత్యేకించి, గరళకంఠుని కంఠసీమను అలంకరించి, పన్నగభూషణుడుగా పరమేశ్వరునికి కీర్తితెచ్చింది నాగులే. సూర్యభగవానుడి రథానికి సర్పాలే పగ్గాలుగా ఉన్నాయి. భైరవుడికి, వినాయకుడికి నాగులే యజ్ఞోప వీతంగా ఉన్నాయి. ఆకాశం మధ్యలో వెలసిన కుజగ్రహానికి సర్పాలే కుదురుగా ఉన్నాయి. శనిదేవునికి సర్పమే ఆయుధం. క్షీరసాగరమథన సందర్భంలో మందరపర్వతాన్ని కవ్వంగా చేసుకున్న దేవదానవులకు కవ్వాన్ని చిలికే తాడుగా నిలిచి, అమృతావిర్భవానికి మూలంగా నిలిచిందీ సర్పమే.


మహాభారత గాథ

పాములకు ప్రాణదానం చేసిన ఆస్తీకుడి కథ భారతంలో ప్రసిద్ధి పొందిన ఉపాఖ్యానాల్లో ఒకటి. ఇతడు జరత్కారి అనే నాగజాతి స్త్రీకి జన్మిస్తాడు. జనకుడి పేరు జరత్కారుడు. చిన్నతనంలోనే సకల విద్యలూ నేర్చుకున్న ఆస్తీకుడు గొప్ప జ్ఞాని అవుతాడు. శాపం కారణంగా పరీక్షిన్మహారాజు పాముకాటువల్ల మరణిస్తాడు. ఇందుకు ఆగ్రహించిన అతడి పుత్రుడు జనమేజయుడు సర్పజాతి మొత్తం నాశనం కావాలని సంకల్పం చేసి, సర్పయాగం ప్రారంభిస్తాడు. మంత్రబలంవల్ల ఎక్కడెక్కడో ఉన్న పాములన్నీ యాగాగ్నిలో దగ్ధం అవుతుం టాయి. తన ప్రాణాలు కాపాడమని తక్షకుడు మహేంద్రుని ఆశ్రయిస్తాడు. ఆ మంత్రం పఠించినప్పటికీ తక్షకుడు రాకపోవటంతో, విషయాన్ని గ్రహించిన జనమేజయుడు **'స మహేంద్ర తక్షకాయ స్వాహా'** అంటూ మంత్రం పఠించే సరికి, దేవేంద్రుడి పీఠమే కదలి యాగస్థలికి వస్తుంది. దీంతో దేవేంద్రుడుకూడా భీతిచెందుతాడు. మరోపక్క నాగజాతి నాశనం కావటాన్ని తట్టుకోలేని మిగిలిన నాగజాతి ప్రముఖులు జనమే జయుడి యాగాన్ని ఆపించవలసిందిగా, ఇందుకు ఆస్తీకుణ్ణి పంపించవలసిందిగా జరత్కారుడిని కోరతారు. తండ్రి ఆజ్ఞ ప్రకారం ఆస్తీకుడు జనమేజయుడి యాగస్థలికి వెళ్ళి, తన నేర్పరి తనంతో, విద్యతో జనమేజయుడిని మెప్పించి, యాగాన్ని నిలుపు చేయిస్తాడు. ఆస్తీకుడి వైదుష్యానికి మెచ్చిన జనమేజయుడు అతనిని సత్కరించటానికి సిద్ధపడతాడు. 'సర్పహింస మంచిది కాదు. నీవు ఈ యాగం మాని, వాటిని రక్షిస్తే చాలు. అదే నాకు పెద్ద సత్కారం' అంటాడు ఆస్తీకుడు. జనమేజయుడు అందుకు అంగీకరించి, సర్పయాగాన్ని విరమిస్తాడు. నాగుల చవితినాడు ఈ కథ వింటే, నాగదోషాలనుంచి విముక్తి కలుగు తుందని పలువురి నమ్మకం.

అక్టోబరు – 23వ తేదీన నాగులచవితి సందర్భంగా...

నాగుల చవితి సంప్రదాయాలు

కార్తిక శుద్ధ చవితిని నాగులచవితిగా శాస్త్రాలు పేర్కొంటున్నాయి. కొన్నిచోట్ల శ్రావణశుద్ధచతుర్థి రోజున నాగుల చవితి జరుపుకునే ఆచారంకూడా ఉంది. నాగులచవితిలో ప్రధానంగా స్త్రీలు బాగా ఉత్సాహంగా పాల్గొంటారు. తెల్లవారు ఝామునే నిద్రలేచి, అభ్యంజనం చేసి, పరిశుభ్రమైన వస్త్రాలు ధరించి, పిల్లలనుకూడా తీసుకుని సమీపంలోని పుట్టవద్దకు వెళ్ళి, పూజ చేస్తారు. తమ కుటుంబాలకు మంచి జరగాలని, కన్నెపిల్లలకు త్వరగా వివాహం జరగాలని, తమ పిల్లలు చేసే



తప్పులను మన్నించి కాపాడాలని కోరుతూ పుట్టలో పాలు పోస్తారు. చలిమిడి, చిమ్మిరి, అరటిపండ్లు నాగులకు నివేదన చేస్తారు.

నాగుల చవితి - ఆచారాలు

పాములు పంటలను నాశనంచేసే క్రిమికీటకాదులను తింటూ, పరోక్షంగా 'రైతు'కు పంటనష్టం కలగకుండా చేస్తాయి. వర్షాకాలంలో పాములు పుట్టల్లో నుంచి బయటకు వచ్చి సంచరిస్తాయి. అందుకే శ్రావణమాసంలో సైతం **'నాగపంచమి'** పేరుతో పండుగ చేసుకుంటారు.

పుట్ట వల్ల భూమిలో తేమ పెరుగుతుంది. పంటలకు ఇది ఎంతో అవసరం. పంటలకు మూలం పాములే కాబట్టి, రైతులు వాటిని దేవతలుగా భావిస్తుంటారు.

అందుకనే, పంటలు బాగా పండే శ్రావణ, కార్తిక మాసాల్లో నాగులను పూజిస్తారు. పంట పొలాలకు శత్రువులు ఎలుకలు. వాటిని నిర్మూలించేవి పాములు. అవి క్రమంగా కనుమరుగైతే, మానవాళి మనుగడకే ప్రమాదం.

చాలా ఇళ్ళల్లో నాగదేవతను కులదేవతగా, ఇంటి దేవతగా ఆరాధించే ఆచారం ఉంటుంది. వివాహం ఆలస్యమైన వారు సుబ్రహ్మణ్యేశ్వరుణ్ణి పూజిస్తారు.

వివాహమైనా చాలాకాలం వరకు సంతానం కలగకపోతే నాగేంద్రస్వామికి మొక్కు కుంటారు. తమ బిడ్డలకు నాగేంద్రుని పేరు పెట్టుకుంటారు. సుబ్రహ్మణ్యం, ఫణి, నాగేంద్ర, కార్తికేయ వంటి పేర్లు ఇలాగే వచ్చాయి. వీటితోపాటు తమ తప్పుల్ని మన్నించమని వేడుకుంటారు.

నాగుల చవితి - ఆధ్యాత్మిక ప్రబోధం

మానవ శరీరమనే పుట్టకు తొమ్మిది రంధ్రాలు ఉంటాయి. వాటినే నవరంధ్రాలు అంటారు. మానవ శరీరంలో నాడులతో నిండి ఉన్న వెన్నెముకను 'వెన్నుపాము' అని అంటారు.

అందులో కుండలినీశక్తి మూలాధారచక్రంలో 'పాము' ఆకారంలో ఉంటుందని 'యోగశాస్త్రం' చెబుతోంది. ఇది మానవశరీరంలో నిద్రిస్తున్నట్లు నటిస్తూ, కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే విషాల్ని గ్రక్కుతూ, మానవునిలో 'సత్త్వగుణ' సంపత్తిని హరించి వేస్తుందని, ఈ కారణంగా నాగులచవితి రోజున సర్పారాధన చేసి, పుట్టలో పాలు పోస్తే

మానవునిలో దాగివున్న విషసర్పం మాయమవుతుందని కొందరి విశ్లేషణ. నమ్మిక.

జీవితం నిరంతరం కొనసాగే ప్రక్రియ అనగా 'నాగం'. సర్పము హృదయభాగంతో పాకుతూ ఉంటుంది. ఈ భాగాన్ని 'ఉరా' అంటారు కావున సర్పానికి 'ఉరగము' అని కూడ పేరు. ఉరమున ఉన్న మనస్సు చెప్పినట్టు నడిచే వాళ్ళమైన మనమూ 'ఉరగముల'మే.

సర్పం తాను నిరంతరం సాగుతూ మన జీవన క్రమంలోని వివాహం, సంతానంవంటి జీవన ఘట్టాలను అవరోధపరస్తుంది. కాబట్టి, కార్తికమాసంలో నాగులను ఆరాధిస్తారు.

అగ్ని దేవతగా ఉండేది కార్తికమాసములోనే. మన జీవనానికి కావాల్సిన ఉత్సాహం, ఉత్తేజం వంటివి తేజస్సు వల్ల కలుగుతాయి. వీటిని సూర్యుడు, చంద్రుడు అందిస్తారు.

శ్రీహరికి శయ్య, శంకరునికి ఆభరణము కూడా సర్పమే. కావున నాగులను ఆరాధించడం వలన హరిహరులను సేవించిన ఫలం దక్కుతుంది.

కార్తికమాసమంతా ఇంట్లో నాగప్రతిమను ఆరాధిస్తూ, నాగస్తుతినిచేస్తే పరమాత్మ అనుగ్రహిస్తాడు. కార్తికమాసం నెల

వైకుంఠపాళి
:: 23 - సమాధానాలు ::

	1 భ	2 గీ	ర	3 థ	ప్ర	4 య	త్నం	
5 సే		తం		ర		తి		6 శై
7 నా	కం		8 య	యా	తి		9 హే	ల
ని		10 ఏ		త్ర		11 ఆ		జ
	12 డో	లి	క		13 సు	ర	భి	
14 ము		క		15 ని		భి		16 ని
17 స	ఖి		18 మా	యా	వి		19 ఛా	య
లి		20 ఓ		వ		21 ఖ		తి
	22 ఊ	ర్మి	ళా	దే	వి	ని	ద్ర	

భర్తృహరి సుభాషితం

నీచులు విఘ్నాలు వస్తాయన్న భయంతో పనికి పూనుకోరు. మధ్యములు పని ప్రారంభించి.... విఘ్నాలు ఎదురైతే వదిలేస్తారు. ధీరులు ఎన్ని ఆటంకాలు కలిగినా.... పూనుకొన్నపని నెరవేరేవరకూ వదలనే వదలరు.

రోజులు కాకపోయినా కనీసం కార్తిక శుద్ధ చవితినాడు నాగులను ఆరాధించాలి. చవితి అంటే నాల్గవది అనగా ధర్మార్థ కామమోక్ష పురుషార్థాల్లో నాల్గవది మోక్షం.


కాబట్టి, కార్తిక శుద్ధ చవితి రోజున నాగులను ఆరాధిస్తే మోక్షం లభిస్తుంది. అంటే జీవితంలో వచ్చిన కష్టాల నుండి విముక్తులవుతాము.

నాగులకు పాలు పోయడంలోని అంతరార్థం

పాలు స్వచ్ఛతకు ప్రతీక. పాలను వేడి చేసి చల్లపరచి, దానికి కొద్దిగా మజ్జిగ చేరిస్తే పెరుగవుతుంది. పెరుగును చిలకగా వచ్చిన మజ్జిగ నుంచి వచ్చే వెన్నను కాస్తే నెయ్యి తయారవుతుంది. ఇలా వచ్చిన నేతిని మనం యజ్ఞంలో హవిస్సుగా ఉపయోగిస్తాం.

అదేవిధంగా, మన బ్రతుకనే పాలను జ్ఞానమనే వేడితో కాచి, వివేకం అనే మజ్జిగ కలిపితే సుఖమనే పెరుగు తయారవుతుంది. ఈ పెరుగును ఔదార్యమనే కవ్వంతో చిలకగా శాంతి అనే మజ్జిగ లభిస్తుంది. ఈ మజ్జిగను సత్యం, శివం, సుందరం అనే మూడు వేళ్ళతో కాస్త వంచి తీస్తే సమాజ సహకారం అనే వెన్న బయటకు వస్తుంది. ఆ వెన్నకు భగవంతుని ఆరాధన అనేజ్ఞానాన్ని జోడిస్తే త్యాగం, యోగం, భోగం అనే మూడురకాల నెయ్యి ఆవిర్భవిస్తుంది. ఇదే సకల వేదాలసారం. సకల జీవనసారమైన పాలను జీవనానికి ప్రతీక అయిన నాగులకు అర్పించడంలోని అంతరార్థం.

"దేవాః చక్షుషా పుంజానాః భక్తాన్ పాలయంతి" అనేది ప్రమాణ వాక్యం. అంటే, దేవతలు ప్రసాదాన్ని చూపులతోనే ఆరగిస్తారని అర్థం. పాములు పాలు తాగవనే అపోహతో పాలు పోయడం మానకుండా కొద్దిగా పాలను పుట్టలో పోసి, మిగిలిన పాలను ప్రసాదంగా స్వీకరించాలి.



కార్తికదీపాల ఆనందహేల

– శ్రీ ఎం.సి. శివశంకరశాస్త్రి

కార్తికమాసం వచ్చిందంటే అందరిలో హడావిడి కన్పిస్తుంది. ఉత్తరభారతంలో ఈ మాసానికి అంతగా ప్రాముఖ్యత కనిపించదు. దక్షిణాదిన ముఖ్యంగా మనరాష్ట్రంలో కార్తికానికి అత్యధిక ప్రాధాన్యత ఉంది.

నోములు, వ్రతాలు ఆచరిస్తారు ముత్తైదువులు. పురాణపఠనం చేస్తారు వృద్ధులు. వనభోజనాల సరదాలతో ఈ నెలంతా భక్తితోను, ఆనందంతోను గడపడాన్ని చూడగలం. వనభోజన వేడుకలతో పల్లె ప్రాంతాల్లోని తోటలు పట్టణప్రాంతాల్లోని పార్కులు కళకళలాడుతూంటాయి.

ఇక దేవాలయాల సంగతి చెప్పనవసరం లేదు. ముఖ్యంగా శివకేశవాలయాల్లో భక్తులసందడి అంతా ఇంతా కాదు. కార్తిక మాసానికి ఆదిదేవుడు దామోదరుడని కొందరంటే శివుడని మరికొందరంటారు. ఎవరేమన్నా ఈ నెలంతా భక్తిమయమయిందే.

కార్తికమాసంలో సూర్యభగవానుడు తులారాశిలో ఉండగానే వేకువజాముననే నిద్రలేచి చిత్తశుద్ధితో స్నానం ఆచరించాలి. దానధర్మాలు, దేవతార్చనలు చేయాలి. దీనివల్ల అనంతమయిన పుణ్యఫలం కలుగుతుంది. ఈ మాసమంతా విష్ణుసహస్రనామార్చన, శివలింగార్చనలు చేస్తే మంచి పుణ్యప్రాప్తి కల్గుతుంది.

గంగేచ యమునే చైవ గోదావరి సరస్వతి, నర్మదే సింధు కావేరి జలేఽస్మిన్ సన్నిధిం కురు- ఈ శ్లోకాన్ని స్నానం చేస్తూ పఠిస్తే పుణ్యనదీజలాల్లో స్నానమాచరించినట్టేనని పురాణాలు చెబుతున్నాయి. రావిచెట్టు వద్ద కూర్చుని పురాణాన్ని పఠించినా, విన్నా, శివవిష్ణ్వాలయాలయందుగాని, తులసికోటవద్దగాని దీపారాధన చేస్తే శుభాలు కలుగుతాయి. ఈ మాసంలో దీపదానం మహాప్రశస్తమయింది. సూర్యాస్తమయమందు సంధ్యచీకట్లలో శివకేశవుల సన్నిధిలో దీపాన్ని వెలిగించినవారు సర్వపాపహరులై వైకుంఠప్రాప్తి పొందుతారు.

సర్వజ్ఞాన ప్రదం దీపం సర్వసంపత్ సుఖావహం।
దీపదానం ప్రదాస్యామి శాంతిరస్తు సదామమ॥



– అని స్తోత్రం చేస్తూ దీపదానం చేయాలని పురాణాలు పల్కుతున్నాయి. అన్నివిధాల జ్ఞానాన్ని కలుగజేసే, సకల సంపదలను ఇవ్వగలిగే ఈ దీపాన్ని దానమిస్తున్నాను. శాంతిని ప్రసాదించమని భావార్థం. ఈ మాసంలో ఉసిరిచెట్టు క్రింద సాలగ్రామాన్ని ఉంచి భక్తితో పూజించి, అన్నదానం చేస్తే మనం చేసిన పాపాలు నశించిపోతాయి. కార్తికమాసమంతా పూజలు చేయలేనివారు ఒక్క సోమవారవ్రతమైనా ఆచరిస్తే మాసఫలం దక్కుతుందని కార్తిక పురాణం చెబుతుంది.



ఆషాఢ శుద్ధ దశమి రోజున విష్ణువు లక్ష్మీదేవి సహితంగా శేషశయ్యపై పవళించి తిరిగి కార్తికశుద్ధద్వాదశి నాడు లేస్తాడు. ఈ మధ్య కాలాన్ని "చాతుర్మాస్యం"గా వ్యవహరించటం జరుగుతుంది. ఈ సమయాన చేసే వ్రతాలు విష్ణుదేవునికి ప్రీతికరం.

కావున కార్తికశుద్ధ పౌర్ణమి రోజున కానీ, ఏకాదశి రోజునకానీ లేదా ద్వాదశి నాడుకానీ పూర్ణోపవాసముండి కేశవుని పూజిస్తే సంపదలు కల్గుతాయి. పౌర్ణమి రోజున దీపారాధన చేస్తే సకలపాపాలూ హరించుకుపోతాయని భక్తులు నమ్ముతారు.

కార్తికమాసమంతా హిందువులు దీపాలు వెలిగించి ఇంటి సింహద్వారానికి రెండు ప్రక్కలా అలంకరిస్తారు. కార్తికశుద్ధ ద్వాదశినాడు 'తులసీవ్రతం' చేసి పూజానంతరం బాణాసంచా కాల్చటం కూడా జరుగుతుంది.

ప్రత్యేకంగా స్త్రీలు 365 వత్తులుచేసి ఏకాదశి, ద్వాదశి, పౌర్ణమి తిథులలో ఆవు నేతితో దేవాలయాల్లోను, తులసి కోటల దగ్గర దీపాలు వెలిగిస్తారు. పలుచోట్ల జ్వాలాతోరణంగా ఆకాశ దీపాలను భక్తి శ్రద్ధలతో వెలిగిస్తారు. కార్తికమాసంలో పౌర్ణమి ముందురోజు **కార్తికదీపం** పండుగ వస్తుంది. దేవాలయాల్లో ఈ పండుగరోజు విశేషంగా ఉంటుంది.

కార్తికదీపం రోజు తిరుపతిలోని కపిలతీర్థంలో కొండ పైన దీపాన్ని వెలిగిస్తారు. ఈ దీపాన్ని రెండురోజులు వెలిగిస్తారు. ఈ దీపం చూడడానికి అనేకమంది భక్తులు ఈ తీర్థానికి వస్తారు. కార్తికదీపం స్త్రీలకు సంబంధించిన పండుగ. కాబట్టి అనేక మంది స్త్రీలు కపిలతీర్థానికి వస్తారు. అక్కడ దీపాలను వెలిగించి పూజలను చేస్తారు. కార్తికమాసం కైవల్యానంద మార్గం.



23 వైకుంఠపాళి

■	1	2		3		4		■
5	■		■		■		■	6
7		■	8			■	9	
	■	10	■		■	11	■	
■	12			■	13			■
14	■		■	15	■		■	16
17		■	18			■	19	
	■	20	■		■	21	■	
■	22							■

నిర్వహణ శ్రీ టి.ఎస్.జగన్మోహన్

అడ్డం

1)గంగావతరణంకోసం ఓ మహనీయుని కృషి(7); 7)స్వర్గం(2); 8)రామాంజనేయ యుద్ధానికి కారకుడు(3); 9)వెన్నెల(2); 12)పల్లకి(3); 13)కామధేనువు(3); 17)చెలి(2); 18)దుందుభిపుత్రుడు(3); 19)సూర్యపత్ని(2); 22)రామాయణంలో ఈమె సుషుప్తి లోకప్రసిద్ధి పొందింది(7)

నిలువు

2)పాట(2); 3)పూరీలోని ఉత్సవం తారుమారైంది(4); 4)ముని(2); 5)షణ్ముఖుడు(3); 6)పార్వతి(3); 10)రాజు(3); 11)సుప్రసిద్ధ కర్ణాటక సంగీతపు రాగం(3); 14)బలరాముడు(3); 15)శుక్రసుత క్రింది నుంచి పైకి వచ్చింది(4); 16)మేరుపుత్రి(3); 20)సహనం(2); 21)గని(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



చూపు నిచ్చిన దేవుడు

– శ్రీ వేంకట కృష్ణ

మాది తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి నగరం. మా నాన్నగారు ఉద్యోగ రీత్యా కోస్తా ఆంధ్రలోని వివిధ పట్టణాల్లో ఉండి, ఆయన ఉద్యోగవిరమణ (తర్వాత) నాటికి స్వగ్రామమైన రాజమండ్రిలో మేము స్థిరపడ్డాము. మా అమ్మగారికి డెభ్బై అయిదు సంవత్సరాల పైబడి వయస్సు. వృద్ధాప్యం కావడంతో ఆమె రెండు కళ్ళలో శుక్లాలు తయారయ్యాయి. రాజమండ్రిలో పేరొందిన కళ్ళ డాక్టరుకి చూపిస్తే, వారు శుక్లాలు ఉన్న సంగతి నిర్ధారణ చేసి, మొదట శుక్లం బాగా పెరిగిన కంటికి 'కేటరాక్ట్' ఆపరేషన్ చేయాలన్నారు. మా అమ్మగారు చాలా భయస్థురాలు. కంటి ఆపరేషన్ అనగానే చాలా జంకారు. అయితే బాగా ఆలస్యం చేసినట్లయితే చూపు పూర్తిగా దెబ్బతింటుందనే డాక్టర్ల సలహాతో, కుటుంబసభ్యులుగా మేము అందించిన ప్రోత్సాహంతో, ఆమె ధైర్యం తెచ్చుకొని కంటి శుక్లాల ఆపరేషన్‌కి సిద్ధమయ్యారు.

మేము నిర్ణయించుకున్న ముహూర్తానికి డాక్టరుగారు, మా అమ్మగారి కంటికి శుక్ల ఆపరేషన్ చేశారు. అయితే, ఆపరేషన్ పూర్తయ్యాక కంటికి కట్టిన కట్టు తీశాక, తనకు ఆ కంటికి ఏమీ కనిపించడము లేదని మా అమ్మగారు చెప్పడంతో మేము చాలా భయపడ్డాము. మా ఇంట్లో అందరమూ తిరుమల వాసుడైన శ్రీవేంకటేశ్వర స్వామి భక్తులము. ఆయనపైనే అంతటి భారమూ వేసి, మా అమ్మగారు ధైర్యంగా కంటి ఆపరేషన్ చేయించుకుంటే, ఇలా జరిగిందేమిటి? అని బాధపడ్డాము. ఆ స్వామిపైనే భారం వేసి మా అమ్మగారికి చికిత్స అనంతర సపర్యలు సాగించాము.

గోవిందుడు అపారకరుణా సముద్రుడు. నమ్ముకున్న వారిని ఆయన ఎన్నటికీ నడి సంద్రంలో వదిలేయడు. ఆపరేషన్ జరిగిన కొద్దిరోజులకి మా అమ్మకు, ఆపరేషన్ జరిగిన కన్ను క్రమంగా కనిపించడం మొదలయ్యింది. చూపు కోల్పోయిందేమో అని మొదట్లో కలత చెందిన మా మనస్సులకు కలిగిన ఆనందానికి అవధుల్లేవు. ఇదంతా సాక్షాత్తూ ఆ వేంకన్న బాబు చలవే అని మేము మనస్ఫూర్తిగా నమ్మాము. అది అక్షరాలా నిజం కూడా.

ఆ తర్వాత మా అమ్మగారి రెండవ కంటిలో కూడా శుక్లాలు పెరగటంతో ఆ కంటికీ ఆపరేషన్ చేయాలని డాక్టర్లు సూచించారు. మొదటి కంటికి ఆపరేషన్ జరిగిన తీరుతో భయం చెందినప్పటికీ, మా అమ్మగారూ, మేమూ ధైర్యం తెచ్చుకొని, ఆ భగవంతుడి పైనే భారం వేసి రెండవ కంటికి కేటరాక్ట్ ఆపరేషన్ చేయించడానికి సిద్ధపడ్డాము.

డాక్టర్లు మా అమ్మగారిని ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్ళారు. బయటవున్న మేమంతా ఆ భగవంతుడి పైనే భారం వేసి, మా ఇలవేల్పు అయిన శ్రీనివాసుణ్ణే ధ్యానిస్తూ ఉన్నాము. ఈసారి ఆ ఆపద్బాంధవుడి దయ వలన, రెండవకంటికి ఎటువంటి ఇబ్బందీ లేకుండా, సులువుగా ఆపరేషన్ పూర్తయింది. కట్టుతీసిన వెంటనే మా అమ్మగారు స్పష్టంగా అన్నీ చూడగలిగారు. ఇది సాక్షాత్తూ ఆ దేవదేవుడు తిరుమలేశుడు అనుగ్రహఫలమే అని మా పూర్తి నమ్మకం.



రెండుకళ్లకీ ఆపరేషన్ జరిగాక, మా అమ్మగారు క్రమంగా కోలుకొంటున్నారు. కళ్లజోడు సాయంతో చక్కగా చదవగలుగుతూ ఉన్నారు. తనయందే విశ్వాసం ఉంచి కొలిచిన వారినీ ఆ పరంధాముడు ఎన్నడూ నిరాశపరచడు. వెంట నుండి తన భక్తులను కాపాడుతూ ఉంటాడు. ఆయన భగవద్గీతలో చెప్పింది కూడా అదే కదా.

ఆ స్వామి అనుగ్రహంతో, త్వరలో శ్రీనివాసుని దర్శించాలనే మా తల్లిగారి కోరికను నెరవేర్చాలని చూస్తున్నాము. తిరుమల, తిరుపతియాత్రకు సిద్ధమవుతున్నాము. తన దివ్య మంగళరూపదర్శన భాగ్యాన్ని మాకు అందించే భారం కూడా ఆ స్వామిపైనే వేసి ఎదురు చూస్తున్నాము.

ఓం నమో వేంకటేశాయ...

నోరు ఉన్నది కదా అని వృథాగా మాట్లాడకూడదు

అట్లతద్దోయ్.. ఆరట్లోయ్...

– శ్రీ డి.ఎస్.దీక్షితులు

ఆశ్వయుజ బహుళ విదియనాడు స్త్రీలు జరుపుకునే పండుగ **'అట్లతద్ది'**. దీనిని **'చంద్రోదయోమావ్రతం'** అని కూడా పిలుస్తారు. పెళ్ళికాని ఆడపిల్లలు ఉత్తమ వరులకోసం... కాపురాలు చేస్తున్న స్త్రీలు తమ భర్తల ఆయురారోగ్యాలకోసం వయసుతో సంబంధం లేకుండా ఈ వ్రతాన్ని ఆచరించటం పరిపాటి. ఆటలు.. పాటలు.. సరదాలు.. ఉపవాసాలు.. ఆరోగ్య నియమాలు.... అన్నీ కలగలిసిన అతివలందరి పండుగ ఇది. అందుకే అష్టాదశవర్ణాలకి అట్లతద్ది అనే నానుడి ఏర్పడింది.

ముందురోజు భోగి

అట్లతద్దికి ముందురోజును భోగి అంటారు. ఉండ్రాళ్ల తద్ది మకరసంక్రాంతి పండుగల ముందురోజున కూడా భోగి అంటారు. ఆశ్వయుజ బహుళ విదియనాడు అట్లతద్ది భోగిని జరుపుకుంటారు. ఆ రోజు స్త్రీలు... కన్నెపిల్లలు... బాలికలు తలంటిస్నానంచేసి చేతులకు... కాళ్లకు గోరింటాకు పెట్టుకుంటారు. ఏడాదిలో మూడు సార్లు ఆషాఢమాసంలో... భాద్రపదమాసంలో వచ్చే ఉండ్రాళ్ల తద్దికి ఆశ్వయుజమాసంలో వచ్చే అట్లతద్దికి గోరింటాకును స్త్రీలు సంప్రదాయంగా పెట్టుకుంటారు.

గోరింటాకును సంస్కృతంలో 'నఖరంజని' అంటారు. గోళ్ళకి రంగును ఇచ్చేది అని అర్థం. గోరింటాకు అంటే ఆడవాళ్లకి ఎంతో ఇష్టం. ముళ్ళు గుచ్చుకోకుండా నేర్పుగా, అప్యాయంగా, ఆనందంగా, అలవోకగా చెట్టునుంచి ఆకుని కోసి, అందులో కాచు.... కాకి బొడ్డు... పోక చెక్క.... చిల్లపెంకు వేసి మెత్తగా నూరి పెట్టుకుంటారు. అప్పుడు బాగా ఎర్రగా పండుతుంది. అరచేతిలో మందారంలా పూస్తుంది గోరింట. దీనిని పెట్టుకోవడంవల్ల గోళ్ళు, పిప్పిగోళ్ళు కాకుండా ఆరోగ్యంగా ఉంటాయి. ఎంత బాగా గోరింటాకు పండితే వాళ్ళ భర్త వాళ్ళను అంత బాగా ప్రేమిస్తాడని నమ్మకం. దీనిని దృష్టిలో పెట్టుకునే 'ప్రేమగల వారికంటు గోరింట' అనే నానుడి పుట్టింది.

అట్లతద్ది నాడు ఏం చేస్తారు?

తొలికోడి కూయగానే లేచి ఉట్టిక్రింద కూర్చుని ముత్తైదువులతో కలిసి స్త్రీలు చద్ది భోజనం చేస్తారు. ఈ భోజనంలో కంది పచ్చడి, గోంగూరపచ్చడి, పొట్లకూయకూర, నువ్వులపొడి, ఉల్లిపాయ పులుసు, కమ్మటి నెయ్యి, గడ్డ పెరుగు తప్పకుండా ఉంటాయి. తర్వాత తాంబూలం వేసుకుంటారు. తాంబూలం ఎంత ఎర్రగా పండితే వాళ్ల భర్తలు వాళ్ళను అంత బాగా ప్రేమిస్తారని నమ్ముతారు. కొత్త బట్టలు కట్టుకుంటారు. అప్పటి నుంచి తెల్లారేవరకూ ఆట పాటలతో కాలక్షేపం చేస్తారు. పగలంతా ఉయ్యాలలూగుతారు. తోటల్లో పెద్ద పెద్ద చెట్లకి ఈ ఉయ్యాలలు వేస్తారు.

అక్టోబరు -7 అట్లతద్దె సందర్భంగా...

పగలంతా భోజనం చెయ్యరు. పెద్దవాళ్ళు గవ్వలు, గచ్చకాయలు, పచ్చీసులు, వామనగుంటలు ఆడుతారు. చిన్న పిల్లలు తొక్కుడుబిళ్ళ ఆడుతారు.

అట్లతద్దోయ్... ఆరట్లోయ్
ముద్దపప్పోయ్ మూడట్లోయ్
సీమ పచ్చిమిరపకాయ
చిర్రో చిర్రో
నీమొగుడు కొడితే
మొర్రో మొర్రో

అని పాటలు పాడుతూ తోటివారిని అల్లరిపెట్టడం ఈ పండుగలో ఒక చమత్కార సన్నివేశం.

ఉమాదేవి ఆరాధన

పగలంతా ఉపవాసంచేసి సాయంకాలమయ్యేసరికి స్నానాలుచేసి శుచిగా అలంకరించుకుని ఆడవాళ్ళు జట్లు జట్లుగా దొడ్లవెంట, తోటల వెంట తిరుగుతూ ఉమాదేవి పూజకు కావలసిన పూలను సేకరిస్తారు. చంద్రుడు ఉదయించిన తర్వాత చేసే వ్రతం కనుక దీనికి చంద్రోదయ ఉమావ్రతం అనే పేరు వచ్చింది. ఉదయించిన చంద్రుణ్ణి చూసి షోడశోపచారాలతో ఉమాదేవిని భక్తి శ్రద్ధలతో మహిళలు పూజిస్తారు. తొమ్మిది అట్లు నైవేద్యంగా సమర్పించి... ముత్తైదువులకు తొమ్మిది అట్లు వాయనంగా ఇస్తారు.

అమ్మవారి దగ్గరపెట్టి పూజించిన తొమ్మిది పువ్వుల తోరాన్ని చేతికి కట్టుకుంటారు. తర్వాత ముత్తైదువులకి భోజనం పెట్టి తాము భోజనం చెయ్యడంతో వ్రతం పూర్తవుతుంది. పూజ అయిన తర్వాత వ్రతకథను చదువుకుని ముగించటంకూడా ఆచారంలో ఉంది.

భోగినాడు తెల్లారకట్ల ఉట్టి క్రింద చద్దిభోజనం చెయ్యక పోయినా.... తాంబూలం వేసుకోకపోయినా.... గోరింటాకు పెట్టుకోకపోయినా... ఉయ్యాల ఊగకపోయినా.... అట్లతద్ది నోము నోచకపోయినా.... ఉమాదేవి కరుణిస్తుంది. ఆ నమ్మ కమే కొండంత అండగా అట్లతద్ది వ్రతాన్ని ఆచరింపజేస్తోంది. దేవులపల్లి వేంకటకృష్ణ శాస్త్రిగారు ఈ పండుగను 'ఆటలతద్ది' అన్నారు.

బాలప్రబోధం

గురుదేవోభవ!

- శ్రీ అప్పాల శ్యామప్రణీత్‌శర్మ అవధాని

పూర్వం దీపకుడనే నైష్ఠిక బ్రహ్మచారి ఉండేవాడు. అతడొకనాడు శాస్త్రాలలో చెప్పబడిన ఒక సూక్తిని చదివాడు.

"పతివ్రతకు భర్త, పుత్రునికి తల్లిదండ్రులు, శిష్యునికి గురువు దైవంతో సమానం. వీరిని మించిన దైవం లేదు. వీరి సేవను మించిన తీర్థాలు, వ్రతాలు, ఉపవాసాలు లేవు. తరించేందుకు ఇదే అతిసులభ మార్గం" అని దాని అర్థం. దాన్ని చదివిన వెంటనే తనకూ ఓ గురువు కావాలని వెంటనే గురువును అన్వేషించేందుకు బయలుదేరాడు దీపకుడు. ఇలా గురువు అన్వేషణను కొనసాగిస్తూ అన్ని పవిత్ర క్షేత్రాలు తిరుగు తుండగా పవిత్ర గోదావరీనదీ తీరంలో వేదధర్మ మహర్షివారి ఆశ్రమం ఉందని, ఆయన సకల వేదవేదాంగాలు చదివిన వాడని, ఉత్తమ గురువని చాలామంది చెప్పగా విని ఆయన దగ్గరకుపోయి వారికి సాష్టాంగ నమస్కారం చేసి తనను శిష్యుడిగా చేర్చుకోమని ప్రార్థించాడు. వినయవంతుడైన దీపకుణ్ణి అనేకరకాలుగా పరీక్షించి శిష్యునిగా స్వీకరించాడు వేదధర్ముడు. గురుసేవా ప్రభావంతోపాటుగా, తన చిత్తశుద్ధి, ఏకాగ్రతల వల్ల చాలా తక్కువ సమయంలోనే దీపకుడు సకల శాస్త్రాలు నేర్చి, అనన్య గురుసేవా నిరతుడై ప్రకాశించాడు.

శిష్యుని విద్యాతేజస్సు చూసి వేదధర్ముడు ఒకనాడు "కుమారా! నేను పూర్వజన్మలలో చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకున్నాను. కానీ రెండు భయంకరమైన పాపాల ఫలితాన్ని అనుభవించవలసి ఉంది. చేసిన కర్మ చెడని పదార్థముకదా! నేను అతిపురాతనము, సనాతనము, పవిత్రమైన, సాక్షాత్తూ శంకరుడు కొలువైన కాశీ క్షేత్రంలో నా పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలని అనుకుంటున్నాను. పుణ్యక్షేత్రాలలో ఏ కార్యానికైనా ఫలితం రెండింతలు కలుగుతుందని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి కదా!

నేను ఆ పాపాలను ప్రాయశ్చిత్తార్థం ఆవాహన చేయగానే నాకు భయంకరమైన కుష్ఠురోగం వస్తుంది. శరీరమంతా చీము నెత్తురు కారుతుంటుంది. వికారమైనరూపంతోపాటు అంధత్వము మొదలైన వికృతాలు కనిపిస్తాయి. ప్రస్తుతం నాలోని సహనం, సాధుత్వంలాంటి సద్గుణాలు అన్నీ నశిస్తాయి. కఠినాత్ముడనై ఇతరుల సేవలకై దీనంగా ఎదురు చూస్తుంటాను. అట్టి దుస్థితిలో నీవు నాకు సేవ చేయగలవా?" అని అడిగాడు వేదధర్ముడు.

గురుసేవనే పరమభాగ్యమని త్రికరణశుద్ధిగా నమ్మిన దీపకుడు "గురుదేవా! మీరెందుకు ఆ బాధలు అనుభవించడం? నేను మీ పాపాలను నాపై ఆవహింపచేసుకొని పాపఫలితాన్ని నేనే అనుభవిస్తాను. నాకా అవకాశాన్ని ప్రసాదించండి" అని అన్నాడు.

"దీపకా! నీ వంశాన్నంతా దీపింపచేయగల వాడవైన నీ మాట నేనూహించిందే! నామీద నీకున్న భక్తి అనన్య సామాన్యమైంది. కానీ ఎవరు చేసిన కర్మలకు వారే బాధ్యులు కదా! పుణ్యమైనా పాపమైనా చేసిన ఫలితాన్ని అనుభవించక తప్పదు కదా! నా పాపాలకు నేను ప్రాయశ్చిత్తం చేసుకుంటేగాని ఈశ్వర సాన్నిధ్యాన్ని పొందలేను" అని వేదధర్ముడు చెప్పాడు. గురు ఆజ్ఞప్రకారమే చేశాడు దీపకుడు. ఇద్దరూ మణికర్ణికా ఘట్టానికి ఉత్తరంగా ఉన్న కమలేశ్వర మహాదేవ మందిరం వద్దకు చేరి అక్కడ బస ఏర్పాటు చేసుకున్నారు. కాశీ విశ్వనాథునికి, అన్నపూర్ణాభవానికి పూజలుచేసి పాపాల ఆవాహన చేశాడు వేదధర్ముడు. ముందు చెప్పినట్టే వికృత రూపాన్ని పొందాడు.

గురువుగారి దుస్థితి చూసి ఎంతో బాధపడ్డాడు దీపకుడు. రోజూ చీము నెత్తురు తుడిచి కట్టు కట్టి మలమూత్రాదులను కడిగి గురువుగారిని శుభ్రపరిచే వాడు. ప్రతిపూట దీపకుడు తెచ్చిన భిక్షను తానే తినేసి "కొంచమే తెచ్చావెందుకు" అని నిష్ఠూరాలాడేవాడు వేదధర్ముడు. అతడెంత కోపించినా గద్దించినా ధర్మనిష్ఠతో నిరంతర గురుసేవ చేసి ఆనందపరవశుడయ్యేవాడు దీపకుడు.

దీపకుని అసమాన గురుభక్తికి మెచ్చి పరమశివుడు ప్రత్యక్షమైనాడు.


"వత్సా! నీ అనన్య గురుసేవా దీక్షకు మెచ్చినాను. ఏమి వరం కావాలో కోరుకో" అని అనగా, గుణనిధి అయిన

ఇతరులను బెదిరించి సంపాదించిన సంపద త్వరలో నశిస్తుంది

దీపకుడు "స్వామీ! నాకు ఈ లోకంలో గురుసేవ తప్ప ఏదీ తెలియదు. వారి కోరికేమిటో కనుక్కొని చెప్తాను" అని అన్నాడు దీపకుడు. గురువుగారికీ విషయం చెప్పి "గురుదేవా! మీకు స్వస్థత కోరుతాను" అని అన్నాడు. అప్పుడు వేదధర్ముడు "నాయనా! ఎవరు చేసిన పాపాలకు ఫలితం వారు అనుభవిస్తేనే పోతాయి" అని చెప్పాడు.

మరునాడు విశ్వనాథుని ఆలయానికి వెళ్ళిన దీపకుడు ఎలాంటి వరాన్ని కోరకుండా కేవలం దర్శనం మాత్రమే చేసుకొని వచ్చేశాడు. శివుడు దీపకుణ్ణి చూసి మురిసిపోయి పార్వతీదేవితో అతని విషయం చెప్పి సంబరపడిపోయాడు. తరువాత నిర్వాణ మండపంలో ఉన్న శ్రీమన్నారాయణునికి సమస్తదేవతలకు దీపకుని సంగతి చెప్పి పొగిడినాడు శివుడు.

దాంతో ఈసారి మహావిష్ణువు దీపకుని ముందు ప్రత్యక్షమై "పరమశివుని మెప్పించిన నీ గురుభక్తి అసామాన్యం. నీ మనోభీష్టాన్ని కోరుకో" అని అన్నాడు. శ్రీమన్నారాయణునికి సాష్టాంగ వందనం చేసి ఆనందాశ్రువులతో "స్వామీ! నాకు అచంచలమైన గురు భక్తిని ప్రసాదించు" అని అడిగాడు దీపకుడు."తథాస్తు" అని దీవించి దీపకుని కృతార్థుని చేసి, గురువుకు ముక్తిని ప్రసాదించాడు మహావిష్ణువు. ఆ విధంగా అచంచలమైన గురుభక్తితో అఖండ కీర్తిని పొందాడు దీపకుడు!



గురువుపట్ల నిశ్చల భక్తి కలిగి ఉండి, ధర్మం తప్పక గురువును సేవిస్తే సకల దేవతలనూ సేవించిన ఫలితం వస్తుంది. దీపకుడు తన గురుసేవా నిరతితో త్రిమూర్తులతో సహా సమస్తదేవతల అనుగ్రహాన్ని పొందాడు. అదేవిధంగా, కర్మపాశం తెగనిది. పాపకర్మలకు ప్రాయశ్చిత్తం ఎంత భయంకరంగా ఉందో మనం ఈ కథలో చూసాం కదా! కాబట్టి తప్పుడుపనులు ఎప్పుడూ చేయరాదు అన్న మాట నిజమైనదే కదా!

ప్రబోధనైకాదశి

– శ్రీమతి శోభావతి

ఆషాఢమాసంలోని శుక్లపక్షంలో ఏకాదశి శయనైకాదశిగానూ, తొలిఏకాదశిగానూ ప్రసిద్ధం. ఈ పుణ్యదినాన మహావిష్ణువు క్షీరసాగరంలో శేషశయ్యపై యోగనిద్రలోకి జారుకొంటాడని సంప్రదాయం చెబుతోంది. ఇలా నాలుగు నెలల పాటు నిద్రలోకి జారుకొనేకాలాన్ని చాతుర్మాస్యాలని పిలుస్తారు. దేవతలు నిద్రించే ఈ సమయంలో కేవలం వ్రతాచరణలూ, ఉపవాసాలూ, జపతపోహోమాదులు మాత్రమే నిర్వహించాలనీ, ఇతరమైన వైదిక కర్మలేవీ చేయరాదనీ ధర్మశాస్త్రాలు ప్రబోధిస్తున్నాయి. చాతుర్మాస్యాలు ముగిసే రోజు కార్తికశుక్ల ఏకాదశి. దీనినే 'ప్రబోధనైకాదశి' అనీ, 'ఉత్థానఏకాదశి' అనీ పిలుస్తారు. ఈ పుణ్యదినాన మహావిష్ణువు యోగ నిద్రనుండి మేల్కొంటాడు. కనుక దేవతలకు ప్రబోధ సమయం.

మాసాలలో కార్తికానికి విశేష ఫలం ఉంది. స్కాంద పురాణంలో ఈ మాసాన్ని గూర్చి–

న కార్తిక సమో మాసో న కృతేన సమం యుగమ్ ।
న వేద సదృశం శాస్త్రం న తీర్థం గంగయా సమమ్ ॥

అని ప్రబోధింపబడింది. అంటే కార్తికంతో సమానమైన మాసం మరొకటి లేదు. కృతయుగంతో సమానమైన యుగమూ లేదు. వేదంతో సమానమైన జ్ఞానరాశి మరొకటి లేదు. గంగానదితో సమానమైన నది మరొకటి లేనేలేదని అర్థం.

అక్టోబరు –30
ప్రబోధనైకాదశి సందర్భంగా...

ఇంతటి విశిష్టత గల కార్తిక మాసం మహావిష్ణువుకు ఎంతో ప్రీతిపాత్రమైంది. కార్తిక శుద్ధ ఏకాదశినాడు దేవాలయాలలో దీపాలు వెలిగించి దీపారాధనలు చేస్తారు. ఇందులోని పరమార్థం మేల్కొన్న దేవతలకు మంగళహారతులు పట్టడమే. దీపం జ్ఞానానికి ప్రతీక కనుక దీపాన్ని ప్రజ్వలింపజేసినట్లే ప్రతి మనిషీ ఆత్మజ్ఞానాన్ని వెలిగింపజేయాలనే సందేశం వ్యక్తమౌతుంది. మేలుకొన్న దేవతలను ప్రసన్నం చేసుకోవడానికీ, దీపాల వెలుగులో దేవతల దివ్యమంగళ విగ్రహాలను దర్శించడానికీ దీపారాధన దోహదం చేస్తుంది. ప్రబోధనం (మేలుకొలుపు) లోని పరమార్థం ఇదే.

నాలుగునెలల దేవతల నిద్రకారణంగా ఆచరించకుండా పోయిన అభ్యుదయకర్మలన్నీ ప్రబోధనైకాదశి నుండే ప్రారంభం కావడం విశేషం. కేవలం మానవులకే గాక సకలచరాచరాలకూ క్షేమాన్ని కలిగించే రోజుగా ప్రబోధనైకాదశి కోట్లమంది జనుల హృదయాలలో భక్తి భావనలను మేల్కొలిపి, చరితార్థమౌతోంది.

శ్రీవైష్ణవ భక్తి కుసుమం - మణవాళ మహాముని

- శ్రీ సి.నాగసుదర్శన్ రావు

చేరి కొల్వరో ఈతడు శ్రీదేవుడు ।
యీ రీతి శ్రీ వేంకటాద్రి నిరవైన దేవుడు ॥

అని అన్నమయ్య కీర్తించినట్లుగా, భక్తుల హృదయాలలో శ్రీవైష్ణవతత్త్వాన్ని నెలకొల్పి మనకు ధర్మమార్గాన్ని సుగమం చేసిన ఎందరో మహాపురుషులలో శ్రీవైష్ణవాచార్యులు అగ్రగణ్యులు. వారి బోధనలతో, శ్రీవైష్ణవ సంప్రదాయం భక్తిపారవశ్యంతో పరవళ్ళు త్రొక్కింది. ఆ ఆచార్య పరంపరలో మణవాళ మహాముని ఒక ఆణి ముత్యంగా ప్రకాశించాడు. ఆయన ప్రాతఃస్మరణీయుడు. ఈయన ఒక సుప్రసిద్ధ శ్రీవైష్ణవాచార్యుడుగా, ఆదిశేషాంశగా ప్రసిద్ధి చెందాడు.

1370వ సంవత్సరంలో తిరుణల్వేలి సమీపంలో నున్న-ఆళ్వార్ తిరునగరి గ్రామంలో దాసర్ అన్నర్ మరియు శ్రీరంగ నచ్చియార్ దంపతులకు వీరు జన్మించారు. పరమభాగవతోత్తములైన తన తండ్రి గారివద్ద మరియు తాతగారి వద్దనే వేదశాస్త్రాలని, దివ్యప్రబంధాల్ని అధ్యయనం చేశారు. ఏకసంథాగ్రాహి అయిన మణవాళ్ చిన్న వయసులోనే వేదాంతర్గతమైన అన్ని గ్రంథాలపై మంచిపట్టు సాధించాడు. అంతేగాక శ్రీవైష్ణవాచార్యుడైన తిరువైమోళి పిళ్ళై ప్రబోధాలకి తన్మయుడై ఆయన ప్రియశిష్యుడు కావడం విశేషం. పువ్వు పుట్టగనే పరిమళిస్తుంది కదా!

ఆచార్యుడైన తిరువైమోళి పిళ్ళై వద్ద అన్ని ధర్మాల్ని అభ్యసించటమేగాక, ఆయన మన్ననలనుకూడా పొందాడు, ఒకసారి, తన గురువుగారైన తిరువైమోళి పిళ్ళై, ఆళ్వార్ తిరునగరి గ్రామంలో ఒక దేవాలయం కట్టి, భగవత్ రామానుజాచార్యుల విగ్రహాన్ని ప్రతిష్ఠించటానికి నిర్ణయించి, మణవాళ్‌కు ఆ బాధ్యతని అప్పగిస్తాడు, తన గురువుగారు చెప్పినట్లుగా ఆ బాధ్యతను చక్కగా నిర్వర్తించటమే గాక, 20 శ్లోకాలతో కూడిన 'యతిరాజ వింశతి' అనే ఒక అద్భుతమైన ప్రబంధాన్ని రచిస్తాడు మణవాళ్. ఈ వింశతిలో ఆ శ్రీరంగ నాథుణ్ణి శరణాగతి కోరుకుంటాడు. "తన వద్దకు ఎటువంటి దుర్గుణాలు చేరకుండా, జితేంద్రియుడినై, ఓ స్వామీ, నిరంతరం నీ పాదాలచెంతనే నా మనస్సు నిమగ్నం అయ్యేటట్లుగా అనుగ్రహించమని" వేడుకుంటాడు. ఈ ప్రబంధాన్ని రామానుజ నూత్రంతాది సారాంశమని కొనియాడుతూ, మణవాళ్‌కు 'యతీంద్ర ప్రవర' అనే బిరుదునిస్తారు, ఆచార్య తిరువైమోళి పిళ్ళై. భగవంతుణ్ణి ఏమని కోరుకోవాలో తెలియచేస్తుంది ఈ దివ్య ప్రబంధం.

ఇదే భక్తితత్త్వాన్ని మనము బమ్మెర పోతనామత్యుని శ్రీమహాభాగవతములో, దశమస్కంధంలో మాలాకారుడైన సుధా మునిలో కూడా చూడవచ్చును.

కంస సంహారానికి బయల్దేరిన ఆ శ్రీకృష్ణభగవానుడు, దారిలో, మంచి సువాసనలు వెదజల్లుతున్న, సుధాముడు అనే పూలు అమ్మే వాని ఇంటికి వెళ్తాడు. శ్రీకృష్ణదర్శనంతో, పొంగిపోయి తాను చేసిన పూలమాలలతో ఆ పరంధాముణ్ణి సత్కరిస్తాడు, ఆతని భక్తికి మెచ్చిన ఆ భగవానుడు సుధాముణ్ణి ఏం కావాలో కోరుకోమంటాడు, అప్పుడు ఆ పూలవాడు,

నీ పాదకమల సేవయు
నీ పాదార్చకులతోడి నెయ్యమును నితాం
తాపార భూతదయయును
దాపసమందార! నాకు దయచేయఁ గదే!

- అంటూ భక్తిపారవశ్యంతో ఆనందాశ్రుడవుతాడు.

భగవత్ రామానుజాచార్యుల వారిని తన ఆరాధ్యదైవంగా కొలుస్తూ, మణవాళ్ తన గురువుగారు చెప్పినట్లుగా, శ్రీభాష్యం, దివ్యప్రబంధాలని చక్కగా అధ్యయనం చేసి, ఎన్నో ప్రవచనాలు ఇచ్చారు. ఆయన ఉపన్యాసాలకి ప్రభావితులై ఎంతోమంది ఆయన శిష్యులైనారు. వారిలో ఆచార్య వరదార్ ఒకరు, ఆయనే రామానుజ జీయరుగా ప్రసిద్ధి గాంచారు. అంతేకాక శ్రీవైష్ణవ సంప్రదాయంలో ఆయనతోనే జీయర్ మఠం స్థాపింపబడి, ఈ రోజు కూడా అవిచ్ఛిన్నంగా ఆ జీయర్ మఠాచార్యుల భగవత్ సేవలు కొనసాగుతున్నాయి.

శ్రీరంగదేవాలయాన్ని కాపాడుతూ, నాయకత్వం వహించి, తన ప్రవచనాలతో మణవాళ్ ఎనలేని సేవచేసి, మరల ఆ శ్రీరంగ నాథదేవాలయానికి పూర్వవైభవాన్ని తెచ్చిపెట్టారు. అట్లాగే కంచి వరదరాజస్వామిని సందర్శించి, 13 శ్లోకలతో కూడిన 'దేవరాజ మంగళం' అనే మాలికను రచించి, ఆ దివ్య విగ్రహం ముందు కీర్తన చేశారు. ఆయన శ్రీభాష్యంపై చేసిన ప్రసంగాలకు,

25-10-2017వ తేది
మణవాళమహాముని శాత్తుమొఱ సందర్భంగా..

తాను చేసిన పుణ్యాన్ని బట్టి మానవునికి కీర్తి లభిస్తుంది

ముగ్ధులై, తిరువెక్క అనే ఊరులోనున్న శ్రీవైష్ణవదేవాలయములో వ్యాఖ్యానముద్రతో ఉన్న ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించి పరవశులైనారు భక్తులు. తిరిగి శ్రీరంగం చేరుకొని శ్రీశఠకోపజీయర్ వద్ద సన్యాసాశ్రమం తీసుకున్నారు, అప్పటినుండి మణవాళ్‌మహామునిగా ఆ శ్రీరంగనాథుని అనుగ్రహం పొందారు!

ఆ శ్రీరంగనాథుని సంకల్పముతో, నమ్మాళ్వార్ రచించిన తిరువాయిమొళి పై ఒక సంవత్సరం పాటు ప్రవచనాలు చేశారు, ఆ ప్రసంగాల చివరి రోజున సాక్షాత్ ఆ శ్రీరంగనాథుడే ఒక చిన్న బాలపూజారి వలె వచ్చి, ప్రసన్నుడై,

శ్రీ శైలేశదయాపాత్రం ధీ భక్త్యాది గుణార్ణవం ।
యతీంద్ర ప్రవణం వందే రమ్యజా మాతరమ్ మునీం ॥

అంటూ, మణవాళ మహా మునిని తన గురువుగా భావిస్తాడు, అంతే గాక, భక్తి మరియు జ్ఞాన సంపన్నుడైన మణవాళమహాముని ఆయన గురువులైన తిరువైమొళి పిళ్ళై మరియు ఆచార్య సంప్రదాయంలో ప్రథముడు మరియు ఆది శేషాంశ అయిన శ్రీరామానుజాచార్యుల యొక్క సంపూర్ణ అనుగ్రహం కలిగిన వాడుగా, కొనియాడుతూ తన ప్రణతులు తెలుపుతాడు. ఎంతటి భాగ్యశాలి మణవాళమహాముని, తన శరణాగతిమంత్రం చేత ఆ పరంధాముణ్ణి తన హృదయంలో నిలుపుకున్నాడు!!



అంతేగాదు, అన్ని శ్రీవైష్ణవ దేవాలయాలలో, దివ్యప్రబంధం పారాయణం తర్వాత–

శ్రీమతే రమ్యజమాతృ మునీంద్రాయ మహాత్మనే ।
శ్రీరంగ వాసినే భూయాత్ నిత్య శ్రీ నిత్య మంగళం ।

అని చెపుతూ ముగిస్తారు. భగవత్ శ్రీరామనుజాచార్యుల మరియు ఆ శ్రీరంగనాథుని సంపూర్ణ కృపాకటాక్షాన్ని పొందిన దైవ సంపన్నుడు, మణవాళ మహాముని.

మణవాళ మహాముని– *యతిరాజ వింశతి, దేవరాజ మంగళం, ఉపదేశ రత్తినమాలై, తిరువాయిమొళి నూత్రందాది, ఆర్తి ప్రబంధం* వంటి దివ్యగ్రంథాలని రచించటమే కాకుండా, రామానుజనూత్రంరాది, ఆచార్యహృదయం, శ్రీవచనభూషణం, తత్త్వత్రయం, ముముక్షుప్పడి అనే దివ్యప్రబంధాలకి, వ్యాఖ్యానాలు కూడ వ్రాశారు. ఆయన ఒక మహాజ్ఞాని, ఆయన రచనలలో శ్రీవైష్ణవ అమృతధారలు కట్టలు తెంచుకొని పరవళ్ళుత్రొక్కాయి.

ఆ అమృతాన్ని గ్రోలిన ఎంతోమంది శిష్యులలో, ప్రతివాది భయంకరఅణ్ణన్ చిరఃస్మరణీయుడు అయ్యాడు. ఒకసారి అణ్ణన్ తన గురువుగారితో, తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం వెళ్ళగా, అప్పుడు, మణవాళ మహామునివారు తన శిష్యుడు వైపు తిరిగి, ఆ స్వామిమీద సుప్రభాతం చెప్పమని అడుగుతాడు–అంతే, ఆ సరస్వతీ మాత అణ్ణన్ చేత, ఆ స్వామి సుప్రభాతాన్ని, స్తోత్రాన్ని, ప్రపత్తిని, మంగళశాసనాన్ని రసోజ్జ్వలంగా, శ్రవణానందంగా పలికించింది. ముకుళిత హస్తాలతో పులకిత నేత్రుడై, జన్మచరితార్థం అయిందని, ఆ స్వామిని తన మనో నేత్రంలో నిలుపుకుని ఆనందపరవశుడైనాడు అణ్ణన్. పరమానందభరితుడైనాడు ఆచార్య మణవాళమహాముని. అందుకే 600 సంవత్సరాలనుంచి, ఈరోజుకీ, సదా ఆ సూర్యచంద్రాదులు ఉన్నంతవరకూ, ఆ స్వామి సుప్రభాతం అన్ని దేవాలయాలలో, అందరి ఇళ్ళల్లో మారుమోగుతూనే ఉంటుంది. గురువుల అనుగ్రహం అలా ఉంటుంది మరి, రూపుదాల్చిన భగవత్ స్వరూపాలు ఆచార్యులు. అందుకే వేదం 'ఆచార్య దేవోభవ' అన్నది.

'ఆత్మావై పుత్ర నామాసి' అన్నట్లుగా, భగవద్రామానుజాచార్యులే, మణవాళ మహామునిగా అవతరించారంటారు. తైత్తిరీయ ఉపనిషత్‌లో చెప్పినట్లుగా, గురు–శిష్య సంబంధాన్ని తాను తు.చ. తప్పకుండా ఆచరిస్తూ, విష్ణుతత్త్వాన్ని యావత్ప్రపంచానికి బోధించిన, శ్రీవైష్ణవాచార్యులలో మేలుబంతి ఆచార్య మణవాళ మహాముని తన శేషజీవితాన్ని శ్రీరంగంలో గడిపారు.

ఆయన చూపిన జ్ఞాన కిరణాలు మోక్షసోపానాలు. ఆ ఆచార్యులు చూపిన ధర్మమార్గంలో నడుస్తూ, నిరంతరం ఆ శ్రీవేంకటేశ్వరుణ్ణి శరణాగతి కోరుదాం.

మణవాళ మహాముని తిరువడిగళే శరణం!

ఉత్సాహం కంటే గొప్ప బలం లేదు

శ్రీభాష్యము

(ప్రథమ, ద్వితీయభాగాలు)

వ్యాఖ్యాత- కందాడై రామానుజాచార్యస్వామివారు
పుటలు-1వ భాగం(280పుటలు), 2వ భాగం(270పుటలు)
మొత్తం-550 పుటలు, వెల-రూ.600/-(రెండుభాగాలు కలిపి),
ప్రతులకు - శ్రీమతి ఎన్.రంగనాయకమ్మ,
ఇ.నెం.7-1-110, రెడ్డి ఎన్‌క్లేవ్, దేవుని ఆల్వాల,
హైదరాబాద్ - 500 010;
ఫోన్ - 92473 55355, 97041 68678.

భారతదేశం ఆస్తికశిఖామణులతో కూడి అనాది కాలం నుండి భగవంతుడిపై భక్తి విశ్వాసాలతో వర్ధిల్లుతూ వస్తున్నది. దీనికి మూలకందాలైనవి వేదాలు, పురాణాలు, స్మృతులు, శ్రుతులు వంటివి. ఈ కోవకు చెందినవే భాష్యాలు. భాష్యాలలో అగ్రగణ్యమైనది 'శ్రీభాష్యము'. దీనిని భగవద్రామానుజులు అనుగ్రహించారు.

శ్రీమన్నారాయణుడు యథార్థతత్త్వాన్ని ప్రకటించి ప్రతిష్ఠించడం కొరకు భగవద్ రామానుజులను అవతరింపజేయగా, వారు ఆస్తికలోకానికి 'వేదార్థ సంగ్రహము' అందించి అంతటితో తృప్తి చెందక పదార్థవివేకాన్ని కలిగించే 'వేదాంతదీపాన్ని' వెలిగించి ప్రపంచానికి దారిచూపారు. కానీ, శుష్కవాదనలతో ఢీకొనే మదగజాలకు అంకుశంగా 'శ్రీభాష్యాన్ని' రాసి జ్ఞానోదయం గావించారు.

